



ఆంధ్ర సచిత్ర వారపత్రిక
7-6-74
55 పైసలు




చిత్ర విశేషాలు



మే 2, 3 తేదీంలో హైదరాబాద్‌లోని కళాభవన్‌లో జరిగిన రామాయణ చిత్రాల ప్రదర్శనంలో యీ ప్రక్క చిత్రం పలుర్ని ఆకర్షించింది హనుమంతుని తోకకు నిప్పు. చిత్రకారిణి: కుమారి పద్మ.


పై చిత్రం

ఇద్దరు కూర్చొని, 90 కిలోల సామాను తీసుకువెళ్లడానికి వీలుగా వుండే ప్లాస్టిక్ కారుని ఫ్లోరిడాలోని స్ప్రింగ్ – హాన్‌గార్డు సంస్థ రూపొందించింది. 'సిటీ కార్' అన్న పేరు గల ఈ కారు పట్టణంలో తిరగటానికి ఉపయోగించవచ్చు. ఆరు వోల్టుల బ్యాటరీలతో గంటకి 45 కిలోమీటర్ల వేగంతో నడుస్తుంది. బ్యాటరీలని అవసరం అయినప్పుడు ఇళ్లలోని కరెంటుతో తిరిగి ఛార్జి చేసుకోవచ్చు. 100 కిలోమీటర్లు ప్రయాణం చేయడానికి ఒక డాలర్‌కన్నా కాస్త ఎక్కువ మాత్రమే ఖర్చవుతుంది.



రూపాయలకు మంచి మనసుకు మధ్య
సవాల్ !
అల్లురామలింగయ్య
సమర్పించు
గీతా ఆర్ట్ ప్రొడక్షన్స్
బంట్రోతు భార్య
నిర్మాతలు
దాసరిసత్యనారాయణమూర్తి
అల్లు అరవింద్...
మాటలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం
దాసరినారాయణరావు
VEEKAY
ప్రభాస్ ఎంటర్‌ప్రైజెస్ నవయుగ

—లోకం పోకడ——ఊ. మెన్—



ఆంధ్ర సచిత్ర వారపత్రిక

వ్యవస్థాపకులు :
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు
(1938 – 1972)
శుక్రవారం : 7- –1974
(శ్రీఆనందనామ సం. జ్యేష్ఠమాస బ. విదియ
సంపుటము : *67* సంచిక *41*
స్థాపితం : 1908
సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ
ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-3.
సంవత్సర చందా – రు. 31–20 పై.
ఆరుమాసాల చందా – రు. 15–60 పై.
విడి ప్రతి వెల 55 పైసలు

విషయానుక్రమణిక

శ్రీమతి "ఉషారాణి" గారి 'మమతల వంతెన' ఈ వారంతో పూర్తి అయింది. శ్రీమతి రాధారాఘవ్‌గారి 'రెండు పువ్వులు' - కొత్త సీరియల్ కథ పోయిన వారం నుంచే ప్రారంభమైంది!

పై వారం నుంచి శ్రీమతి బొమ్మ హేమాదేవి గారి 'శుభోదయం' కథ ప్రారంభించాలనుకుంటున్నాము.

మనలోమాట

* * *

మేనెల 15వ తేదీ నుంచి తపాలా రేట్లు పెరిగాయి. ఈ మార్పును రచయితలు, పాఠకులు యీ పాటికే గుర్తించి వుంటారని అనుకుంటున్నాము.

* * *

డాక్టర్ సలహాలకు, ప్రశ్నావళికి, తమ సందేహాలను పంపేవారు శీర్షిక పేరు కవర్‌పై, లేదా కార్డుపై రాస్తూ సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వార పత్రిక, గాంధీనగరం, విజయవాడ-3. అన్న చిరునామాకి పంపించాలి.

* * *

కథలు పంపేవారు "రచన సొంత"మేనన్న హామీ పత్రం పంపటం మరిచిపోతే వారి కథ ఆ కారణంచేత కూడా ప్రచురణామోదం పొందకపోయే ప్రమాదం వున్నదని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము.

'పరమాణుశక్తి' ప్రపంచంలో పాటవ పరీక్ష నెగ్గిన 'భారత్'

మే 18వ తేదీ నాడు, రాజస్తాన్‌లోని జోథ్‌పూర్ సమీపంలోగల ఒక అజ్ఞాత ప్రాంతంలో అకస్మాత్తుగా భూగర్భస్థ సంచలనం ఏర్పడి, అదివరకులేని ఒక 'గుట్ట' అందంగా పైకి లేచింది.

ఈ చిన్న 'గుట్ట' ఎత్తు తక్కువేకాని భారతదేశ ప్రతిష్ఠను ఇది అంతర్జాతీయంగా ఎంతో ఎత్తుకు తీసుకుపోయింది.

18వ తేదీ ఉదయం 8 గంటల 5 నిమిషాలకు భారత దేశం మొట్టమొదటి "ప్లుటోనియమ్ అణు పాటవ" పరీక్షను చేసింది. సాయంకాలానికల్లా వాతావరణంలో ఎటువంటి ధాతు ధార్మిక కిరణ ప్రసారాలు ప్రారంభం కాలేదు. అన్ని పత్రికలు, రేడియోలు— "గచ్చిచ్చ భూమి లోపల నూరు మీటర్ల దిగువ జరిగిపోయిన ఇరవది పదిహేను టన్నుల అణు ప్రేలుడుని పతాకశీర్షికలెత్తి, ప్రత్యేక శీర్షికలెత్తి భూమ్మీద విస్తారంగా ప్రసారం చేశాయి!" భారత దేశం భూగర్భస్థ అణు పాటవ పరీక్షను ఎంతో గుంభనగా, గంభీరంగా చేసిందన్నదే వాటి సారాంశం.

'అన్న వస్త్రాల' ఉత్పత్తికై అహర్నిశలు సతమతమైపోయే భారతదేశం 'అణ్వస్త్రాల'ను చేయబోదని, అణుశక్తిని శాంతంగా, ప్రశాంత వాతావరణంలోనే వాడుకుంటుందని మరోసారి ప్రభుత్వం ప్రకటించటంలో ఆశ్చర్యం లేదుకాని, సగటు మనిషి దృష్టిలో "చైనావాడే కాదు మన వాడుకూడా ఆటమ్ బాంబులు" చేయగలడన్న ధీమా ఏర్పడి పోవటం గమనించదగ్గ విషయం.

1967 అక్టోబర్ 16న "తుంబా" నుంచి. "దేశవాళి రాకెట్"ను అంతరిక్షంలోకి ఎగరేసినప్పుడు శాస్త్ర ప్రపంచంలో భారతదేశం కీర్తి యినుమడించింది కాని మామూలు మనిషి కది అంతగా అనిపించలేదు. కాని యిప్పుడు; భూమిలోపల కృత్రిమ అగ్నిపర్వత సంచలనం లాంటిది సృష్టించిన భారత "అణుశక్తి"—17 సం. ల క్రితం నెహ్రూగారు ఎన్నో కమ్మని కలలు కంటూ ఏర్పాటు చేసిన 'భారత అణుశక్తి సంఘం' ఘనత—యిప్పుడు యింటింటా వినిపించింది. ఈ సారిచేసిన అణు పాటవ పరీక్షలో ఉపయోగించిన 'ప్లుటోనియమ్' అణువూ మనదే. దాని "విచ్ఛిత్తికై ఉపయోగించిన సాధనాలూ మనవే"నని చెప్పిన శాస్త్ర వేత్తలు రామన్న, సేత్నాగారలు కూడా మనవాళ్ళే!

ఇది చాలా చిన్న అణుశక్తి ప్రేలుడు అని ఎవరైనా అంటే అన్న ప్రాశన నాడే ఆవకాయ ముద్దలు ఎవరూ మింగబోరని జవాబు చెప్పవచ్చును. ఈ 'అంతర్గత ప్రేలుడు' అంటే అపాయకరమైన ధాతు ధార్మికకిరణాలను వాతావరణములోకి పొక్కకుండా చేసే "యింప్లోషన్" 'పనివాడి తనం కూడా' చాలా అద్భుతంగా మన శాస్త్రకారులకి అబ్బిందని, కొంత మంది నిపుణులు, రాజస్తాన్‌లో "అణుపాటవ పరీక్ష" గురించి వ్యాఖ్యానిస్తున్నారు. కనుక—'రత్నగర్భ'గా పేర్గాంచిన భారతదేశంలో ఖనిజాలు, యింధన ద్రవ్యాలు ఎంతెంతలోతున వున్నా నిరపాయకరంగా వెలికి లాగటానికి ఈ 'అణుశక్తి'ని మన వాళ్ళు వాడుతారని ఆశపడ్డంలో తప్పు లేదేమో. ఈ ప్రయోగాన్ని సాధించిన వారందరికీ అభిప్రాయ భేదం లేకుండా జే జేలు కూడా అందవలసియున్నది.

[వీరాజీ]

సీరియల్

...రెండు పువ్వులు

రాధారాఘవ

2

(గత సంచిక తరువాయి)

> **జరిగిన కథ :** మధు ఢిల్లీలో ఒక పెద్ద ఉద్యోగి. ఆంధ్రుడు. యింటి వారి అమ్మాయి సుషమ తరచుగా అతని వాటాలోకి వస్తూంటుంది. ఆమెకు దక్షిణాదివారన్నా, వారి పిండి వంటలన్నా ప్రీతి యెక్కువ. మధు మాగజైన్లు అవీ ఆమెకిస్తూంటాడు.

ఆ యింట్లోకొచ్చిన క్రొత్తలో ఒక అది వారం సాయంత్రం మెడ్రాస్ హోటల్లో ఏదైనా టిఫిన్ తిని, కరోల్ బాగ్‌లో కొంచెం సేపు తిరిగొద్దామని తన కారు తీశాడు మధు.

మిల్క్ బాత్ మంచి కాటోలు సోల సీసా అతో వస్తూ ఎదురయింది సుషమ.

"మంచి శకునం"అంటూ నవ్వాడు మధు.

"ఎక్కడి కెళ్తున్నారేమిటి?" అనడిగింది. చెప్పాడు.

"ఎంతచెడ్డవారు! దోసెంటే నా కెంతో యిష్టమని అన్నిసార్లు చెప్పానే, మర్యాదకైనా రమ్మని అడిగారా?"అంటూనిష్ఠూర మాడి, ప్రక్కనే ఉన్న తండ్రితో, "చూశారా, డాడీ! రావుసాబ్ మంచాయన కాదంటే మీరు నమ్మరు—ఇప్పుడైనాఒప్పుకుంటారుగదూ ?" అంది కొంటెగాకళ్లెగరేస్తూ.

"వస్తానంటే. ఒద్దంటారేమిటి-రావుసాబ్ ? అంతగా వెళ్లాలనుంటే నువ్వూ వెళ్లు. కావల్సినన్ని దోసెలు తినిరా" అన్నాడు తండ్రి.

మధుకూడ నవ్వుతూ చూశాడు.

సుషమ ముఖం మతాబాలా వెలిగిపోయింది.

"నిజంగానేనా? అయితే రమ్మంటారా మరి ?— తీసుకెళ్తారుగదూ" అంది యింత ముఖం చేసుకుని.

చిన్నపిల్లలా అడుగుతోన్న ఆ అమ్మాయిని చూసి, మధు తెల్లబోయాడు.

అసలే ఆ అమ్మాయివి పెద్దకళ్లేమో, దానికితోడు, మీనాల్లాంటి ఆ కళ్లను కాటుకరేఖలతో అందంగా తీర్చి దిద్దడంవల్ల మరింత విశాలంగా కనిపిస్తున్నాయి.

"ఒన్లీ టెన్ మినిట్సంతే. ఎక్కువ ఆలశ్యం చేయనులెండి." అంటూ కన్ను మూసి తెరచేలోపుల, లోపలికు ఒక్క గెంతు గెంతింది.

కూతురు వెళ్లినవైపే ఆప్యాయంగా చూస్తూ "పిచ్చిపిల్ల! ఏం తెలీదు." అంటూ మురిపెంగా చూశాడు తండ్రి.

మధుకి ఒక్కక్షణందాకా ఏం అర్థం కాలేదు. నిజంగానే, సుషమ వస్తుందో? లేక సహజంగా ఆ పిల్లకున్న చిలిపితనంవల్లే అలా అడిగిందో తెలీలేదు.

తండ్రికూడ, కాదని ఏం వారించలేదు. ఆ లెక్కని పరాయి మగాడివెంట, కూతుర్ని షికారు పంపడాన్కి, ఆయనకేం అభ్యంతరం లేదా ?

నిజంగానే వచ్చే ఉద్దేశ్యంలో ఉంటే, తను వెళ్లిపోతే, వాళ్లేమైనా అనుకోవచ్చు. పిలవు తారుకూడ.

ఇంతకూ ఏంజేయడం ??

"వెళ్లడమా? ఉండడమా ?"— ఎటూ తేల్చుకోలేక సతమతమవుతోన్న మధు సమస్యని సుషమ తీర్చిపారేసింది.

"సారీ. ఆలశ్యంచేసేశానా ?" అంటూ హడావుడిగా వచ్చింది.

ఆ అమ్మాయి అందాన్నిచూసి మధు కళ్లు తిప్పుకోలేక పోయాడు. "ఏ శిల్పి, రాత్రీ పగలూ కష్టపడి, అలా సువర్ణ ప్రతిమను తయారు చేయలేదుగదా ?" అనుకున్నాడు.

పిపుమీద సగంవరకూ వచ్చేలా కత్తిరించిన జుట్టు, సున్నగా, మెత్తటి పట్టులా జారిపోతూ, గాలికి రెప రెప లాడుతోంది, అరుణ వర్ణంలో ఉన్న లుంగీ. అదేరంగు కమీజు, శరీర ఛాయలో కలిసిపోయి, సంధ్య కాంతుల్లో అందంగా ప్రతిబింబిస్తున్నాయి. హడావుడిగా తయారవడంలో, బుగ్గల కద్దిన రూజ్ ఎక్కువైనా కూడ, సూర్య కాంతితో కలిసి వింత అందాన్నే యిస్తోంది. ఆ సిరెండలో, ఆ అమ్మాయి అప్సరసలా, బంగారు బొమ్మలా, కాంతి పుంజంలా మెరిసిపోతోంది.

మధుకి, తను భూమ్మీద ఉన్నట్టనిపించడంలేదు. స్వర్గలోకం లోకి తేలిపోతున్నట్లుగా ఉంది.

ఎప్పుడొచ్చి సుషమ తన ప్రక్క కూర్చుందో, కారు ఎలా స్టార్టు చేశాడో అతనికే తెలీదు.

"బై !" అంటూ కిన్నెర కంఠంతో, తండ్రికి చెయ్యూపుతోన్న సుషమ మాటలతో యీ లోకం లోకి వచ్చాడు.

ఆయనా, నవ్వుతూ చెయ్యూపుతున్నాడు.

వయస్సులో ఉన్న కూతుర్ని, ధైర్యంగా తన వెంట పంపుతోన్న ఆయన నమ్మకానికి, మధు మనస్సు ఆర్ద్రత చెందింది.

ఉన్నది క్రొత్త ప్రదేశమైనా, రక్త సంబంధీకులు దగ్గర లేకపోయినా, వారి ఆప్యాయానురాగాలతో ఆ కుటుంబంలో ఒక వ్యక్తిలా కలిసిపోయాడు. వారి ఆత్మీయత అతన్ని పూర్తిగా కరిగించేసింది.

కారు రోడ్డుకి ఒక ప్రక్కగా పార్కుచేసి, మధు క్రిందకు దిగాడు. సుషమ అతన్ని అనుసరించింది. ఇద్దరూ కలిసి, అక్కడున్న మెడ్రాస్ హోటల్లో అడుగు పెట్టారు. మధు ఫేమిలీ రూం వైపు దారితీసి, ఒక ప్రక్కగా ఉన్న టేబుల్ దగ్గర సుషమను కూర్చోబెట్టి, తనూ కూర్చున్నాడు. ఆ అమ్మాయి, "ఇంక తినలేను మొర్రో" అనే దాకా ఇడ్లీ, దోశ, వడ ప్లేటు తర్వాత ప్లేటు తెప్పిస్తూనే ఉన్నాడు.

అక్కడున్న అందరి కళ్లూ సుషమ మీదే ఉన్నాయి. అంత అందమైన అమ్మాయి, తన ప్రక్క కూర్చుని కబుర్లు చెప్తూంటే మధుకి ఎంతో గర్వంగా ఉంది; తృప్తిగా

ఉంది. అన్నిటికీ మించి ఏవేవో తెలీని లోకాల్లోకి వెళ్లిపోతోన్నట్టుగా ఉంది.

ఈ సంఘటన తర్వాత, ఆ అమ్మాయితో సన్నిహితత్వం, చనువు మరీ ఎక్కువయాయి



మధుకి. అడపా దడపా, ఆ అమ్మాయితో కలిసి సినిమాలకూ, షికార్లకూ తిరగడం సామాన్య విషయమైపోయింది.

"మీ మదరాసీ వాళ్లూ......" అంటూ మాటల్లో ఏదో చెప్పబోతుంది సుషమ.

"చిన్న సవరణ. మేము మదరాసీలం గాదు— ఆంధ్రులం. ఈ విషయం చాలా సార్లు చెప్పినట్టు జ్ఞాపకం" — అంటాడు ఓరగా చూస్తూ, మధు.

"ఓ. సారీ. మర్చిపోయాను" అంటూ ముత్యాలు జాలువారినట్టుగా గలగలానవ్వేస్తుంది.

"మా పంజాబీవాళ్లు, ఇళ్లు అద్దెకు పంజాబీలకు మాత్రం చస్తే యివ్వరు ... ఎందుకో తెలుసా?" అంది సుషమ.

"ఏముందీ ? సింపుల్ లాజిక్. ఇద్దరాడాళ్ల దెబ్బలాట గురించి చెప్పాలీ అంటే, మాలో జట్టూ జట్టూ పట్టుకున్నారని చెప్తుంటారు. అలాగే ఇద్దరు సర్దార్జీలు కలిశారంటే జూడీ, జూడీ పట్టుకు దెబ్బలాడు. కోవాల్సొస్తుందన్నభయమేమో?"

'మీరేం చెప్పినా మరీ తమాషాగాచెప్తారు గాని, నిజం చెప్పాలీ అంటే— చాలా పేచీలు పెడ్తారు- మాపంజాబీవాళ్లతోచిక్కులెక్కువ'

"అరె! వాటె వండర్ ! – మీ వాళ్ల గురించి నువ్వే ఘోరంగా చెప్పేస్తున్నావ్ ?'

"అందులో తప్పేముంది? ఇది అందరూ అనుకునే విషయమే. అందుకే సాధారణంగా మా పంజాబీవాళ్లు ఫస్టు ప్రిఫరెన్సు- యింటి కోసం, మీ మద్రాసీవాళ్లకే...సారీ.చూశారా? మళ్లీ మద్రాసీ అనే వచ్చేసింది" అంటూ నవ్వేసింది.

మల్లెల్లో తెల్లదనం, గులాబీల్లో ఎర్ర దనం మిళాయించినట్టుండే ఆ ముఖం, నవ్వే సరికి, కంది, మరింత ఎర్రగా, దానిమ్మ పండులా అయింది.

ఆ అందాన్ని తనివిదీరా చూస్తూ "ఊం. ఎందుకివ్వాలని చూస్తారుటా — మద్రాసీ వాళ్లకి? ఫస్టు థింగ్ దెబ్బలాడరని, సెకండ్?" అంటూ రెట్టించాడు మధు.

"ఏముందీ ? ఇల్లు పాడు చెయ్యరు. ఎప్పుడూ యింటిని శుభ్రంగా ఉంచుకుంటారు. ఇంటద్దెకు తిప్పలు పెట్టక ఫస్టుకల్లా యిచ్చేస్తారు ముఖ్యంగా, "ఇది చెయ్యలేదు అది చెయ్యలేదు అంటూ బాధించరు"

"వహ్వా ! నీ తెలివితేటలకు మన స్ఫూర్తిగా అభినందిస్తున్నాను సుషమా."

ఇవన్నీ మీరూ పాటించాలి సుమా'' అని ఇండైరెక్టుగా చెప్పడమేకదా దీనర్థం. అంటే?— నేనూ అలాగే ఉండాలనిగదూ ?— ముందరికాళ్లకు బంధం గొప్పగా వేసావు'' అన్నాడు చిలిపిగా.

''తను పొరపాటు మాట్లాడేనా ?'' అనుకుని, సుషమ గాభరాగా చూసింది అతని వైపు. అదురుతోన్న క్రింద పెదవిని, మునిపంటితో నొక్కింది. నవ్వుటి సీటిపొర, కళ్లలో తళతళలాడుతూంటే, ''మీరు చాలా చెడ్డవారు రావూ సాబ్! పెడర్థాలు తీయడంలో యింత ఘటికులనుకోలేదు'' అంది ముఖం చిన్నబుచ్చుకుని.

మధు కూడా ఎంతో నొచ్చుకున్నాడు. ఎప్పుడూ కళకళలాడే ఆ అమ్మాయి ముఖాన్ని, ఆరకంగా చూసేసరికి మనస్సు కలుక్కుమంది.

''సారీ! సరదాగా అన్నానంతే. మరీ అంత సీరియస్‌గా తీసుకోవద్దు'' అంటూ అనునయించాడు.

ఒకరోజు సాయంత్రం, ఆఫీసునుంచొచ్చి, బట్టలు మార్చుకుంటున్నాడు మధు.

టిక్ టిక్‌మని తలుపు శబ్దమయింది.

''కౌన్ హై?'' అనడిగాడు లోపల్నించే.

''చోర్ హూఁ'' అంటూ జవాబొచ్చింది, వెంటనే అవతల్నుంచి.

మధు, సుషమ గొంతు గుర్తుపట్టి, వచ్చి, ''హేండ్సప్!'' అంటూ నవ్వుతూ తలుపు తీశాడు.

ఎదురుగా సుషమ, ఆ అమ్మాయి ప్రక్క మరో ఆవిడా నిలబడున్నారు.

సుషమ చిన్నగా నవ్వి, ''సారీ, మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నట్టున్నాం. చిన్న పనిమీద వచ్చాం'' అంది.

''మరేం ఫరవాలేదు, చెప్పండి.''

''ఈవిడ మిసెస్ సింగ్. మా ప్రక్కింట్లో ఉంటున్నారు. ఫోను చేయడం కోసమొచ్చారు— వాళ్ల ఫోను పాడైపోయిందట.''

ఆవిడ నమస్కారం చేసింది.

ప్రతి నమస్కారంచేసి, ''రండి'' అంటూ లోపలకు దారితీశాడు మధు.

వాళ్లిద్దరూ లోపలకొచ్చి కూర్చున్నారు.

ఆవిడను యింతకుముందు చాలాసార్లు చూశాడు మధు. ప్రక్క మేడలోనే గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉంటున్నారు వాళ్లు. ఇప్పుడైతే అలవాటైపోయిందిగాని, వచ్చిన క్రొత్తలో,

రెండు పువ్వులు

ఆవిడను చూస్తూంటే, భలే తమాషాగా అనిపించేది మధుకి. ఇంట్లో ఉన్నంతసేపూ, లంగా జాకెట్లతో తిరుగుతూ, చకచకా అన్ని పనులూ చేసుకుపోతూంటుందావిడ.

ఇలాంటి దృశ్యాలు చూసీ, చూసీ, మధు కళ్లు అలాంటివాటికి అలవాటు పడిపోయాయిప్పుడు. ఇక్కడ చాలా మందికి అదో విచిత్రపు అలవాటు. పనులు పూర్తయిపోగానే, కాళ్లూ, చేతులూ, ముఖం కడిగేసుకుని, అప్పుడు కోటాకొట్టి, లిప్‌స్టిక్, రూజ్ వగైరాలతో అలంకరించేసుకుని, నడి నెత్తిమీదకంటే యింత ముడివేస్తారు. అప్పుడు కడతారు చీర. నైలెక్సో లేకపోతే టెర్లినో ఏదో ఒకటి స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో కలిపి ఒంటిని ఉద్ధరిస్తుంది.

అప్పుడు బజార్లవెంట చక్కర్లు కొట్టడమో, ఇళ్లవెంట పెత్తనాలకు పోవడమో, అంతగా లేకపోతే నలుగురూ చేరి, నులక మంచం ఎక్కి కూర్చుని, కబుర్లు చెప్పుకుంటూ, మధ్య మధ్య వేరుశనక్కాయలు నములుతూ, స్వెట్టర్లు అల్లడమో, ఎంబ్రాయిడరీ చేయడమో, ఏదో ఒక చేతిపని చేస్తూంటారు — క్షణం వృధా చేయకుండా.

వాళ్లను చూసినప్పుడల్లా మధు నవ్వుకుంటుంటాడు — ఎప్పుడు చూసినా వీళ్లకు కాలో, చెయ్యో, నోరో ఏదో ఒకటి ఆడుతూండాలి గాబోలు అని.



''క్షేమంగా వున్నానని ఓ కార్డుముక్క రాస్తే ఏం బోయింది ?''

''పదిహేను పైసలు !''

వీళ్లకు నులకమంచాలు ఒక ప్రత్యేకత. అన్ని పర్పస్‌లకీ ఉపయోగపడుతూంటాయవి. చలికాలాల్లో. పగలు ఎండలో వేసుక్కూర్చోడానికి, ఎండాకాలంలో, రాత్రిళ్లు ఆరుబయట పడుకోడానిక్కి, బయట కూర్చుని భోజనాలు చేయాలనుకున్నప్పుడు డైనింగ్ టేబులుగా, ఇంకా బట్టలారేసుకోడానికి — ఎప్పుడే అవతారం కావాలంటే, అది దాల్చుతుంది.

ఎంత ధనవంతులైనా, ఎంత పెద్ద భవంతులున్నా, ప్రతియింటా దిష్టిపిడతల్లాయివి కనిపిస్తూనే ఉంటాయి.

అతని ఆలోచనల కంతరాయం కల్పిస్తూ, మిసెస్. సింగ్ మాట్లాడ్డం మొదలెట్టింది.

''మిస్టర్ రావ్ !'' మీరొచ్చి యింత కాలమైనా, మనం యింకా పరిచయాల స్టేజిలోనే ఉండిపోయాం. పెద్ద సిటీలలో యిలానే ఉంటుంది. ప్రక్కప్రక్క యిళ్లలోనే ఉంటున్నా ఎవరెవరో తెలీదు. ఒకదగ్గరుంటున్నప్పుడు, ఒకరికొకరం సన్నిహితులుగా ఉండాలి. మీరోసారి తప్పకుండా మా యింటికి రావాలి'' అంటూ చకచకా మాట్లాడేస్తోందావిడ.

ముప్పై ముప్ఫయి అయిదేళ్ల వయస్సుండవచ్చు. తెలుపు, గులాబీల మిశ్రమంతో కాశ్మీరీ సేబ్‌లా ఉంది. ఇంచు మించు తల కాయంత సైజులో ముడుంది. లోపలి బాడీ సైజులో జాకిట్టు వేసింది. చీర బొడ్డు క్రిందకంటే కట్టడంవల్ల, వెనుక తుంటి ఎముక వంపులన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి.

ఆవిడైతే అంత యిదిగా మాట్లాడేస్తోందిగాని, ఆవిడవైపు కళ్లెత్తి చూడ్డానికి, మధుకి మాత్రం ధైర్యం చాలడంలేదు. ఎంతసేపూ లంగా జాకిట్లూతో తిరిగే, ఆ రూపమే ఆవిడది కంటిముందు కనిపిస్తోంది. దానికితోడు, పమిటి జారి, క్రింద పడడం కూడ గమనించకుండా మరీ మాట్లాడేస్తోందావిడ. లోనెక్ జాకిట్లోంచి, ఉన్నతమైన అవయవాల సొంపు కనిపిస్తూంటే, సంకోచంతో అటువైపు చూడలేక కొంతా, తన వైపే చూసి మాట్లాడుతూండడం వల్ల, చూడకుండా ఉండడం ఎలాగో తెలీక కొంతా— నానా అవస్థ పడుతూ ఇబ్బందిగా కూర్చున్నాడు; మధు.

ఇంతలో నౌకరు కుర్రాడు 'టీ' తీసుకొచ్చాడు. ఈ రకం మర్యాదలు, యీ ఊరొచ్చాక చాలాతెలుసుకున్నాడు మధు అంతు

* చిన్నారి చిలిపిచేష్టలు *

మా నాలుగేళ్ల పాప ఓ రోజున నా దగ్గరకు వచ్చి "ఎందుకమ్మా పడుకున్నావు?" అని అడిగింది. "తలనొప్పిగా ఉందమ్మా" అని జవాబు చెప్పాను. అది ఆరిందాలా చేతులు తిప్పుతూ "నువ్వు పడుకుంటే ఇంటో పనులెవరు చేస్తారు? తమ్ముడికి పాలు ఎవరు పడతారు?" అని మళ్లీ అడిగింది. "కొంచెం సేపయ్యాక నేనే పడతానులేవే. నువ్వు విసిగించక వెళ్లి ఆడుకో" అని చెప్పి కళ్లు మూసుకుని పడుకున్నాను. అలా ఎంతసేపు నిద్రపోయానో ఏమో, తెలివి వచ్చి చూసేసరికి, బాబు కింద చాపమీద నిద్రపోతున్నాడు. పాప ఎక్కడా కనిపించలేదు. లేచి పెద్ద గదిలోకి వెళ్లిచూశాను. అక్కడ పాప, బీరువా దగ్గరగా నిలబడి, నా చీర ఒకటి తీసి దాన్ని కట్టుకోడానికి తెగతంటాలు పడుతోంది. నేను నవ్వుకుంటూ వెళ్లి "ఏమిటే యీ చీర సింగారింపు" అన్నాను. "మరేంచేయను? నువ్వేమొ పడుకున్నావు. పనులు చేద్దామని చీర కట్టుకుంటున్నాను" అంది. అది అలా అనగానే, ఒకసారి దానితో సరదాగా అన్నమాట తక్కున జ్ఞాపకం వచ్చింది.

మా పాప చిన్నా పెద్దా పనిచేయబోతే "నాలాగ, చీర కట్టుకున్నప్పుడు పనులు చేద్దువుగానీలేవే!" అన్నాను ఓసారి. అంటే నా వుద్దేశం పెద్దయ్యాక అని! మా పాప ఆ విషయం జ్ఞాపకం వుంచుకుని పనులు చేయటానికి చీర కట్టుకునే ప్రయత్నం మొదలు పెట్టింది... అల్లరిపిల్ల!!



శ్రీమతి వి. వరహాలమ్మ, న్యూఢిల్లీ.

కనే, యింటికి ఎవరు ఎలాంటి టైములో వచ్చినా సరే, టీ ఇవ్వాలని ముందుగానే నౌకర్ని హెచ్చరించి ఉంచాడు.

ఆ కుర్రాడు రావడంచూసి "ఆ పమిట కొంచెంపైకి వేసుకుంటే బాగుండును. వాడు చూసేయగలడు"అని ఎన్నో సార్లనుకున్నాడు; అక్కడికి తను చూసినా ఫరవాలేదన్నట్టు.

"మీరు అనవసరంగా శ్రమ తీసుకుంటున్నారు; కూర్చోండి; నేను కలుపుతాను" అంటూ అతన్ని వారించి, కెటిల్లోంచి టీనీరు కప్పుల్లో పోసిందావిడ.

సుషమ చమ్చాతో చక్కరతీసి, ఎవరికెంత కావాలో అడిగి, వేసి కలిపింది.

మిసెస్. సింగ్ అన్ని కప్పుల్లోనూ, పాలు కూడ కలిపి, అందరికీ తలో కప్పూ అందించింది.

మధు ఒక ప్లేట్లో క్రీమ్ బిస్కట్లు, మరో ప్లేట్లో కాజూనట్స్ పెట్టి, తీసుకొచ్చి, అందరికీ యిచ్చాడు.

"మీకు నిజంగానే చాలాశ్రమ యిస్తున్నా" అంటూ మిసెస్. సింగ్, మరోసారి నొచ్చుకుంది.

సుషమ మాత్రం, అది అతి సహజమన్నట్టుగా. మరేం మాట్లాడకుండా, టి త్రాగుతూ మధ్యమధ్య ప్లేట్లోంచి ఒకో బిస్కట్ తీసుకుతింటూ, అక్కడున్న వీక్లీలో బొమ్మలు చూడ్డంలో మునిగిపోయింది.

పుస్తకం తిరగేయడం పూర్తయే సరికి, టీ-తతంగమూ ముగిసింది.

"ఫోను చేయాలన్నారుగా?"అంటూజ్ఞాపకం చేసింది, సుషమ.

"యస్స్. అందుకే గదా వచ్చింది...ఏమీ అభ్యంతరంలేకపోతే..."అంటూ మధు వైపు చూసి, లేచినిలబడిందావిడ.

"ష్యూర్. దానికేముంది ?—చేసుకోండి" అంటూ ప్రక్క గదిలోకి వెళ్లాడు మధు.

"మీరు చేస్తూండండి యింతలో. ఇప్పుడే వస్తా"— అంటూ సుషమ కూడలేచి, అతని వెనకే వెళ్లింది—"ఫేమీనా ఇంకా రాలేదా ?" అనడుగుతూ.

ఆవిడతీరు చూస్తే, ఫోనుకోసం వచ్చిందానిలా లేదు. పరిచయం పెంచుకోవడం కోసమొచ్చినట్టుంది గాని. ఒకసారి అటూ యిటూ తిప్పినట్టే తిప్పి, "లైను దొరకడం లేదు. మరోసారి చేస్తాలెండి. మరీ అంత కొంపమునిగి పోయేటంత అర్జంటు ఏంకాదనుకోండి" అంటూ నవ్వుతూ వాళ్ల వనుసరించింది.

వెళ్తూ వెళ్తూ, ఇరుగూ పొరుగూ సఖ్యత గురించి మరోసారి లెక్చరు దంచి, మర్నాడు సాయంత్రం 'టీ'కి రమ్మని ఆహ్వానించి, మరీ వెళ్లిందావిడ.

ఆవిడ వెళ్లిపోగానే, అంతవరకూ ఉక్కిరిబిక్కిరిగా ఫీలవుతోన్న మధుకు, ఎంతో తెరిపి యిచ్చినట్లయింది.

ఆ మాటే సుషమతో అన్నాడు. "ఎందుకొచ్చిన రంధి. ఆవిడను తీసుకొచ్చి, నా పీక మీద కూర్చోబెట్టావు. ఫోను చెయ్యాలి అంటే,ఆవిడకు మరెక్కడా దొరకేలేదేమిటి?" అన్నాడు. కోపంగా.

కిలకిలా నవ్వింది సుషమ. "ఉండండి; మీ పని ఆవిడతో చెప్పేస్తాను" అంటూ తర్జనితో బెదిరించింది.

"కొంపదీసి, అంతపని మాత్రం చేయకు. ఇది చాలనట్టు, మళ్లీ అదో గొడవ."

"మీరు మరీను. పాపమావిడ, అంతాప్యాయంగా మాట్లాడుతూంటే, మీరు ఘోరంగా అంటున్నారు" అంటూ నవ్వేసి, —"పాపం! ఎన్నాళ్ల నుంచో మీ కోసం తపించి పోతోంది. కనబడ్డప్పుడల్లా, మీ గురించి తెగ అడుగుతూంటుంది. ఆఖరికీ నేళ ఫోను వంకతో వచ్చేసింది. ఏం చేయమంటారు—పోనీ ఆవిడ ముచ్చటాతీరిపోతుంది లెమ్మనితీసుకొచ్చాను"

"గొప్ప పని చేశావు. ఈసారి కేదో అయిపోయిందిగాని, మరెప్పుడూ తీసుకురాకు. అలాంటివాళ్లతో మాట్లాడ్డం నాకసలే చేతకాదు. ఏం మాట్లాడాలన్నా ఇబ్బందే" అన్నాడు చిరాగ్గా.

"రేపు సాయంత్రం 'టీ' కి కూడ పిలిచిందామె. వెళ్లరా?—ఏమిటి?" అంది. వస్తోన్న నవ్వు ఆపుకుంటూ.

"ఆ. అదోటి తక్కువింక. ఎవరెళ్తారక్కడికి. ఏదో కారణం చెప్పి, తప్పించేసుకుంటే పోయే"

"చూద్దాం. ఆవిడ మిమ్మల్ని విడిచిపెడితే గదా?

"అసలు నేను ఆఫీసు నుంచి లేటుగా,

రెండు పువ్వులు

వస్తా రేపు. అప్పుడింకేం చేస్తుంది ?"

"ఆవిడంత తేలిగ్గా వదిలే రకం కాదు లెండి. కారున్న మనుష్యులంటే ఆవిడకు మోజెక్కువ. — అప్పుడప్పుడు లిఫ్ట్ అడ గొచ్చని. అలాంటిది ఒంటరి మనిషి. — విడిచిపెడుతుందా?...

అయినా ఒకరోజు తప్పించుకుంటారు. రెండు రోజులు తప్పించుకుంటారు. ఎందు కొచ్చిన గొడవ ? వెళ్లొచ్చేయండి... ఆవిడేం భూతమూకాదు రాక్షసీకాదు. కాదంటే పాపం ! ఆవిడకు మగాళ్లంటే, కొంచెం ఆపేక్ష ఎక్కువ. అంతే. మరేంగాదు."

"అమ్మబాబోయ్ !" కామినీ పిశాచం అంటారే. అలాగా ??"

"ఏమిటి ??— అంటే ?...దానర్థం..."

"ఏంలేదులే."

"కాదు; చెప్పండి—అంటే, ఏమిటో ?"

"ఇప్పుడు కాదు. మరోసారి. నాకు బజార్లో అర్జంటు పనుంది — ఇప్పటికే మీ పుణ్యమాఅని లేటయిపోయా."

"సరే. అయితే నేను వెళ్తున్నా. రేపు మీరే నెగ్గుతారో, ఆవిడే నెగ్గుతుందో చూస్తాగా" సవాలు చేస్తున్నట్టుగా అంది.

"తప్పకుండాను. నాకేం భయమా ?— వెళ్లకపోతే తల తీసేయరుగదా ?"

"అదీ చూస్తాను. బెట్ చేస్తారా ?

"ఓ—ఎనీ బెట్."

"మీరోడిపోతే, వచ్చే సండే ప్లాజాకి తీసుకెళ్లాలి — మంచి పిక్చరొస్తోంది."

"ఓ. కె! అంగీకారమే."

"చూస్తాగా ?—వెళ్లొస్తా—గుడ్ నైట్!" అనేసి సుషమ వెళ్లిపోయింది.

పాపం ! మధు ఘరానాగా పందెమైతే కట్టాడుగాని, సుషమే నెగ్గింది.

ఆ మర్నాడు, మధు నిద్రలేచి, బాత్ రూం కెళ్తుంటే, మిసెస్. సింగ్ చూసి, నవ్వి చెయ్యూపింది. అప్రయత్నంగానే మధు కూడా చేయి ఊపాడు. "సాయంత్రం పెంద ళాడే రావడం మర్చిపోకండేం ?" అంటూ అక్కడ్నించే ఆర్డరు జారీ చేసిందావిడ.

ఏమనాలో తెలీని, మధు, "ఊఁ"అంటూ తలూగించాడు.

ఆ సాయంత్రం అతను యింటికొచ్చే వేళకు ఆవిడ బయట నిలబడి, సబ్జీ వాలాతో కూరలు బేరమాడుతోంది.

మధుని చూసి, నవ్వి, "మళ్లీ పైకెం దుకు ? వచ్చేయండిలా" అంది.

"ఇప్పుడే ఆఫీసునుంచి వస్తున్నా. స్నాన మదీ చేసి, అరగంటలో వస్తా"అనిచెప్పి వచ్చేశాడు.

"ఆవిడన్నిసార్లు చెప్పినప్పుడు, వెళ్లకపోతే బాగుండదు. మరీ బొత్తిగా గుమ్మం ప్రక్క గుమ్మం అయిపోయింది. తెల్లారి లేస్తే, పది సార్లు ముఖాలు చూసుకోవాలి" అనుకుని, వెళ్లడానికే తీర్మానించుకున్నాడు ఆఖరికి.

వాళ్లింటికి వెళ్లేసరికి, ఆవిడగుమ్మంలోనే ఎదురయి సాదరంగా ఆహ్వానించింది. "ఈయన మిస్టర్. సింగ్— మా శ్రీవారు" అంటూ పరిచయం చేసింది భర్తని.

ఆయన సెంట్రల్ గవర్నమెంటులో చిన్న ఉద్యోగస్థుడట. ఇల్లంతా చక్కగా అధునాత నంగా అలంకరించి ఉంది. ఆ యిల్లు వారి స్వంతమేనట ఫస్టుఫ్లోర్, బర్సాతీ (పైడాబా మీదున్న గదులు) అద్దెకిచ్చేసి, వాళ్లు క్రింద ఉంటున్నారట.

ఇండియా, పాకిస్తాన్ పార్టిషనప్పుడు, వచ్చేసిన కాందిశీకులకి, నివసించడాన్కి గవర్న మెంటు ఆస్కారం కల్పించింది.

ఆ తర్వాత వాళ్లుస్వశక్తితో ధనమార్జించి, అంది మీద అంతస్థుల కంతస్థుల లేపి, అద్దెల కిస్తుంటారు. ఢిల్లీలో. వాళ్ల యిల్లూ, ఆ బాపతుకి చెందినదేనట.

"రండి. టీ తీసుకుంటూ మాట్లాడు కుందాం"అంటూ డైనింగ్ హాల్లోకి దారి తీసిందావిడ.

అక్కడ టేబులు నిండా, రకరకాల పదా ర్థాలు ప్లేట్లలో పెట్టున్నాయి. టీకి పిలవడం అంటే, ఏదో ఒకటిరెండు స్వీట్లూ హాట్లూ కాక,బోలెడన్నిరకాలుపెడతారుయిక్కడివాళ్లు.

మిస్టర్ సింగ్ కూడ చాలా సరదా మనిషి. సంభాషణలో తెగ జోక్ లేస్తూ నవ్విస్తుం టాడు—అందర్నీ.

ముందు భయపడ్డట్టుగాకాక, వారింట్లో సైము, కబుర్లతో సరదాగానే గడిచిపోయింది మధుకి.

ఆ తర్వాతకూడ మధు అప్పుడప్పుడు వారింటికెళ్తుండే వాడు. వాళ్ల దంపతులు కూడ తరచు వస్తుండేవారు. ఒక్కోరోజు పేకాట వేశారంటే, రాత్రి ఎంత ప్రొద్దు పోయినా సరే లేచేవారేకాదు. తరచు భోజనాని క్కూడ ఆపేసేది, మిసెస్. సింగ్.

శలవు రోజు లొస్తే, అందరూ కలిసి

సరదాగా పిక్నిక్‌కో, చుట్టు ప్రక్కలున్న ప్రాముఖ్యమైన ప్రదేశాలు చూడ్డానికో బయలుదేరి వెళ్లి సరదాగా గడిపి వచ్చేవారు. ఒకసారి బుద్ధ జయంతీ పార్కుకెళ్తే మరో సారి జూకి ప్రోగ్రాం పెట్టేవారు.

నాలుగు రోజులు ఎక్కువ శలవులు కలిసొస్తే, ఆగ్రాకో జయపూర్‌కో, ముస్సోరీకో, లేకపోతే మధుర, బృందావన్‌లకో వెళ్లేవారు.

ఎప్పుడూ ఏదో ఒక ఎడతెరిపి లేని ప్రోగ్రాములు యిలా ఉంటూనే ఉండేవి.

ఢిల్లీ వెళ్లడం అనే సరికి, మొదట్లో దూరమనీ, భాష తెలీదనీ భయపడ్డ మధుకి, యిప్పుడా ఢిల్లీతోటే ఏదో తెలీని అవినాభావ సంబంధం ఏర్పడిపోయింది· ఇరుగు పొరుగు వారి స్నేహాభిలాష, మిత్రుల సుహృద్భావం, ఇంటివారి ఆత్మీయత — మధుని ఉక్కిరిబిక్కిరిచేస్తూ, తను పరాయి దేశంలోఉన్నాననీ, అయినవాళ్లందరకూ దూరంగా ఉండి జీవిస్తున్నాననీ అనేటటువంటి తలంపునే కలగజేయ నీయడంలేదు.

పగలంతా ఆఫీసువర్కు, ఇంట్లో ఉన్నంతసేపూ మిత్రుల రాకపోకలు, శలవు రోజుల్లో తీరికలేని ప్రోగ్రాములతో మధుకి క్షణం కూడ ఖాళీ ఉండడంలేదు. దానికితోడు నౌకరు సౌత్ ఇండియన్ కావడంవల్ల, ఎప్పుడూ ఎవరో ఒక మిత్రులు "సండే బ్రేక్‌ఫాస్ట్‌కి మీ యింటికి వస్తున్నాం ఇడ్లీ, సాంబార్ కావాలనో, ఇవ్వేళ రావుసాబ్ మనందరికీ టీతోపాటు "వడ" యిస్తారట అంటూనో ముందు నోటీసు ఇచ్చి, యివ్వకుండా కూడా దిగిపోతూండేవారు.

మధు అందగాడు, బ్రహ్మచారి. మంచి పొజిషన్లో ఉండడంవల్ల అతని పర్సు ఎప్పుడూ బరువుగా ఉంటుంది. కారు సరేసరి.—ఇంక అతనికి మిత్రుల కొదవేమిటి ?

ఇంటి దగ్గర్నుంచి మధుకి చాలా ఉత్తరాలొచ్చాయి. ఎప్పటికప్పుడు జవాబు వ్రాద్దామను కుంటూనే అశ్రద్ధ చేసేవాడు. ఎప్పుడు వ్రాయడానికూర్చున్నా ఏదో ఆటంకం. అంతగా లేకపోతే సుషమొచ్చి కూర్చుని తీరిగ్గా కబుర్లు మొదలుపెట్టేది. "నన్ను డిస్టర్బ్ చేస్తే ఊరుకునేది లేదు సుమా" అంటూనే తనూ బద్ధకించేసేవాడు — వ్రాయడాన్కి.

ఒకరోజు తండ్రిదగ్గర్నుంచి బాంబ్ షెల్ లాంటి ఉత్తరం వచ్చింది.

"ఏకంగా యింత పెద్ద ఉత్తరం ఏమిటి? కొంపదీసి పెళ్లి చేసుకు వెళ్లమని కాదు గదా?" అనుకుంటూ భయంగా చింపాడు.

చిరంజీవి మధుని,

నీ తండ్రి చిరాయువుగా దీవించి వ్రాయునది నీ దగ్గర్నుంచి ఉత్తరాల్లేనందున, నీ క్షేమ సమాచారాలు మాకేం తెలియడం లేదు.

ఎంత తీరుబడిలేని ఉద్యోగం చేస్తున్నప్పటికీ, కనీసం అప్పుడప్పుడైనా నీ క్షేమంతెలియ చేయడం నీ మొదటి కర్తవ్యం.

దూరాభారంవలన నీ సంగతి తెలియక, మాకు ఆందోళనగా ఉంటోంది. ముఖ్యంగా మీ అమ్మ సంగతి చెప్పే అక్కర్లేదు.

నువ్వెళ్లేటప్పుడు, అంతదూరం పంపడం ఎవరికీ యిష్టంలేక, ఆ ఉద్యోగం వదులుకోవడం మంచిదని అనుకున్నాంకూడ. కాని నచ్చకపోతే అప్పుడే వచ్చేయొచ్చని, పంతంగా వెళ్లావు. అందుకు తగినట్టుగానే, దైవానుగ్రహంవలన, నువ్వు పనిచేసే కంపెనీ ఒక్కసారిగా అభివృద్ధిలోనికివచ్చి, నువ్వుకూడ పై అధికారుల మన్ననలు పొంది, అచిర కాలంలోనే ఉన్నతస్థాయిని అందుకున్నావు.

ఇలాంటి స్థితిలో శలవు అడగడం మంచిది కాదనీ, కనుక యిప్పట్లో రాలేననీ వ్రాస్తే, ఏదో సరిపెట్టుకున్నాం.

నువ్వు వెళ్లి అప్పుడే చాలా కాలం అయిపోయింది. నీ దగ్గర్నుంచి ఉత్తరాలురావడమూ మానేశాయి. ఏమనుకోడానికీ కూడ మా కర్థంగావడంలేదు...కనీసం మా ఉత్తరాలైనా అందుతున్నాయోలేదోఅంతకంటేతెలీడంలేదు.

నీ కోసం మీ అమ్మ చాలా బెంగ పెట్టుకుంది. రోజూ రాత్రిళ్లు కలల్లోకి వస్తున్నావంటూ ఈ మధ్య అర్ధరాత్రి లేచి కూర్చుంటోంది. "మనదేశంకాదు; మన భాష కాదు. ఏం తింటున్నాడో? ఎలా ఉంటున్నాడో?" అంటూ ఏకగొడవ.

"ఎందుకొచ్చిన ఉద్యోగాలవీ. ఉన్నఒక్కడూ కంటిముందుండక అంటూ దెబ్బలాడుతోంది. ఇంట్లో మాకెవరికీమనశ్శాంతినుంచడంలేదు.

మా తదనంతరం, ఎలాఉన్నా, ఏంచేసినా నీ యిష్టం. మేము బ్రతికున్న నాలుగు రోజులైనా, మా సంతానం, మా కళ్ల ముందుండాలనుకోవడం అత్యాశ కాదను కుంటా. కనుక నీకు మమ్మల్ని చూడాలని లేకపోయినా, మాకోసమైనా, నవమాసాలూ మోసి కన్న మీ అమ్మ కోసరమైనా నువ్వు బయలుదేరి రావల్సింది.

మామయ్య గారమ్మాయికి, ఈ సంవత్సరంతో బి. ఏ. పూర్తయిపోతోంది. వాళ్లు వివాహంకొరకు తొందరపడుతున్నారు. నువ్వొచ్చాక ముహూర్తాలు పెట్టుకోవచ్చు. ఒకసారి వచ్చి వెళ్లవలెను. ఇట్లు, నీ తండ్రి,

దశరధరామయ్య.

[ఇంకా వుంది]

దుష్ట చతుష్టయం సంగతి నాకు తెలియదుగాని, మా దుష్టత్రయం మటుకు యింకెవరూ లేనప్పుడు అరమరికలు లేకుండా మాట్లాడుకుంటాం, గంటల తరబడి.

అరబ్ ఆయిల్ ఎంబార్గోనుంచి మా వార్డు కౌన్సిలర్ విలాస జీవితం దాకా అన్నీ దొర్లుతుంటై. కాకపోతే ముగ్గురం బ్రహ్మచారులం కాబట్టి కొంచెం ఎక్కువగానే సెక్స్ గురించి చర్చిస్తుంటాం. బ్రహ్మచారులం అంటే పెళ్ళిళ్ళకాలేదన్నమాట. మా ప్రసాదు, రవి. ఇద్దరూ గుండెగల వెధవలు, కాలాన్ని ఖులాసాగా గడిపేస్తారు. రవి మరీ సిగ్గూ ఎగ్గూ లేకుండా తయారయాడు. వారానికో చిలకతో కులుకుతూ పైగా ఆ విషయాన్ని సమర్థిస్తూ ఏదో ఐడియాలజీ రంగు పూద్దామని ప్రయత్నిస్తాడు. ప్రసాదు మాత్రం ఏదో కక్కుర్తిపడ్డా చర్చకు వచ్చేసరికి విషయాన్ని మారుస్తాడు.

రవి ఎం.కాం ఫస్టుక్లాసులోనెగ్గి మూడేళ్ల క్రితం బ్యాంకులో జూనియర్ ఆఫీసరుగా చేరాడు. ఇరవై ఏడేళ్లదాకా వుంటై. చేతినిండా డబ్బు వుండటం, అందగాడు కూడా కావటంతో వాడు ప్రత్యేకించి కష్టపడి పరుగెత్తాల్సిన అవసరం లేదు. వాడికోసం చాలా మంది పడిచస్తారుట. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా వుంటాడు. నేనెప్పుడయినా, 'నువ్విలా తాగుతూ తిరుగుతూ, పరుగెడుతూంటే నలభై ఏండ్లకే సుఖరోగాలతో తీసికొని మరీ చస్తావురా' అని అంటే వాడు 'చాలురా. నలభైదాకా రాజాలా బ్రతుకుతే. నన్ను చూసి ఎందుకురా కళ్ళల్లో నిప్పులు పోసుకుంటావు' అంటాడు.

ప్రసాద్ ఎ. జి. ఆఫీసులో యు. డి. క్లార్కు. ఎం. ఏ పాసై అతి కష్టం మీద యీ ఉద్యోగం సంపాదించాడు. ఉత్త నారి వెధవ. అన్ని విషయాలూ, అందరి విషయాలూ చెవులు రిక్కించుకుని వింటాడు గాని తన విషయం మాత్రం చాలా క్లుప్తంగా చెపుతాడు. సాధు స్వభావుడు. తన బ్రతుకేదో బ్రతుకుతాడు. ప్రసాదూ నేనూ 1947 లో ఒకే నెలలో పుట్టాం.

ఇక నేను యూనివర్సిటీలో సైకాలజీ లెక్చరర్‌గా వెలిగిపోతున్నాను. తరగనంత ఆస్తి వుంది. అందంగా వుంటానని అందరూ అంటారు. కాని ... మీరు నమ్మినా నమ్మక పోయినా నేను మటుకు యింతవరకూ శారీరకంగా మలినం కాలేదు. శారీరకంగా అని ఎందుకంటున్నానంటే మనస్సు ఎప్పుడూ మాట వినదు మరి. నేను చదివిన పుస్తకాలు, పెరిగిన ప్రభావం పరిసరాల ప్రభావం వల్లా నమ్మిన సిద్ధాంతాల కారణంగా నాకు కొన్ని కచ్చితమైన అభిప్రాయాలున్నాయి. క్లీన్ క్యారెక్టరు ఆడవాళ్ల కెంత ముఖ్యమో మగవాళ్లకూ అంతే ముఖ్యమని నా నమ్మకం. కాబట్టి పెళ్లయేదాకా ఎటువంటి కోరికలు కలుగకుండా అనుభవజ్ఞులు పుస్తకాల్లో చెప్పినట్టు నికార్సయిన బ్రహ్మచారిలా చన్నీళ్ల స్నానం చేయటం, కాఫీ, టీ, సిగరెట్లు తాగక పోవటం, సినిమాలు చూడకపోవటం, చెడ్డపుస్తకాల జోలికి పోకండా వుండటంలాంటి మంచి అలవాట్లను ఏర్పరచు

వక్రదృష్టి

కొండుభట్ల రామచంద్రమూర్తి

కున్నాను. వీటికి భిన్నంగా ఏమయినా వుంటే అది రోజా పబ్లిక్ గార్డెన్స్‌లో యీ వెధవలిద్దరితోగడిపే రెండు గంటలే.

ప్రతి సాయంత్రం అయిదున్నరకల్లా బషీర్‌బాగ్‌లోని 'క్లాస్' రెస్టారెంటుకు ముగ్గురం చేరుకుంటాం. అక్కడ సర్వేశ్వరులంతా పేరుపేరునా మాకు దోస్తులే. ముగ్గురం రాగానే, చెప్పకుండానే అలవాటు ప్రకారం దోమే తీన్ చాయ్ (రెండూ బై మూడు టీ) తెచ్చి పోస్తారు. టీ సేవించి, డబ్బులిచ్చి హాయిగా నడుస్తూపోయి పబ్లిక్ గార్డెన్సులో గుండ్రంగా కూర్చొని వచ్చేపోయే జంటలను చూస్తూ, కామెంట్సు చేస్తూ ఏడున్నరదాకా కాలక్షేపం చేసి కొంపలకిచేరటం రివాజు. ఎవరికి ఏ పని వున్నా ఏడున్నర తరువాతే.

అదో ఆదివారం సాయంత్రం. మామూలుగా కూర్చొని మాట్లాడుకుంటున్నాం వాగ్యుద్ధం క్లయిమాక్సుకొస్తోంది.

"ఏరా రంగా! ఉరఫ్ ప్రవరాఖ్యా! నువ్వు క్లాసు తీసుకున్నపుడు ఏ స్టూడెంటు కన్యను చూసిగాని లేక మీ అల్ట్రా మోడరన్ లెక్చరర్ వర్ధనం తారసపడ్డప్పుడుగాని లేకపోతే బజారులో ఏ అప్సరసనో చూసికాని చలించలేదని నమ్మమంటావా?" అని రవి నిలదీశాడు.

'అనను. మీకంటే నేనే ఎక్కువ చలించి యుండవచ్చు. ఎందుకంటే ఎప్పుడూ అలా నీచంగా ఆలోచించ వద్దనుకుంటూ అదే ఆలోచిస్తుంటా హిరణ్యకశిపుడు హరిని తలచినట్లు. అయితే ఆ తలపు క్షణం మాత్రమే. దానిని వెంటనే తరిమివేస్తాను.'


'మరి అది మానసిక వ్యభిచారం కాదా? అది పిరికివాళ్ల లక్షణం' రవి సర్టిఫికేటు.

'అయితే నువ్వా రంగనాయకమ్మగారి రామాయణంలో రాముడిలాగే అన్నమాట' నారి వెధవ ప్రసాద్ వాడి బాణం.

'ఆఁ! అంతే. కాని వకటే తేడా. ఆ రాముడికి సీతవుంది...' అంటూ అలాగే నోరు తెరచుకొని, గుడ్లు మిటకరించుకొని చూస్తూ వుండిపోయాడు. మేమిద్దరం తిరిగి వాడు చూస్తున్నవేపు చూసి మేమూ దాదాపు అంతే అయిపోయాం. ఇంకా తేరుకోకుండానే కలవరిస్తున్నట్లు "వండరఫుల్!" అన్నాడు రవి.

ఒక అందమయిన జంట. ఆమె అధునాతనంగా అలంకరించుకొంది. బంగారు వన్నె శరీరం. నల్లని, చక్కని తలకట్టు. చక్రాల్లాంటి కళ్లు. ప్రశాంతంగా వున్న గుండ్రటి మొహం. తెల్లటి స్లీవ్‌లెస్ జాకెట్టు. అదేరంగు నైలెక్స్ చీర. చేతిలో నల్లటి వ్యానిటీ బాగ్. చూడగానే 'శాంతి దేవత' అనిపించి గౌరవభావం ఏర్పడింది. అది ఎక్కువసేపు నిలవలేదు. మళ్లీ మామూలు ధోరణిలో ఆలోచనా స్రవంతి. అది. ఆమె తప్పుకాదు. మా తప్పూకాదు. వయస్సు తప్పు. ప్రకృతి తప్పు. దేవుడితప్పు. కొద్దిగా అతిగా ముస్తాబవటం మూలానో ఏమో యిరవై ఏండ్ల స్త్రీలా కనపడుతోంది. కాని పద్దెనిమిదికి మించి వుండవని మనస్సు నొక్కి చెపుతోంది. చేతులూపు

కుంటూ ఏదో మాట్లాడుతోంది. అతను తలూపుతూ, సన్నగా నవ్వుతూ ఆమె భుజం మీద చేయివేసి నడుస్తున్నాడు. అతని వయస్సు దాదాపు యాభై వుంటుంది. గచ్చ



కాయరంగు సూట్‌లో పచ్చగా బలిష్టంగా మంచి హుందాగా వున్నాడు.

వాళ్లు మమ్మల్ని దాటుకుంటూ వెళ్తున్నారు. "పోయిన వారం వస్తారని వెయ్యి కళ్లతో ఎదురు చూశాను. బాగా డిజప్పాయింట్ చేశారు" అంటోంది. అతనేదో సమాధానం చెప్తున్నాడు. రవి 'కంగ్రాట్యులేషన్స్ ఓల్డ్‌బాయ్' అని కొంచెం పెద్దగానే అన్నాడు. ఎక్కడ వింటారో, ఏం రాద్ధాంతం అవుతుందోనని హడలి చచ్చాను. కాని మా ఉనికిని గూడా గమనించనట్లు వెళ్లి యిరవై గజాల దూరంలో కూర్చున్నారు.

'రేయ్ రంగా. యిక్కడుంటే డైలాగులు వినపడవు. పద దగ్గిరగా పోయి కూర్చుందాం' అని లేవబోయాడు రవి.

'వద్దు కూర్చో. బావుండదు' అని బలవంతాన కూర్చోబెట్టాం నేనూ, ప్రసాద్.

మాట్లాడుతున్న విషయం మరిచిపోయి వాళ్లను చూడ్డంలో మునిగి పోయాం. ఆమె ఏవో కబుర్లు చెపుతూంటే అతను ఆమె తల నిమురుతూ వింటున్నాడు.

ప్రసాద్ సన్నగా 'ఏరా, ఆ ఏంజల్ అతనికంటే చాలా చిన్నదిలాగుంది. సెకండ్ మ్యారేజేమో' అన్నాడు.

'కావచ్చు' అన్నాన్నేను.

'నాన్సెన్స్. యిదేదో హైక్లాసు సరకురా. సేటు బాగా వున్నవాడిలా వున్నాడు. మంచి సరకునే పట్టాడు. అదోచూడు ఆవిడ వగలు. చేసుకున్న భార్యకు అంతగా మాట్లాడి ఆకట్టుకోవాల్సిన అవసరం ఉండదు!' గది రీజనింగ్ బాగానే వుందనిపించింది.

ఆమె ఏదో చెపుతూ పెద్దగా నవ్వుతూ రెండు అరచేతులమధ్యా మొహం పెట్టుకొని అతని వళ్లో తలపెట్టి తెరలు తెరలుగా

ప్రశ్నావళి

— కె. రామలక్ష్మి

వి. వి. మద్రాసు.

అత్తగార్లందరూ ఒకనాటి కోడళ్లు అన్న సంగతి మరిచి పోతారు. ఎందుచేత?

అనుభవించిన సుఖం మరిచి పోవచ్చును. గాని కష్టం మరిచి పోలేరు కదా—అంచేత కోడలు రాగానే పాత కోడలు— అత్తగా రూపాంతరం చెంది— తన కోడలిమీద విరుచుకు పడడం ప్రారంభించుతుంది.

ఎస్. ఎల్. డి. కర్నూలు.

స్త్రీ పవిత్రతకు చిహ్నమేది?

మనస్సు. అది కనిపించదు. . . అందుచేతనమ్మితే నమ్మండి. లేకపోతే లేదు.

జె. ఆర్. ఆర్. విశాఖపట్నం.

అంతా ఆదర్శాలు వల్లెవేసే వారే గాని ఆచరించే వారు తక్కువగా వుంటారెందుకు?

ఆదర్శాల కోసం పోరాటం సాగించడం సులభం— వాటికోసం బ్రతకడం కంటే. అందుకే వల్లె వేసి గోల చేస్తారు.

ఎస్. బి. ఆర్. విశాఖపట్నం.

మిమ్మల్ని కొందరు నీచంగా మాట్లాడతారు. మీకేం అనిపిస్తుంది?

నిజం చెప్పనా? న్యూనతేనా గౌరవమేనా ఉన్నతులకే కల్గుతుంది కాని నీచులకెలాకల్గుతుందిచెప్పండి? సూర్య చంద్రులకే గ్రహణం కాని చుక్కలకి కాదు కదా. ఏమంటారు?!

పి. ఎస్. ఆర్. విజయవాడ.

పసి వాళ్లని దేవుళ్ళంటారెందుకు?

పిల్లలెప్పుడూ వెలుగుకేసి తిరుగుతారు. అందుకే పెద్దలంతా కూడా మళ్లీ పిల్లలవుతే బాగుండును. వెలుగే కదా విజ్ఞానం? విజ్ఞానమే కదా— దైవం?.

వి. కె. ఎస్. ఆర్. దొమ్మేరు.

మీ ప్రశ్నలు వింటుంటే నాకు లోత వుడుతోంది. రెండు యాస్ప్రోలు వేసుకుంటాను. . .

వద్దు. మీరు సలోఫెన్‌కి మారండి. నాకు లాభం!

కె. వి. ఆర్ శాసనకోట.

ఆడది ఒక్కసారి పోగొట్టుకొంటే తిరిగి సంపాదించుకోలేనిది ఏమిటి?

ఆత్మగౌరవం.

ఎం. ఎస్. తాడిపత్రి.

అక్టోబరు 2న ఒక బ్రాందీ షాపునకు లైసెన్సు యిచ్చింది మన ప్రభుత్వము.

గాంధి పేరు చెప్పి ఆ రోజు ఆహూతులకి సోపే డ్రింకు పోసినా నా కాశ్చర్యం వేసేదికాదు! మన ప్రభుత్వం—

ఎస్. ఎస్. కావలి.

మీకు అంత చదువు కూడా లేదు కదా— మరి మీ గర్వానికి కారణం?

అదే నాకూ అర్థం కాకుండా వుంది బ్రదర్. మీ సమాధానాలు అంత సంస్కారికంగా వుండవంటాను. మీరేమంటారు?

నిజమే. సంసార పక్షంగా వుంటాయంటాను. మీకూ— బూటకపు సంస్కారం కావాలా? నిజం కావాలా?

ఎస్. ఎస్. ఆర్. బిలాస్‌పూరు.

మనుషులందరూ అజ్ఞానులే నంటాను. మీరే మంటారు?

తమ పరిశోధనకి డాక్టరేటు యివ్వాలంటాను.

పి. ఆర్. ఎస్. హైద్రాబాదు.

నా పుట్టుకనుండి యిప్పటివరకూ దరిద్రంతో సతమత మవుతున్నాను . . . ఆత్మశాంతి లేదు.

దరిద్రం సిగ్గుపడవలసినది కాదు సార్, ఆత్మశాంతి లేకపోయినా— ఆత్మ విశ్వాసం కోల్పోనంతవరకూ— ఏం ఫరవాలేదు . . దరిద్ర నారాయణుల దేశంలో మనదే— అధిక సంఖ్య . .

వక్రదృష్టి

నవ్వుతోంది. అతనూ నవ్వుతూ కళ్లు తుడుచుకుంటున్నాడు.

'అదృష్టవంతుడు' నాకు తెలియకుండానే మనసు అనుకొంది.

ఇప్పుడామె అతని తొడని తలగడాగా చేసుకొని పచ్చికమీద పడుకుంది. ఆదేపనిగా గాలిలో చేతులు ఊపుతూ ఏదో చెపుతుంటే అతను ప్రేమగా ఆమె కళ్లల్లోకి చూస్తూ వింటున్నాడు.

'ఏవిట్రా. ఎప్పుడూ ఆమే మాట్లాడుతోంది. ఉత్తి కబుర్లతోనే కాలక్షేపం చేసేస్తున్నారే' ప్రసాద్ ఎంక్వయిరీ.

'చాలా బాబూ యీ ముసలి పీనుక్కి. పగలల్లా వ్యాపారం పరుగులో హైరానం అయి వుంటారు. సాయంకాలానికో అందాల బొమ్మని తెచ్చుకొని యిలా వాగిచ్చి సంతోషిస్తారు. పచ్చ కాగితంతో రెండు గంటల తిలోత్తమా సాన్నిధ్యం మరియు ఆమె వాణి!' వ్యాపారస్తులతో తనకున్న అనుభవాన్నిబట్టి అన్నాడు రవి.

ముగ్గురి ఆలోచనలు ఆ జంట చుట్టే పరిభ్రమిస్తున్నాయి.

చెప్పొద్దూ. నాకు మొదట్నించీ కొంచెం కొంచెంగా అసూయ పేరుకొంటోంది. అటు చూస్తున్నకొద్దీ వళ్లు వేడెక్కుతోంది. అతని మీద కోపం వస్తోంది. పెద్ద విలన్‌లా కనిపిస్తున్నాడు. దొంగ రాస్కెల్. ఎంత వ్యాపారం చేసి అలసిపోతే మాత్రం హాయిగా యింటికిపోయి భార్యను తీసుకొని ఏ సినిమాకో, షైరుకో పోరాదా. భార్య అనాకారేమో. పాపం. అయినా మాత్రం. ఆమెనలా వదిలేసి యీ సీతాకోక చిలకతో విహారమా. ఎందరు అనాకారి భార్యలతో చక్కగా సంసారం చేయడం లేదు. ఛ. ఛ. ఎంత నీచం. విలువలు మరీ దారుణంగా పడి పోతున్నాయి. ఇదేం వ్యాధి. ఇంత లేటు వయసులో. వెరైటీ కావాలి వెరైటీ. యిలా నా ఆలోచనలు సాగుతున్నై. కోపం ఎక్కువవుతోంది. కోపగించుకోవటానికి నాకే అధికారముంది. రవికి ప్రసాద్‌కి లేదు. వాళ్లూ నేరస్తులే గదా.

ఏడున్నర కావస్తోంది. వాళ్లు లేచారు. ఇటే వస్తున్నారు. 'ఈసారి మమ్మీ లేకుండా వస్తే నేను మాట్లాడను'ఆమె బుంగమూతి పెడుతూ అంటోంది.

రవి ఉలిక్కిపడి ఆశ్చర్యంగా నా వేపు చూశాడు,

"మళ్లీ ఆదివారం తప్పకుండా వస్తానమ్మా. కాదు. కాదు. వస్తామమ్మా. అమ్మ కూడా వస్తుంది. అవునూ. మీ హోస్టలు మేట్రన్‌కు ట్రాన్సఫర్ అయిందట కదూ."

"అవును. కొత్తావిడెలాటి దొస్తుందో"

"జాగ్రత్తగా వుండాలమ్మా. రోజులు మంచిగా లేవు" అంటున్నాడతను.

అంతలో ఐస్‌ఫ్రూట్ అమ్ముతూ కుర్రాడు వచ్చాడు.

ఆమె చిన్నపిల్లలా గెంతుతూ "డాడీ. ఐ వాంట్ ఐస్ ఫ్రూట్"అని గోముగా అడుగుతోంది.

మా మొహాలు నల్లబడ్డయ్. రవి తల దించుకున్నాడు. ప్రసాద్ ఎటోచూస్తున్నాడు. నా తల తిరిగి పోతోంది. కడుపులో చెయ్యి పెట్టి తిప్పుతున్నట్టు వికారంగావుంది. నేనంటే నాకే అసహ్యంగా వుంది. ఆత్మహత్య చేసుకోవాలనిపించేటంత బాధ. హృదయం గోల పెడుతోంది. 'నీ చదువు నేర్పిన సంస్కారం యిదేనా?'అని వెక్కిరిస్తోంది.

రోజూ బడబడా వాగుతూ, సంతోషంగా యిళ్లకుపోయే ముగ్గురం తలలు వేలాడేసుకుని మాటా మంచీ లేకుండా దారిపట్టాం.

ఎస్. బి. హెచ్. ఎమ్మిగనూరు.

ఆందోళన రేకెత్తించే సమస్యా నివారణకు ప్రాకులాడే ఈ ప్రభుత్వ విధానాన్ని ఏమనాలి ?

సమస్యలు లేకుండా ఎలా పరిష్కరిస్తారండీ. అందుకే— విడానిస్తారు !

ఎ. వి. చింతగట్టు.

స్త్రీలకు వంటలుచేయడం నేర్పించడం మంచిదంటాను. ఎందుకండి స్త్రీలు ఉద్యోగం చెయ్యడం ? భర్త జీతం తెస్తాడుగా ?


వంట చేయడం నామోషి అని ఏ స్త్రీ అనుకోదు. కాని ఉద్యోగం ఎందుకు అని ప్రశ్నించే హక్కువీాక్కు లేదు. మీరెందుకు సంపాదించాలను కుంటున్నారో ఆడదీ అందుకే సంపాదించాలనుకుంటుంది. ఆర్థికంగా స్వేచ్ఛగా నిలబడకల్గిన స్త్రీని చచ్చినట్టు సమాజం గౌరవిస్తుంది. లేకుంటే అణచి వేస్తుందే కాని ఆదరించదు. జీతం భర్త తేడని కాదు. చేదోడు వాదోడుగా వుండాలనీ, కొంచ సాఫీగా సాగడానికి సహకరించాలని సతీమతమయ్యే ఆడదాని ఆర్థిక దృక్పథాన్ని కించపరచకండి. 'వో రూపాయి అడిగితే— వో కానీ సంపాదించు ఆ కష్టం తెలుస్తుంది' అనే మగవాళ్ళు ఎందరు లేరు? మేం ఉద్యోగాలు మానేసినంత మాత్రాన మీ నిరుద్యోగ సమస్య తీరిపోతుందనుకోవడం అవివేకం. అవివేకం కంటే పిచ్చి... లేదు!

మండే ఎండలు.

ఎల్. మ్యాల కొండయ్య.

కాసెండుతున్న ఎండలు
మరీ మండిపోతున్న ధరలు.
పండుతున్న పంటలు
మరీ పండిపోతున్న పాపం.
మండు టెండలు
మండే ధరలు
వేడి గాడ్పులు
మాడే కడుపులు.
ఇంకిపోయే నూతులు
ఇంతకూ నిండని చెరువులు
దప్పిక గొంతులు
తీరని దాహం
మండే కడుపులు
కాల్చే ఆకలి.
ఉన్నవారికి ఏర్ కండిషన్‌లు
లేనివారికి ఎండే కండిషన్

మినీ ఇంటర్వ్యూ



'సినిమాలంటే చాలా యిష్టం ! హిందీ సినిమాలంటే పడిఛస్తాను !! హిందీలో ధర్మేంద్ర, తెలుగులో శోభన్‌బాబు నా అభిమాన నటులు ! కొత్త ఫాషన్ ఏది వచ్చినా సరే— వెంటనే ఆ రకం డ్రస్సు కుట్టిస్తాను !' అన్నాడు ఒయోలా కాలేజీలో చదువుకుంటున్న సూరపనేని రాజగోపాల్.

'ఆడపిల్లలంటే నాకు అసలు గిట్టదు ! కారణం, వాళ్ళంటే చచ్చే భయం ! ... అల్లరిలో అబ్బాయిలది పైచెయ్యి ! చదువులో అమ్మాయిలది పైచెయ్యి !' అన్నాడు. 'మెడిసన్ చదివి డాక్టర్‌నవుతాను ! డాక్టర్‌నై... సైన్యంలో చేరి సైనికులకు సేవ చేస్తాను ! అదే నాఆశయం ! 'అన్నాడు.

[గీతా శేఖర్]

వారఫలం

మహేష్

7-6-1974 శుక్రవారం మొదలు 13-6-1974 గురువారం వరకు

మేషం :— అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కలుసుకొంటారు. దైవ కార్యాలు నెరవేరతాయి. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి. స్త్రీలకు—బంధువులకు సహాయం చేస్తారు. నూతన విషయాలను తెల్సుకొంటారు.

వృషభం :— రావలసిన డబ్బు అందుతుంది. విద్యావైజ్ఞానిక రంగాల్లో మీ కృషి రాణిస్తుంది. మిత్రులకు సహాయం చేస్తారు. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. ఉద్యోగములో గౌరవం లభించగలదు. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి.

మిధునం :— కొంతమంది వ్యక్తులు మిమ్మల్ని మోసం చేయడానికి ప్రయత్నిస్తారు. ఉద్యోగంలో శ్రమ కలుగుతుంది. చికాకులు ఏర్పడతాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కర్కాటకం:— ఇతరులతో కలిసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది. మీ ఆలోచనలు ఫలిస్తాయి. వారం ఆఖరులో ఆందోళన కలుగుతుంది. సాహసముతో కూడిన వ్యవహారాల్లో నష్టం రాగలదు. —స్త్రీలకు— ఆరోగ్యం బాగుండదు. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

సింహం :— మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. సాటివారితో మాట పట్టింపులు తగవు. ప్రయాణాలు వాయిదా పడతాయి వారం ఆఖరులో ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో ప్రయోజనం గల సంభాషణలను జరుపగలరు. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. పుణ్యకార్యాలు చేస్తారు.

కన్య :— మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారం ఆఖరులో వృత్తిలో సాటివారి పోటీ పెరుగుతుంది. రాజకీయ వ్యవహారాల్లో చికాకులు ఏర్పడతాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. ఎవరితోను వాదప్రతివాదాలు తగవు.

తుల :— అన్ని వ్యవహారాల్లోను ఫలితం సామాన్యంగా ఉంటుంది. దైవ కార్యాలు నెరవేరతాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. విద్యావైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. స్త్రీలకు—బంధువులకు సహాయంచేస్తారు. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

వృశ్చికం:— వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. సజ్జన సాంగత్యం లభిస్తుంది. సాహసిక వ్యవహారాలు లాభించగలవు. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. సాంఘిక కార్యక్రమాల్లో మీ ప్రాముఖ్యత పెరుగుతుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. ప్రయాణాలు వాయిదా పడతాయి

ధనుస్సు :— ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయోజనం గల పరిచయాలు ఏర్పడతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో సాటివారి పోటీ తగ్గుతుంది. స్త్రీలకు— కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. అనుకూలవార్తలను వింటారు.

మకరం — వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. సాటివారిలో గౌరవం బాగుంటుంది. భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభించగలవు. విద్యావైజ్ఞానిక రంగాల్లో

(18 వ పేజీ చూడండి)

తండ్రి మనసు

గరికపాటి కృష్ణమూర్తి

"రా ... రామ్మా ... అక్కడే నుంచున్నావేం ?" వంటుగది గుమ్మాన్నాను కొని లోపలకి వద్దామా వద్దాఅని తచ్చాడుతున్న పార్వతిని పిల్చింది జానకమ్మ. పార్వతి లోపలి కడుగు పెట్టింది. జానకమ్మ పీట వేసింది. జానకమ్మ అప్పుడే బియ్యం కడిగి ఎసట్లో వేసి గరిటెతో కలుపుతోంది.

పార్వతెప్పుడు వచ్చినా మధ్యాహ్నమో, సాయంకాలమో వచ్చేది.

ఇవ్వాళ ప్రొద్దుటే వచ్చింది.

ఏదో ప్రత్యేకమైన విషయముంటే మినహా ఉదయమే రాదు.

"ఏమ్మా పార్వతీ! ఇవ్వాళ ఉదయమే వచ్చావు ?"

"అదే ... అదే ... అత్తయ్యా !"

"ఏమిటి ? ... అదేమిటి ?"

"అదే ... ఈ రోజు వాళ్ళొస్తున్నారు."

"వాళ్ళెవరూ ?"

"పెళ్ళివారు." తల వంచుకునే సిగ్గుతో అన్నది. లోలోన భయభయంగా, గుబులు గుబులుగా ఉన్నది.

"ఓ...అలాగా..." నవ్వింది జానకమ్మ.

"ఏమో అత్తయ్యా నాకు భయంగా ఉన్నదీసారి." వేలమీద ఏదో రాస్తూ అన్నది.

"భయ మెందుకమ్మా ! ... ఏమీ పరవా లేదులే ... ఇంతకీ ఎవరట వాళ్ళు."

"అసలూరు బెజవాడ దగ్గర చిన్న వూరట ... ఇద్దరే అన్నదమ్ములట. అక్కా చెల్లెళ్ళు ఎవరూ లేరట. ఆస్తిపాస్తులు పరవాలేదట. తల్లీ దండ్రి యింటి పాటునే ఉండి వ్యవసాయం చూచుకుంటూ ఉంటారట.

"ఎంత గడుచు దానివే! ఇంతకీ అతని విషయం తెలియదంటావు." నవ్వుతూ అడిగింది జానకమ్మ.

పార్వతి సిగ్గుపడింది.

"హైదరాబాద్‌లో ఉద్యోగమట. ఉద్యోగం కూడా పెద్దదేనట. నెలకు అరొందలు పైన వస్తయ్యని నాన్నగారు అమ్మతో అంటున్నారు."

"ఇంకేం చాలా అదృష్టవంతురాలివే."

"ఏమో అత్తయ్యా ! ఇన్ని ఉన్న వాళ్ళకి మరెన్ని కోరికలుంటయ్యోనని."

"అవేమీ తెల్సుకోకుండానే మీ నాన్నగారు మాత్రం నిన్ను చూపించటానికి ఒప్పుకొన్నారా ?"

పార్వతి యేమీ సమాధానం యివ్వలేదు.

నాన్నగారు మాత్రం యేమీ ఆలోచించకుండా రమ్మని ఉంటారా?...ఏమో? అనినా అనవచ్చు. పోయినసారి వచ్చినవాళ్ళు పిల్ల నచ్చిందికాని కట్నం చాలదన్నారు. ఇంకొకరు కట్నం చాలలేదని అనలేక పిల్ల యింకా చాయలో ఉంటే బాగుండేదని పెదవి విరిచారు. అయినా నాన్నగారి పిచ్చి నాన్నగారిదే... ముందు పిల్లని చూడండి తర్వాత కట్నాలు కానుకలు విషయం మాట్లాడుకోవచ్చని తీసుకొస్తారు. అమ్మ 'ఎందుకండీ అంత తూగలేని సంబంధాలు జోలికి పోతారని' అంటే "అయితే నా బిడ్డని దారినిపోయే దానయ్యకివ్వమంటావా ?" అని కస్సున లేచారు. అప్పటినుండి అమ్మకూడా యెప్పుడూ యేమీ ఎదురు చెప్పటంలేదు. ఆయన ఆశ ఆయనిది. ఆయన తాపత్రయం ఆయనిది.

తనను మాత్రం ప్రతిసారి కొంచెం కొంచెం ఆశలు కల్పిస్తూ పెళ్ళి చూపులకి తయారు చేస్తుంది అమ్మ. అవి విఫలమైనపుడు వాళ్ళని తిడుతూ తనని ఓదార్చుతుంది.

"అయితే పార్వతీ! ఈ విషయం యింత వరకూ చెప్పనేలేదేం ?"

"ఎందుకత్తయ్యా ! ప్రతి సారి జరిగే తంతేగదాని" నైరాశ్యం ఆవరించిన దానిలా అన్నది.

జానకమ్మకు కూతురు జ్ఞాపకమొచ్చింది. నీళ్ళు తిరిగినయ్.

జానకమ్మ భర్త రామనాధం యీ సంభాషణంతా లోపల్నుండి. వింటూనే ఉన్నాడు.

పార్వతి యేదో దిగులు, నిరాశ, భయం ఆవరించినట్లు మాట్లాడుతూంది. మన్ను మిని పద్దెనిదేళ్ళ లేవు. ఎన్నో ఆశలతో మరెన్నో కోర్కెలతో ఊహాపథంలో ఉయ్యాలలూగే వయస్సది. ఆ కోర్కెలు సఫలీకృతం కాకపోయేటప్పటికి జీవితానుభవంలేని బిడ్డలు ఎలా క్రుంగిపోతున్నారు !!

ఇంట్లోనుండి వంటయింటివైపు వచ్చాడు రామనాధం. పార్వతి మోకాలి మీద తల పెట్టుకొని మసిబొగ్గుతో క్రింద రాస్తూందేదో!

"ఎప్పుడొస్తారమ్మా" అడిగాడు.

గబుక్కున లేచి ప్రక్కకి తొలగింది పార్వతి.

"కూర్చోఅమ్మా" అని "సాయంకాలం వస్తారేమో?" అన్నది భర్తకి సమాధానంగా జానకమ్మ.

ఔనన్నట్లు తలూపింది పార్వతి.

రామనాధం పార్వతి వంక చూశాడు. ముఖంలో వర్చస్సున్నా జీవంలేదు. కళ్ళు విశాలమైనా కళలేదు. పెళ్ళి చూపుల్లో ఉండాల్సిన ఉద్రేకత లేదు. అసలు పిల్లలో చలనమున్నట్లు కన్పించటం లేదు.

పెళ్ళిచూపుల పరీక్షలో కృతార్థురాలిని కాలేనన్న భయంతో వణికిపోతూంది పార్వతి.

మరి తనబిడ్డ ఎంతగా కుమిలిపోయిందో? ఎంత మనో వ్యధ బాధితురాలైందో? మనసు యెంత క్షోభ చెందిందో ?

ఒక్కసారి సంవత్సరం వెనక్కి వెళ్ళినవి రామనాధం ఆలోచనలు.

ఇరుగు పొరుగు వారవటమే కాకుండా దూరపు బంధుత్వం దృష్ట్యా కూడా రామారావుకు లలితనిస్తే యింటికెదురుగా కళ్ళెదుట ఉంటుందని ఆశపడ్డారు. ఈ విధంగా తనూ, తన భార్య మాత్రమే, ఆశలు పెట్టుకోలేదు. లలిత పుట్టినప్పటి నుండి, వెంకట్రామయ్యకూడా మా కోడలు, కోడలంటూనే ఉన్నాడు. తాము కూడా రామారావుని కాబోయే అల్లుడుగానే భావించుకుంటూ వచ్చారు. పెద్దవాళ్ళ సరసలు, అనుకోవటాలు వాళ్ళవరకే పరిమితం అయితే బాగుండేది. కాని లలితలో కూడా ఆ భావం ఉద్భవించడానికి, వృద్ధి చెందటానికి యిటు తాము, అటు వెంకట్రామయ్య కుటుంబంవారుకూడా కారకులే. యిద్దర్నీ యిరుగుపొరుగు వారేగాక యీడూజోడూఅనికూడా ఎగతాళిచేసేవారు.

లలిత వ్యక్తురాలైన తర్వాత చదువుమాని పించారు. రామారావు, అప్పటికే దగ్గర టౌన్లో కాలేజీ చదువు సాగిస్తూ ఉండేవాడు.

రామనాథం కూతురు పెళ్ళి విషయం యెత్తినప్పుడల్లా వెంకట్రామయ్య "ముందు వాడిచదువు పూర్తి కానియ్ బావా! తర్వాత అలాగే కానిద్దాం" అనేవాడు.

రామారావుకూడా బుద్ధిగా చదివి బి. ఏ ప్యాసయ్యాడు. ప్యాసవ్వటం కంటే అతని అదృష్టం వెంటనే ఉద్యోగం దొరకటం. అందరూ లలిత అదృష్టవంతురాలన్నారు. లలితకారోజు పట్టపగ్గాలే లేకపోయినయ్. రామారావుతో పెళ్ళి, కొత్తగా పట్నంలో కాపరం. సినిమాలు, సరదాలు... ఓయ్... ఊహా లోకాల్లో తేలిపోయింది.

రామారావు ఉద్యోగమైన కొన్నాళ్ళకు మళ్ళీ రామనాథం పెళ్ళివిషయమై యెత్తాడు వెంకట్రామయ్య వద్ద,

"దానిదేముందిలే బావా; అలాగే కానిదాం కాని రామునకు ఉద్దేశం కూడా కనుక్కోవాలి కదా!" అన్నాడు.

రామనాథం కొంచెం గతుక్కుమన్నాడు. మళ్ళీ తేరుకొని 'తన పిచ్చిగాని రామారావు కాదంటాడేమిటి?' అనుకొన్నాడు.

కాని మరికొన్నాళ్ళకు ఆనోటాయీనోటా విన్నదేమిటంటే రామారావుకు నాలుగెకరాల మాగాణి, ఐదు వేలుకట్నం యిస్తామని వస్తున్నారని, వెంకట్రామయ్య కూడా కొడుకుని తీసుకొని పెళ్ళి చూపుల కెళ్ళి వచ్చాడని.

దీంతో రామనాథం దంపతులు హతాశు లయ్యారు.

మోసపొయ్యామనుకొన్నారు. వెంకట్రామయ్య నమ్మించి ద్రోహం చేశా డనుకొనుకొన్నారు.

ఇక లలిత విషయం చెప్పనే అవసరంలేదు. విద్యుద్ఘాతం తిన్న దానిలా అయిపోయింది. వెళ్ళడించుకోలేని వ్యధ. మరల్చుకోలేని మనసు నిస్సహాయులైన తల్లిదండ్రుల మనోవ్యాకులత.

"రామనాథం ఏమిస్తాడు ఆ పిల్లవాడికి సలక్షణమైన సంబంధ మొచ్చింది." ఇరుగు పొరుగు అమ్మలక్కల మాటలు గోరుచుట్టు మీద రోకటిపోటు లైనవి,

అవును. తనేమి యిస్తాడు. తన సర్వసం ధారపోసి సంపాదించింది రెండెకరాలు. పెళ్ళి కని దాచిపెట్టిన రెండువేలు బిడ్డకోసం ఉన్న దంతా ఊడ్చి యివ్వగలడు. తను బ్రతుకు తెరువు తర్వాత చూసుకోవచ్చు. అంతా కలిపినా వాళ్ళిచ్చే దాంట్లో సగంలేదు ... తను లేనివాడు చాలనివాడు."

ఒకనాడు వెంకట్రామయ్య గారింటికి ఆడ పెళ్ళి వారొచ్చి చూసుకుపోయారు. మరి నాల్గు రోజుల్లో నిశ్చయ తాంబూలాలు పుచ్చుకొనటం కూడా అయిపోయింది.

అంతవరకూ యెక్కడో అంతరాల్లో మిణుకు మిణుకు మంటున్న ఆశాదీపం ఆరిపోయింది.

ఆరోజు.

అదే. వెంకట్రామయ్య యింట్లో కొడుకు పెళ్ళిరోజు.

తమకి కాళరాత్రి. తమ వృద్ధ జీవితాల్లో మహాజ్యంపోసి బ్రతికినంత కాలం మంటలు రేపిన రాత్రి. కన్న కడుపుల మమతాను బంధాన్ని పెటిల్లున తెంపుకొని లలిత శాశ్వతంగా విశ్రమించిన రాత్రి.

వెంకట్రామయ్య నరరూప రాక్షసుడులా కన్పించాడు. పచ్చిరక్తం తాగే నరహంతకు డులా వికటాట్టహాసం చేస్తున్నట్లు అవాడు.

ఎదురింట్లో సన్నాయి మేళం.

తనింట్లో, పగిలిన గుండెల వాళ్ళ ఆర్తనాదాలు.

ఎదురింట్లో నూతన వధూవరులకు స్వాగత నీరాజనాలు.

తనింట్లో తన జీవన జ్యోతి లలిత శవానికి వీడ్కోలు. భగవంతుడా? ఏ తల్లి దండ్రికి యిటువంటి కఠిన శిక్ష వద్దు. ఏ కన్న కడుపుకి అటువంటి రాత్రి వద్దు.

"ఏమండీ" లోపల నుండి భార్య కేకేసింది. ఆ పిలుపుతో యీ లోకంలోకి వచ్చాడు రామనాథం. కళ్ళు వత్తుకొన్నాడు.

"ఆ పెట్టెలో లలిత పెళ్లిసుమ్మది. పార్వతికట యిమ్మండి."

"అలాగే" వెళ్ళి పెట్టెలోని తీసియిచ్చాడు.

"పార్వతి అందుకొని మామయ్యగారూ!

(43 వ పేజీ చూడండి)



హైదరాబాద్ నోట్ బుక్


— తిరుమల రామచంద్ర.

రైల్వేలో సమ్మె :

అత్యవసర సేవావిభాగాలలో అవాంతరాలు ఏర్పడినప్పుడు ప్రజాసామాన్యం పడేబాధలకు తార్కాణం రైల్వేసమ్మె. కార్మిక నాయకులు, ప్రభుత్వనాయకులు ఏమి చెప్పుకున్నా, ఇబ్బందులతో జనం సతమతం కావడం మాత్రం నిజం. మనసమ్మెలు జపాన్‌కార్మికుల సమ్మెలలాగ ఉంటే బాగుండునేమో ? జపాన్‌లో కార్మికులు సమ్మెలో జీతబత్తేలు తీసుకోకుండా ఎక్కువ గంటలు పనిచేస్తారట, ఉత్పత్తి తగ్గిపోకుండా. జనం సమ్మెకాలంలో కార్మికులకు అరువిస్తారట. సమ్మె ముగియగానే ఎలాగూ రాబట్టుకొవచ్చు డబ్బును. ఈలాటి సమ్మెలవల్ల జనం సానుభూతి ఘనమడిస్తుంది. ఉత్పత్తి తగ్గదు. అధికారులు ఎప్పటికైనా దిగిరాక తప్పదు.

కేంద్ర విశ్వ విద్యాలయం :

రాష్ట్రసమైక్య పరిరక్షణకోసం రూపొందిన షట్‌సూత్ర ప్రణాళికలో అంశమైన కేంద్రవిశ్వవిద్యాలయ స్థాపనకోసం ప్రారంభాంగంగా ప్రత్యేకాధికారి నియామకం త్వరలో జరుగగలదని ముఖ్యమంత్రి శ్రీ వెంగళరావు ఢిల్లీనుంచి వచ్చిన తర్వాత తెలిపారు. ఈ విశ్వవిద్యాలయం ఇప్పటి విశ్వవిద్యాలయాలకు నమూనాగా ఉండాలిగాని, నకలుగా ఉండరాదు గనుక ప్రారంభకార్యక్రమం నిర్వహించే ప్రత్యేకాధికారి వూహాపోహలుగలిగి, నిర్వహణ కార్యనిష్ణాతుడై ఉండడం అవసరం. ఈ విశ్వవిద్యాలయమైనా, "ఓపెన్‌బుక్" పరీక్షలుపెట్టి కాపీకొట్టే పద్ధతిని మొగ్గలోనే నలిపివేయాలి. ఓపెన్‌బుక్ పరీక్ష పద్ధతివల్ల ఉపాధ్యాయుల బాధ్యత పెరుగుతుంది. విద్యార్థుల విజ్ఞానం పెరుగుతుంది. పాఠ్యగ్రంథంలో విషయాలు కాక, ఇతరత్రా విషయాలు సేకరించవలసి ఉంటుంది.



సంజీవయ్య స్మృతి చిహ్నం :

గొప్పవారి స్మృతిచిహ్నం నిజానికి ప్రజల హృదయాలే అయినా మూర్తంగా కొన్నిరూపాలు అవసరం. కనుక, సహృదయుడు, సజీవుడై ఉంటే రాష్ట్రపతికావలసినవాడూఅయిన శ్రీ సంజీవయ్యకు నగరంలో స్మారకచిహ్నంనెలకొల్పబడుతుందని ఆయన రెండవవర్ధంతి సమయంలో ముఖ్యమంత్రి చెప్పడం చాలా ఉచితంగావుంది. ఇదికేవలం శిలావిగ్రహ స్థాపన పర్యవసితం కాక, అస్పృశ్యతా నివారణ కేంద్రంగా గాంధిజీ సిద్ధాంతాల ప్రసార విద్యాలయంగా ఉండాలి.

మా మి డి ప ళ్ళు :

బంగారుముద్దలలాగ ఎటుచూచినా సంచార విపణిశకటాలపై పయనించే మామిడిపళ్లను చూస్తే, ఎలాటివానికైనా నోట్లో నీరూరుతుంది. బేనీషా, మల్గోవా, తోతాపర్, మనోరంజన్, జనార్దన్‌పసంద్, ఇమామ్‌పసంద్, జహాంగీర్ కొత్తపల్లికొబ్బరి, చెరుకురసాలు, చిన్నరసం, పెద్దరసం, పావకాలు, పంచదార కలశాలు, బంగనపల్లి ఇలా వేయిరకాల మామిడిపళ్లను చెప్పవచ్చు, జంటనగరాలలో చూడనూవచ్చు. కాని జంటనగరాల పౌరులకు అత్యంతప్రియమైనవి బేనీషా, రసాలు అనవచ్చు. బేనీషాలు అలాగే గట్టిపడి, బంగారమయితే బాగుండునని నాతో నా మిత్రుని కూతురు కె. నిర్మల—పది సంవత్సరాల అమ్మాయి అన్నప్పుడు, నాకూ ఆశపుట్టింది, నిజం చెప్పొద్దూ ! ఈ మామిడిపండు ఇతర రాష్ట్రాలు, దేశాలు సంగతి ఎలావున్నా, ఆంధ్రప్రదేశ్‌లో రెండువేలఏళ్లకు ముందునుంచి జనప్రియంగా ఉన్నట్లు హాలసాతవాహనుని గాథాసప్తశతే సాక్షి. అమరావతీ, నాగార్జున కొండల లోని పూర్ణకుంభ శిల్పాలలోని మామిడి మండలేసాక్షి. గాథాసప్తశతిలో ఒకతల్లి మామిడి చెట్టుమీది పండుకోసం పిల్లవాడు ఏడిస్తే, దారినిపోయే ప్రతి బాటసారినీ కోసిమ్మని అడిగిందట, తనకు అందనందున. మనరాష్ట్రంలో దీనిసాగు అప్పటినుండే ఉంది. ప్రస్తుతం దాదాపు మూడు లక్షల ఎకరాల మామిడితోటలున్నాయి, మనరాష్ట్రంలో. ఏటా దాదాపు 30 వేల టన్నుల మామిడిపళ్లు, కాయలు ఎగుమతి అవుతాయి. రాష్ట్రంలోని ఫలపరిశోధన కేంద్రాలలో వందల కొలది సంకర ఫలజాతులు పండిస్తున్నారు—నీలం + బేనీషాలు: సంకరం నీలేషా, నీలం, హిమాయుద్దీన్‌ల సంకరం నీలుద్దీన్, నీలం + మల్గోవా సంకరంనీల్గోవా, సువర్ణరేఖ + జహాంగీర్ సంకరంసువర్ణ జహాంగీర్, రుమానీ + మల్‌గోవాల సంకరం రుమాన్‌గోవా ఇత్యాదిగ, బీదల పానీయం, మామిడికాయ పప్పుడుల "ఉష్ణమును హరించును శీతవీర్యము, రుచ్యము, అల్పవ్యయము."

ఉ ప శ్రు తి :

ఒకరు:—"ఏమిటిసార్, తమిళకవులు రైలుకార్మికులను సమ్మె విరమించమంటూ కవితలు వ్రాశారే, మన కవిపండితులు ఏమి చేస్తున్నారు ?"

మరొకరు:—"మన వారికి తీరికఏదీ ! వరూధిని ప్రాంచద్భూషణ బాహామూల రుచి పై అంచులు ఎంతవరకు తాకిందో, పార్వతీదేవిస్తన మధ్యలో తామర తూడుదారం పడుతుందో లేదో పరిశోధన పూర్తికావద్దూ ?"

(15 వ పేజీ తరువాయి)


మీ కృషి రాణిస్తుంది. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కుంభం :— చేజిక్కిన అవకాశాలు కూడా జారి పోవచ్చును. వ్యాపారంలో శ్రమ కలుగుతుంది. మీ తాలూకు వస్తువులు పోయే ప్రమాదం ఉంది.

వా ర ఫ ల ం

వారం అఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభించగలదు. స్త్రీలకు— అధిక వ్యయం జరుగుతుంది. ప్రయాణాలోచనలు చేస్తారు.

మీనం :— మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. రావలసిన డబ్బు అందుతుంది. మిత్రుల సహాయం లభిస్తుంది. వారం అఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. వ్యతిరేక మైన వార్తలను వింటారు. స్త్రీలకు — ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.



CMVS. 95/F 234-TL

* సిఫారసు చేయబడిన అధికతమ చిల్లర ధర (స్థానిక పన్నుల అనుసారం)

ఆరున్నరయింది సాయంత్రం. ఆఫీస్‌లో అంతా వెళ్లిపోయారు, బయట వాచ్‌మన్ తప్ప.



"ఇక వెళతాను" అన్నది స్టెనో టైపిస్ట్ కళ్ళు దించుకుని నేలవంక చూస్తూ.

'పెర్రీక్లైన్' ఇరవైఏళ్ల టైపిస్ట్ జాకెట్‌కీ, చీరకీ మధ్య కనిపిస్తూవున్న రెండు అందమయిన ముడతలవంక చూసాడు. క్లైన్ ఎక్స్‌రే చూపులు భరించలేక కదిలింది స్టెనో.

లేచి ఆ అమ్మాయి చేతిని పట్టుకున్నాడు క్లైన్ కుడిచేతి చూపుడు వేలుతో ఆ అమ్మాయి బుగ్గ నునుపును చేత్తో రాసి పరీక్షిస్తున్నట్లు మృదువుగా అడిగాడు.

"నీ వయసెంతా? స్వీట్ సిక్స్‌టీన్? స్వీటర్ సెవెన్‌టీన్? ఎరోటిక్ ఎయిటీన్?"

"నాకు తెలీదు వదలండి నన్ను." గింజుకుంది స్టెనో టైపిస్ట్ భయంగా, కోపంగా, అసహ్యంగా.

"ఈజీ బేబీ" ... అన్నాడు విదేశీ యువకుడు.

"ఏమిటీ వికారం?" — ఆమె విదిలించింది.

"సింపిల్" నవ్వాడు. నాకు భారతీయులంటే, అందులో ఎరోటిక్ ఎయిటీన్ అమ్మాయి అన్నా, టీజింగ్ ట్వంటీ అమ్మాయిలన్నా, ముఖ్యంగా ఈవిధంగా వుండే అమ్మాయిలన్నా అమిత ఇష్టం."

పెర్రీక్లైన్ రెండు చేతులతో స్టెనో నడుం చుట్టూ చేతులువేసి, గాలిలోకి ఎత్తి, క్షణాల్లో ఏర్‌కండిషన్డ్ గదిలోకి వెళ్లిపోయాడు. అతని చేతిలో ఆమె రబ్బరు బొమ్మలాగ వుంది — అంతే...

ఆ గదిలోంచి అరుపులు బయటకు వినపడవు. సౌండ్‌ప్రూఫ్ గది అది.

అరగంట తర్వాత పెర్రీక్లైన్ సిగరెట్ వెలిగించుకుని, "మీకు కట్టుబాట్లు ఎక్కువకాబట్టి చెబితే నీకే నష్టం." అన్నాడు తన బ్రవున్ కలర్ కళ్లతో ఆసక్తిగా చూస్తూ.

అనుకోకుండా తను అలా నాశనం అవగానే షాక్ తగిలినట్లుగా మనసంతా మొద్దుబారిపోయింది స్టెనో టైపిస్ట్‌కి. ఎంతో రిజర్వ్‌డ్‌గా, హుందాగా వుండే క్లైన్ ఇంత దుర్మార్గుడని ఎప్పుడూ అనుమానించలేదు స్టెనో.

తను జరిగింది ఎవరికి చెప్పినా నమ్మరు. నమ్మినా తనకి కీడు తప్ప మేలు జరగదు. తను ఆ ఉద్యోగంలో చేరకముందు అకస్మాత్తుగా రాజీనామా యిచ్చిన ముగ్గురు స్టెనోల గురించి విన్నది తను. ఇప్పుడు ఆ రాజీనామా వెనకాల కారణం అర్థమయింది.

పెర్రీక్లైన్‌ని ఎవరూ, ఏమీ చేయలేరు. ఆశక్తురాలై అలాగే తలవంచుకుని వుండాలి. లేదా...

రాజీనామా చేసేసింది స్టెనో టైపిస్ట్ మర్నాడు. అంతకన్నా ఇంకేమీ చేయలేకపోయింది.

* * *

కర్నాటక రాష్ట్రంలో, సాండూర్ వ్యాలీ ప్రాంతంలో వున్న ప్రయివేట్ ఐరన్ ఓర్ మైన్ మంచి ఇనుము త్రవ్వి జపాన్‌కు ఎగుమతి చేయటం ఆ కంపెనీ వ్యాపారం.

కొండమీద, సహజంగా ఏర్పడ్డ ఇనుప గనుల నుంచి ఇనుము త్రవ్వి తీసే యంత్రాలు ఎగుమతి చేసిన ఫ్రెంచ్ కంపెనీ రిప్రజెంటేటివ్ పెర్రీక్లైన్. సంవత్సరం పాటు భారతీయ ఇంజనీర్స్‌కి ఆ భారీ యంత్రాలు వుపయోగించే విధం శిక్షణ ఇవ్వడానికి పంపబడ్డాడు.

నెలలో మూడు వారాలు ఐరన్ ఓర్ ప్రాజెక్ట్ దగ్గర, ఒక వారం ఆ కంపెనీ ఆఫీస్‌లో వుంటాడు క్లైన్ ఒప్పందం ప్రకారం. బొంబేలో ఆఫీస్‌లో వున్నప్పుడు ఫర్వాలేదు కాని ప్రాజెక్ట్ ఏరియాకి వెళితే స్త్రీ వ్యామోహం వున్న ఆ ఫ్రెంచ్ మనిషికి రోజులు భారంగా గడుస్తాయి.

ఎనిమిది వేల అడుగుల ఎత్తున వున్న కొండ మీద వున్న కంపెనీ గెస్ట్ హౌస్ అన్ని ఆధునిక సదుపాయాలతో, ఇనుప గనుల దగ్గరే వుంది. క్లైన్ అందులో వుంటాడు.

ప్రేల్చడం [బ్లాస్టింగ్] అవగానే, క్రింద కూలే పెద్ద పెద్ద ఇనుప రాళ్ళని జాయెంట్ కన్వేయర్ బెల్ట్ ద్వారా, తొమ్మిది వందల మీటర్ల దూరంలో వున్న క్రషింగ్ ప్లాంట్‌కి చేరుస్తారు. క్రషింగ్ ప్లాంట్‌లో చిన్న చిన్న పెళ్ళలుగా చేయబడతాయి పెద్ద రాళ్ళన్నీ. అక్కడ నాలుగు వందల మంది కూలీలు పని చేస్తారు.

ఆ రాత్రి ప్రాజెక్ట్ మానేజర్ ఇంటికి తొమ్మిదింటరకి ఆయన ఆహ్వానం మీద వెళ్లి, తన డిన్నర్ అక్కడ చేసి, పెర్రీక్లైన్ జీప్‌లో బయలుదేరాడు గెస్ట్‌హౌస్‌కి, రాత్రి పది గంటలకి — కొండ మీద వున్న గెస్ట్ హౌస్‌కి.

దాదాపు ఎనిమిది మైళ్ళ పొడవున్న రోడ్డు, క్రింద నుంచి మెలికలు తిరుగుతూ ఎక్కుతుంది పైకి. దానిమీద జీప్స్ తప్ప మరే బళ్ళు వెళ్లవు. కుడివైపు చూస్తే సాండూర్ లోయ. ఎడం వైపు ఎత్తయిన కొండలు. జీప్ హెడ్ లైట్స్ కాంతిలో క్లైన్ పోనిస్తున్నాడు జీప్‌ని కొండమీదకి; రాజీనామా చేసిన ఆ టైపిస్ట్ గురించి, కొత్తగా ఇంటర్వ్యూకి వచ్చిన అమ్మాయిని గురించి, విడాకులు ఇచ్చిన తన భార్య గురించి ఆలోచిస్తూ జీప్ నడుపుతున్నాడు క్లైన్.

ఎదురుగా గుంపుని చూసి, మలుపు తిప్పుతూ బ్రేక్ వేసి ఆపాడు జీప్‌ని క్లైన్. జీప్ క్రిందకి జారి పోకుండా రక్షణగా హేండ్ బ్రేక్ వేసి ఎదురుగా వున్న గుంపువంక చూసాడు.

అనాగరికులు. మాసిపోయిన బట్టలు. నోట్లో వెలుగుతున్న చుట్టలు, బీడీలు. అందరి చేతుల్లో గునపాలు, పారలు. రోడ్డుకి అడ్డంగా పడివున్న ఓ పెద్ద కొండరాయి. పెట్రోమాక్స్ లైట్లలో పని చేస్తున్న ఆ కూలీలని చూడగానే అర్థమయింది ట్రెరీక్లైన్‌కి, జారి రోడ్డుకి అడ్డంగా పడ్డ ఆ కొండ రాయిని తొలగిస్తున్నారని. ఆ రాయిని అడ్డం తొల గిస్తేగాని జీప్ వెళ్లేందుకు దారిలేదు.

దగ్గరే వుండి పని చేయిస్తున్న ఓ వుద్యోగి క్లైన్‌ని చూసి విష్ చేసాడు మర్యాదగా.

"ఎలా జరిగింది ?" అడిగాడు క్లైన్ అతన్ని.

"ఏమో ? అరగంట క్రితం వచ్చి చెప్పారు కూలీలు — నయం. ఎవరిమీదా పడలేదు. ఇలా అవటం మామూలే ఇక్కడ." అన్నాడు అతను నవ్వి.

"బుల్‌డోజర్ తెప్పించు. వీళ్లతో అయే పని కాదు ఇది, త్వరగా."

"మనిషిని పంపాను. ఈపాటికి వస్తూండాలి, డ్రయివర్ యింట్లోనే వుంటే."

సిగరెట్ త్రాగుతూ పెట్రోమాక్స్ లైట్ల కాంతిలో పని చేస్తున్న కూలీలవంక, ఆడ కూలీల వంక దీక్షగా చూసాడు క్లైన్. ట్రెరీక్లైన్ అంతవరకు హైక్లాస్, మిడిల్‌క్లాస్, ఒకళ్లిద్దరు అప్పర్ మిడిల్ క్లాస్ అమ్మాయిలనే చూసాడుకాని, లోక్లాస్ ఆడ వాళ్లని ఎప్పుడూ పరిశీలనగా చూడలేదు.

అరడజనుమందిదాకా వున్నారు. వాళ్లలో ఓ పదహారు, పదిహేడేళ్ల పిల్ల ఆకర్షించింది క్లైన్‌ని. అందరిలా కారునలుపుగా వున్నా అందంగా వుంది. గుండ్రటి మొహం, నల్లటి బొట్టు, విశాలమయిన కళ్లు, చిన్న నోరు, క్రింది పెదవి పై పెదవికన్నా కొంచెం లావుగా ధనుస్సులా వంపు తిరిగివుంది.

క్లైన్ కళ్లు జిగేలుమన్నాయి దృష్టి ఆ అమ్మాయిమీదకి వెళ్లగానే. నగ్నంగా వుంటే ఎలా వుంటుందో, తర్వాత పేరిస్‌లో 'గో–గో' డేన్స్ చేసే నర్తకి బట్టల్లో ఎలా వుంటుందో వూహించు కున్నాడు.

తనకి విడాకులిచ్చిన బ్రిగిటా కన్నా బావుంది అనుకోకుండా వుండలేకపోయాడు ట్రెరీక్లైన్.

బుల్‌డోజర్ వచ్చింది పావుగంట తర్వాత. మరో పావుగంటలో ఆ బండరాయిని అడ్డంతీసింది బుల్‌డోజర్. ఆ కూలీలంతా కొంచెం దూరంలో వెలుగు కనపడుతున్న ప్రాంతానికి అడ్డదోవన వెళ్లడం గమనించి వాళ్ల నివాసం అక్కడే నను కున్నాడు క్లైన్.

హేండ్ బ్రేక్ తీసి, కొత్త వూహాలతో, కొత్త ఆశలతో, కొత్త ఆలోచనలతో పైకి పోనించాడు ట్రెరీక్లైన్ జీప్‌ని.

మర్నాడు ఉదయం అంతా ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చాడు.

ఆ రాత్రి...

చీకట్లో అస్పష్టంగా కనిపిస్తున్న గుడిసెల వంక చూసాడు ట్రెరీక్లైన్, రహస్యంగా కొంచెం దూరంలో నిలబడి, వూపిరి బిగబట్టి.

క్లైన్ చేతికున్న రేడియం డయల్‌లో రెండూ యిరవై అయిదు అయిందని చూపిస్తున్నాయి ముళ్లు. దూరంగా లోయలో నక్కలు, మరేవో మృగాలు అరిచే అరుపులు, గాలిచేసే చప్పుడు, కీచురాళ్ల శబ్దం వినిపిస్తున్నాయి.

వూపిరి బిగబట్టి విన్నాడు క్లైన్. మరే చప్పుడూ లేదు. వేసం కాలం అరు బయట పడు కొని వున్న ఆ పది మంది కూలీలని చూస్తూంటే, తను చేయబోయే పనిని తలచుకుంటే, తన ధైర్యా నికి తనకే ఆశ్చర్యం వేసింది క్లైన్‌కి.

పిల్లిలా నడిచాడు ఆ అమ్మాయి వైపు. గాఢ నిద్రలో వున్న ఎవరికీ మెలకువ రాలేదు. చటుక్కున బలంగా గాలిలోకి ఎత్తి, భుజం మీద వేసుకుని, అరవకుండా నోరు గట్టిగా నొక్కి ఆ అమ్మాయితో క్లైన్ క్షణాల్లో తన జీప్‌ని చేరుకున్నాడు.

గేర్ వేసి, ముందే స్టార్ట్ చేసి వుంచిన ఆ జీప్‌ని పోనించాడు క్లైన్ కిందకి. గింజుకుంటూ, అరవడానికి ప్రయత్నిస్తున్న ఆ పిల్లని ఎడంచేత్తో నోరు నొక్కిపట్టుకుని, కుడి చేత్తో స్టీరింగ్ వీల్ కంట్రోల్ చేస్తూ కొండ కిందకి చేరుకున్నాడు ట్రెరీక్లైన్ పది నిముషాల్లో.

రోడ్ వదిలి నిర్మానుష్యంగా వుండే సాండూర్ వ్యాలీ వైపు దూసుకుపోయింది జీప్.

ఆ అమ్మాయి ఏడుస్తూ, భయంగా క్లైన్ వంక చూస్తూ ఏదో చెబుతోంది తుళు భాషలో. అర్థం కాలేదు క్లైన్‌కి. అర్థమయినా చేసేవాడు కాదు ఆ అమ్మాయి చెప్పినట్లుగా.

మర్నాడు వుదయం చాలా సేపటిదాకా లేవలేదు ట్రెరీక్లైన్. గెస్ట్‌హౌస్ కేర్‌టేకర్ పదిన్నరకి లేపితే మెలకువ వచ్చింది.

బెడ్ కాఫీ త్రాగి, సిగరెట్ తాగుదామని జేబులు తడిమాడు కాని, సాండూర్‌వ్యాలీ వైపు వెళ్ళేటప్పుడు, క్రితం రాత్రి తను వేసుకున్న దుస్తుల్లో వుండాల్సిన రీజెంట్ సిగరెట్ పాకెట్ కనపడలేదు.

ఇంకా దాంట్లో రెండు సిగరెట్స్ మిగిలిన గుర్తు. రాత్రి ఎక్కడో జారవిడుచుకుని వుంటా ననుకుని, క్రొత్త సిగరెట్ పాకెట్ విప్పాడు ట్రెరీక్లైన్.

ఆ అమ్మాయి, ఆ ఒంటి వాసన, ఆ వంటి నునుపు, పళ్ళ పదును గుర్తు చేసుకున్నాడు సిగరెట్ పూర్తయేదాకా.

క్రషింగ్ ప్లాంట్ వైపు వెళ్ళాడు క్లైన్ వదకొండున్నరకి, బ్రేక్ ఫాస్ట్ ముగించి. నిశ్శబ్దంగా వుంది అంతా. పని జరగడంలేదు ఎక్కడా.

"ఏమయింది ?" అడిగాడు క్లైన్ ఓ వుద్యోగిని కొద్దిగా ఆశ్చర్యంగా.

"పనివాళ్ళెవరూ పనిలోకి రాలేదు. అంతా ఇవాళ కొండకిందే వుండిపోయారు" చెప్పాడతను.

"ఏం ?" అడిగాడు సిగరెట్ వెలిగించి, ఎలాంటి సమాధానం వస్తుందోనని ఆలోచిస్తూ.

"వాళ్లలో ఓ అమ్మాయి..."

ఆ ఉద్యోగి తన మొహంవంక చూడకుండా జాగ్రత్తపడ్డాడు ట్రెరీక్లైన్, మొహం ప్రక్కకి తిప్పుకుని.

"వాళ్లలో ఓ అమ్మాయి చచ్చిపోయిందిట. అందుకని పని మానేసారు."

"ఎలా పోయింది ?"

"ఇందాకే వ్యాలీలో శవాన్ని కనుక్కున్నారు. ఏదో మృగం చంపిందిట. రెండు మూడు ఎలుగు బంట్లు కనపడ్డాయి అమధ్య వ్యాలీలో ఆచోట."

క్లైన్ గుండె ఝల్లుమంది. అదృష్టం. తను ఏ మృగం వాతా పడలేదు. నెమ్మదిగా చేరుకుంటుం దని, తేరుకోవాలని, ఆ అమ్మాయిని ఆ స్థితిలో అక్కడే వదిలివచ్చాడు కావాలని. చేరలేదన్నమాట. ఒకందుకు మంచిదే ఇలా జరిగినందుకు.

"ఆ అమ్మాయి అసలక్కడికి ఎలా వెళ్లిందో, ఎందుకు వెళ్లిందో అర్థంకావటంలేదు నాకు" అన్నాడా ఉద్యోగి.

ట్రెరీక్లైన్ మాట్లాడలేదు.

* * *

దాదాపుగా అడవిజాతి వాళ్లయినా ఆ కూలీలు బెస్ట్ ట్రేకర్స్ అని, జంతువులు, మనుష్యుల అడుగులనిబట్టి ట్రేక్‌చేసి ఎంత దూరమయినా వెంబడించగలరని తెలియదు ఫ్రాన్స్ నుంచి వచ్చిన ట్రెరీక్లైన్‌కి.

మర్నాడు ఉదయం ఉద్యోగులు కొందరు ట్రెరీక్లైన్‌ని కనుక్కున్నారు—ఓ తారు డ్రమ్ములో !

కొండమీదకి వెళ్లే రోడ్డు రిపేర్‌కోసం తేబడిన ఓ తారు డ్రమ్ములో, త్రాళ్లతో కట్టబడి వున్నాడు క్లైన్. బ్రతికుండగానే, ఆ డ్రమ్ములో, గడ్డందాకా ముంచి, క్రింద మంటపెట్టి, సలసల మరిగే ఆ తారులో యమయాతనపెట్టి చంపారు ట్రెరీక్లైన్‌ని అతి క్రూరంగా.

చెక్కుచెదరని క్లైన్ మొహంలో, అతను అనుభవించిన చిత్రవధ తాలూకు ఛాయలు స్పష్టంగా కనబడుతున్నాయి.

నాగరికులు చేయగలిగే పని కాదది !

ఎవరి దృష్టినీ అంతగా ఆకర్షించకుండా ఓ వస్తువు కొంచెం దూరంలోనే నేలమీద పడివుంది. అది ట్రెరీక్లైన్ తనతోపాటు తెచ్చుకుని, సేండూర్ వ్యాలీలో పోగొట్టుకున్న వస్తువు.

సిగరెట్‌పేక్.

రీజెంట్ సిగరెట్‌పేక్ !

దాంట్లో వున్న రెండే రెండు సిగరెట్స్ చెక్కు చెదరకుండా అలాగే వున్నాయి !!

బంగారు కలలు

యద్దనపూడి సులోచనారాణి

(గత సంచిక తరువాయి)

37

ప్రసాద్ క్లినిక్‌లో —

పేషెంట్స్ వరసగా కూర్చునివున్నారు.

సరోజ పనిమీద హడావుడిగా అటు యిటూ తిరుగుతోంది.

డాక్టరుగారి పురమాయింపుమీద బేసిన్‌తో వేడినీళ్లు తీసుకుని గబగబా ఆయన గదిలోకి వెళ్తున్న సరోజకి, కూర్చున్నవారిలో నుంచి, ఒక మగ కంఠం, 'ఏయ్! నర్సమ్మా! యిలా రా కాస్త!' అని పిలవటం వినిపించింది.

ఆ కంఠం వినగానే ఉలిక్కిపడిన సరోజ భుజంమీదుగా తలతిప్పి చూసింది! ఆవెంటనే చప్పున ముఖం తిప్పుకుని అడుగుల వేగం హెచ్చించింది.

వరసగా కూర్చున్న మనుష్యుల్లో, బెంచిమీద చిట్టచివరగా బాగా త్రాగివున్న శేషగిరి పెద్ద పెద్ద అంగలేసుకుంటూ సరోజ దగ్గరకి వచ్చాడు.

'ఏయ్ నర్సమ్మా! ఈ హాస్పిటల్లో సరోజ అనే అమ్మాయి వుందా?' అని అడిగాడు.

సరోజకి క్షణం నోటినుంచి మాట రాలేదు! చేతిలో బేసిన్ కంపించసాగింది.

సాధ్యమైనంతగా గొంతు మార్చి 'ఐ డోంట్ నో!' అంది.

'పోనీ రోజీ అనే అమ్మాయి వుందా? ఎర్రగా, సన్నగా వుంటుంది!' వివరాలు చెప్పాడతను.

'ఐ డోంట్ నో తెలుగూ!'

'నీకు తెలుగు రాదూ! ఖర్మ.' శేషగిరి యింకోవైపు వెళుతున్న మరో నర్సుని చూడగానే గబగబా అటు వెళ్లాడు.

సరోజ చప్పున గుమ్మం దాటి లోపలికి అడుగు పెట్టింది.

అవతల దూరంగా శేషగిరి కంఠం విన్పిస్తూనే వుంది.

'సిస్టర్! ఈ హాస్పిటల్లో సరోజ అనే అమ్మాయి వుందా?'

'వుంది. ఎందుకు?'

'మాట్లాడాలి.'

'డాక్టరుగారున్నారు. డ్యూటీ టైమ్‌లో స్టాఫ్ ఎవరూ విజిటర్స్‌ని చూడటానికి వీల్లేదు. వెళ్లండి.' ఆవిడ కసిరింది.

శేషగిరి లోలోపల తిట్టుకుంటూ బైటకి నడిచాడు.

'అదేమిటి సరోజా! అక్కడే నిలబడిపోయావేం? నీళ్ల పట్టుకురా' ప్రసాద్ హెచ్చరించాడు.

సరోజ గబగబా నీళ్ల తెచ్చి అక్కడ పెట్టింది.

'అదేమిటి అలా వున్నావు? ఎవరైనా ఏమైనా అన్నారా?' ప్రసాద్ చిరు చెమటలు అలుముకున్న సరోజ ముఖం చూస్తూ అడిగాడు.

'అబ్బే! ఏం లేదు డాక్టర్. ఏం లేదు.' సరోజ చప్పున జేబురుమాలు తీసి ముఖం అంతా తుడుచుకుంది.

ప్రసాద్ విస్ఫారంగా చూసాడు.

'నాకు చెప్పకూడదా?'

'డాక్టర్ —' సరోజ తటపటాయింపుగా చూసింది.

'చెప్పు. ఏమిటది?'

'మీ దగ్గరకు వచ్చి నా గురించి ఎవరైనా అడిగితే యిక్కడ లేనని, నాకు తెలియదని చెబుతారా?'

ప్రసాద్ సరోజ ముఖంలోకి దీక్షగా చూసాడు.

'శేషగిరి కనిపించాడా?'

సరోజ తల దించుకుంది. అవునన్నట్టు తల వూపింది.

ప్రసాద్ చెయి కదిలి సరోజ చెయ్యి అందుకోబోయి, అంతలోనే నిగ్రహించుకున్నట్టుగా ఆగిపోయింది.

'భయపడకు సరోజా! ఈ నాలుగు గోడల మధ్యా వుండగా నిన్నెవరూ ఏం చెయ్యలేరు! నువ్వు నిశ్చింతగా వుండు.'

'థ్యాంక్ యూ డాక్టర్! థ్యాంక్ యూ!' సరోజ అస్పష్టంగా అని అక్కడి నుంచి వెళ్లిపోయింది.

సరోజ వెళ్లిన వైపే చూస్తుండిపోయిన ప్రసాద్ నిట్టూర్చాడు.

38

రాత్రి 8 గంటలు అయింది!

డ్యూటీనుంచి వచ్చేసిన సరోజ, తన క్వార్టర్స్‌లో భోజనం ముగించుకుని, ముందు గదిలో కూర్చుని ఉత్తరం వ్రాసుకుంటూ, మధ్యలో ఎందుకో లేచి లోపలికి వెళ్లింది.

సరోజ మళ్లీ తిరిగిరాగానే, 'మంగమ్మా! మంగమ్మా! యిప్పుడే యిక్కడ పెన్ పెట్టి వెళ్లాను! కనిపించలేదే! నువ్వేమైనా చూసావా?' అంటూ కేకలు పెట్టింది.

'నాకు తెలియదమ్మా! నేను చూడలేదు!' వంట ఇంట్లోంచి మంగమ్మ సమాధానం చెప్పింది.

'అరే! యిప్పుడేగా యిక్కడ పెట్టి వెళ్లింది. ఏమైందీ?' క్రింద పడిందేమోనని వంగి చూస్తున్న సరోజకి బీరువా పక్కనుంచి 'నేను తీసాను.' అన్న స్వరం వినిపించింది. సరోజ మెరుపులా లేచి నిలబడింది.

శేషగిరి ఎప్పుడు వచ్చి నిలబడ్డాడో! బీరువా పక్కగావున్న క్రీనీడలో నుంచి కదిలి యివతలకి వచ్చాడు.

'నువ్వా!' అంది సరోజ.

'అవును. నేనే! ఉదయం హాస్పిటల్లో తెలుగు తెలియదన్నావుగా! తెలుగు వచ్చునో లేదో, తెలుసుకుందామని వచ్చాను.'

శేషగిరి విజయం పొందినట్టుగా నవ్వాడు.

'ఎందుకొచ్చావిక్కడికి?'

'అబ్బా! ఎప్పుడొచ్చినా యిదే మాటా!'

'మర్యాదగా అవతలకి వెళ్లు.'

'భలే భార్యవి దొరికావు! ఎప్పుడు వచ్చినా పో పో అని ఒకటేమాట!'

'భార్య! మనకి జరిగింది పెళ్లే కాదని నువ్వు లక్షసార్లు అన్నావు! నువ్వు నన్ను పెళ్లాడలేదని, నాయిష్టంవచ్చిన చావు చావమని, యింట్లోంచి బైటకి నెట్టావు! నా బ్రతుకు నేను బ్రతుకుతున్నాను! నన్నెందుకిలా వెంటాడతావు? నీతో పీడకలలా జరిగిన ఆ జీవితాన్ని మాటిమాటికీ ఎందుకు గుర్తుకుతెస్తావు? వెళ్లు! నీకో నమస్కారం! దయయుంచి వెళ్లు!'

సరోజ చేతులు జోడించింది.

సరోజ ఆవేశంగా, ఆ మాటలు అంటూంటే, ఎగిసిపడుతున్న ఆ గుండెలమీద, తళతళ మెరుస్తున్న, ఒంటిపేట బంగారు గొలుసుమీద శేషగిరి దృష్టి అంటుకుపోయినట్టుగా నిలిచింది.

ఒక్కొక్క అడుగే వేస్తూ, దగ్గరగా వచ్చాడు!

సరోజ వెనక్కి అడుగులువేస్తూ పారిపోబోయింది!

జరిగిన కథ: 13 రవి, వేణు పురుషోత్తంగారి కుమారులు. సరోజ, డాక్టర్ ప్రసాద్‌లు కూడా పురుషోత్తంగారివద్ద పెరిగారు. పురుషోత్తంగారి చిన్ననాటి స్నేహితుడు రాజారావుగారి సాయంతో ఫ్రూట్ కానింగ్ ఇండస్ట్రీ స్థాపిస్తాడు రవి. ప్రేమించిన శేషగిరిచే మోసగింపబడి ఆత్మహత్యకు పూనుకున్న సరోజ ఎలా క్లబ్‌డాన్సర్‌గా మారిందీ రవికి చెప్తుంది. జైలునుంచి విడుదలయిన శేషగిరి సరోజ సంపాదనంతా కాజేసాడని రవిని నిందిస్తాడు. చిదంబరం ఎత్తుగడతో రాధ వేణుల వివాహం జరిపిస్తాడు రవి. శేషగిరి నాటిన విషబీజంతో రాజారావుగారు నిశ్చయించిన సంబంధాన్ని జ్యోతి రవిని వారికి పరిచయం చేసి చెడగొడుతుంది. రవి రవి ఫ్యాక్టరీ బాధ్యత చిదంబరానికి అప్పగించి సింగపూర్ వెళతాడు. రవితో వివాహానికి రాజారావుగారు అంగీకరించకపోవటంతో క్షోభచెందుతుంది జ్యోతి.

శేషగిరి చటుక్కున చెయి చాచి ఆమెని పట్టు కున్నాడు.

'ఛీ! వదులు—' సరోజ పెనుగులాడింది.

శేషగిరి సరోజ మెళ్లో గొలుసుపట్టి గట్టిగా, బలంగా లాగాడు! గొలుసు వురితాడులా, లాగగా, సరోజ కెవ్వుమంది!

సన్నటి గొలుసు, ఎక్కువ శ్రమ లేకుండానే, తెగి, వూడివచ్చింది! శేషగిరి అది చేతిలో పట్టు కుని పకపకా నవ్వాడు.

సరోజ గడ్డం పట్టుకుని వూపుతూ, 'నీ కిష్టంవున్నా, లేకపోయినా, నువ్వు బ్రతికి వున్నంతకాలం నేను నీ మొగుడినే! నాయిష్టం వచ్చినప్పుడు వస్తాను! వెళ్తాను! నన్ను ఆ దేవుడుకూడా ఆపలేడు! గుర్తుంచుకో! అంతే కాదు! నువ్వు ఎన్ని అడ్రస్‌లు మార్చినా, ఆ రవిగాడు నిన్ను ఏ మారుమూల దాచినా నేను కనుక్కోగలను. అదికూడా బాగా గుర్తుంచుకో! వాడిని చూసుకునేగా నీకు గర్వం! వాడిని గురించి ఆ రాజారావుగారికి అంతా చెప్పేసాను! లేకపోతే వా పెళ్లాన్ని నాకు కాకుండా చేస్తాడా! అందుకే నీ విషయం అంతా ఆయనకి చెప్పేసి, వాడి పెళ్లి చెడగొట్టి, తిక్క కుదిర్చాను! నీ డబ్బంతా కాజేసి అన్యాయం చేసినందుకు పాఠం నేర్పాను! వాడిని జీవితాంతం యిట్లాగే వేధించి దెబ్బకి దెబ్బ తీర్చు కుంటాను!' శేషగిరి గొలుసు లాల్చీ జేబులో వేసు కుని వెళ్లిపోయాడు.

గొలుసు బలవంతంగా తెంచడంతో, సరోజ మెడమీద గీసుకుపోయి రక్తం రాసాగింది!

శేషగిరి వెళుతూ రవి పెళ్లి చెడగొట్టిన వైనం వినిపించగా, సరోజ పిడుగుపడిన దానిలా, నిశ్చేష్టురాలిలా చూడసాగింది.

సరోజ కేకలు విని, హడిలిపోయిన మంగమ్మ, చేస్తున్న పని వదిలి పరుగెత్తుకు వచ్చింది.

'ఏమిటమ్మా! ఏమైంది? అయ్యొయ్యో! మెడదగ్గర ఆ రక్తం ఏమిటి?' అంది ఖంగారుగా.

సరోజ కుర్చీలో కూలబడి అరచేతిలో ముఖం దాచుకుని ఏడవసాగింది.

39

రవి సింగపూర్ నుంచి తను రావటానికి యింకో నెల పట్టేట్టు వుందని, ఫాక్టరీ జాగ్రత్తగా చూడమని కోరుతూ, చిదంబరానికి వుత్తరం వ్రాసాడు. అది చూడగానే ఆయనకి ఏనుగు ఎక్కి నంత సంతోషం అయింది. ఆఫీసులో ఎకౌంటెంట్ ఆయనకి కుడి భుజంగా మారాడు. వేణుకి మంచి చెడు లేవీ తెలియవు. మామగారు ఎక్కడ సంతకం పెట్టమంటే అక్కడ కళ్లు మూసుకుని పెట్టే స్తాడు!

చిదంబరం ఆ ఫాక్టరీకి తనే యజమానిలా పెత్తనం సాగించసాగాడు. రవి వూరు వెళుతూ, వర్కర్స్‌కి జీతాలు, బోనసులూ యివ్వమని చెప్పి యిచ్చిన చెక్స్ ఆనాడే కాష్ చేసి యింట్లో భద్ర పరుచుకున్నాడు. ఎకౌంటెంట్ నోరు మెదప కుండా అతనికి కాస్త పడేసాడు. శేషగిరి ఫాక్టరీకి వస్తూ, పోతూ చిదంబరానికి ఆప్తమిత్రుడయాడు.

చిదంబరం శేషగిరికి కోరినప్పుడల్లా డబ్బు యిస్తు న్నాడు. అతన్ని చూసినప్పుడల్లా, రవిని గిరగింతలు కొట్టించగల సాధనం ఏదో తన గుప్పెట్లో వున్నంత సంతృప్తి, ఆనందం ఆయనకి కలుగుతూ వచ్చాయి.

ఫస్ట్ వచ్చింది! వర్కర్స్‌కి పండగకి బోనసులు ముట్టకపోగా, అసలు జీతాలే అందలేదు! 'ఆయన నాకేం డబ్బు యిచ్చి వెళ్లలేదు.' అన్నాడు చిదంబరం. ఇందులో ఏదో తిరకాసు వుందని గ్రహిం చిన వర్కర్స్ ఓర్మితో, ఒకరికి ఒకరు ధైర్యం చెప్పుకుని, రవి రాక కోసం వేయి కళ్లతో ఎదురు చూడసాగారు.

అతను రావటం యింకో నెల ఆలస్యం అవు తుందనే వార్త వారికి పిడుగుపాటులా అయింది.

వర్కర్స్ పని నానాటికి దిగజారింది. యూనియన్ సెక్రటరీ వచ్చి, బాంక్‌లో మంచి డబ్బు తీసి జీతాలు యివ్వమని, రవి వచ్చిన తర్వాత తను నచ్చచెబుతానని అర్థించాడు. చిదంబరం బాంక్‌లో డబ్బు లేదన్నాడు. దానితో వాళ్లు పని మానేసారు.

ఫాక్టరీ మూత పడింది! బుక్ అయిన ఆర్డర్స్‌కి సరుకు సమయానికి పంపబడలేదు!

రవి ప్లేన్ దిగి ఎయిర్‌పోర్ట్‌లో అడుగు పెట్ట గానే యూనియన్ సెక్రటరీ వచ్చి యీ గందరగోళం అంతా వినిపించాడు. రవి అతన్ని తీసుకుని, సరాసరి ఫాక్టరీకి వెళ్లాడు.

ఫాక్టరీ ఆవరణనిండా ఎర్ర జెండాలు పాతి వున్నాయి. వర్కర్స్ నినాదాలు ప్రతిధ్వనిస్తున్నాయి.

చిదంబరం, వేణు వాళ్లతో ఘర్షణ పడు తున్నారు.

రవి కారు చూడగానే నినాదాలు తగ్గినాయి! అతను కారు దిగి రాగానే అందరూ ఆనందోత్సాహా లతో మళ్లీ అరిచారు!

గుంపుగా నిలబడిన అందరూ, తొలగి దారి యిచ్చారు.

రవి వాళ్లకి సర్దిచెప్పి, శాంతపరిచాడు. విషయం కనుక్కుని న్యాయం చేకూరుస్తానని వాగ్దానం చేసాడు.

'మామయ్యా! నువ్వు యిలా రా!' అంటూ లోపలకి వెళ్లాడు.

చిదంబరం, వేణు ముఖాలు చూసుకున్నారు.

చిదంబరం రవి వెంట వెళ్లాడు. కాసేపు తటపటాయించిన వేణు తనుకూడా లోపలకి వెళ్లాడు.

'మామయ్యా! వర్కర్స్‌కి జీతాలు ఎందుకు యివ్వలేదు?' రవి తీక్షణంగా అడిగాడు.

(28వ పేజీ చూడండి)





పి. సి. కి బదులు కె. ఆర్.

లలితా మూవీస్ నిర్మిస్తున్న చిత్రాన్ని పి. చంద్రశేఖరరెడ్డి డైరెక్ట్ చేస్తున్నట్టు, నాల్గయిదు సార్లు వ్రాశాను. ఆ చిత్రం తాలూకు పాట రికార్డింగు మే మూడున జెమినీలో జరిగింది. ఆ రోజున దర్శకుడు మారినట్టు చెప్పారు, నిర్మాత జి. ప్రసాద్. ''అభిమానవంతులు'' చిత్రంలో తన ప్రతిభను చాటిన కె. రామిరెడ్డి ఈ బాధ్యతను స్వీకరించడం జరిగింది. దర్శకుడు పి. సి. రెడ్డికి అయిదు చిత్రాలు వొత్తిడి నివ్వడంవల్ల, ఆయనే ఈ మార్పును సూచించినట్టు నిర్మాత చెప్పారు.

కవి దాశరథి వ్రాసిన వలపు పాటను, సంగీత సారధి రాజేశ్వరరావు సమకూర్చిన సుమధుర సంగీతంలో సుశీల, రామకృష్ణ మధుర మనోహరంగా పాడారు.

అతడు : నా మనసు నీ వయసు
జతగా ఊయేలలూగెలే.
ఆమె : నా వలపు నీ పిలుపు
ఒకటై ఆశలు రేపెలే.

ఈ పాటకు రాజేశ్వరరావు అరవై వాయిద్యాలను సహాయంగా తీసుకొన్నారు. మళ్లీ మళ్లీ వినాలి - అనిపించే విధంగా పాట వచ్చింది.

అన్యోన్యానురాగ మనస్కులయిన ప్రేయసీ, ప్రియులుగా 'క్రొజర్' నటిస్తున్న ఈ చిత్రంలో

దాశరథి - రఫీ

రాజలక్ష్మి కంబైన్స్ వారి చిత్రానికి దాశరథి ఒక హిందీ పాటను వ్రాశారు. ఆ పాటను మహమ్మద్ రఫీ పాడారు. పాట సాహిత్యాన్ని విని, దాశరథిని మహమ్మద్ మెచ్చుకొన్నారు. తను వ్రాసిన పాటను అమోఘంగా పాడిన రఫీని దాశరథి అభినందించారు. ఇంతకీ ఆ పాట ఏమిటో తెలపాలిగా.

''యూనానీ హకీం హూఁ
ఈరాన్ సె ఆయా హూఁ
బీమారీ జైసీ హో
వైసీ దవా లాయా హూఁ'' ఈ పాటను

రాజేశ్వరరావు చేశారు.

బాలకృష్ణ హరికృష్ణ

ఆంధ్రుల ప్రియతమ నాయకుడు, నటరత్న రామారావుగారి చిరంజీవులు ముఖ్య పాత్రలను పోషిస్తున్న రాజలక్ష్మి కంబైన్స్ వారి సందేశాత్మక చిత్రానికి బి. ఏ. సుబ్బారావు దర్శకుడు. ఎన్టీఆర్‌కి ఆప్తబంధువు చిరంజీవి రుక్మాంగదరావు నిర్మిస్తున్న ఈ చిత్రంలో 'షావుకారు' జానకి, సత్యనారాయణ ప్రధాన భూమికలను ధరిస్తున్నారు.

హీరో పుట్టాడు !

చిరంజీవి బాలకృష్ణను ''తాతమ్మ కల'' చిత్రంలో చూస్తారుగా. ఆ చిరంజీవి ముఖంలో

సినిమా విశేషాలు

చూసి ఆశ్చర్యపోయాను. ఎంతో అనుభవం వున్న నటివలె రాధా బి. ఏ నటిస్తూవుంది. మంచి భవిష్యత్తు వున్న నటి అనిపించింది. వెండితెరకు ఒక చక్కటి నటిని యిస్తున్న నిర్మాత ఎన్. వి. సుబ్బరాజును, దర్శకుడు పి.సి. రెడ్డిని అభినందించాను.

ఈ చిత్రంలో కృష్ణంరాజు, శుభ, సత్యనారాయణ, పద్మనాభం, అల్లు రామలింగయ్య, గీత ప్రసాద్ ముఖ్య పాత్రధారులు.

అల్లుకొచ్చిన అధికారం

జనంలో అల్లు రామలింగయ్యకు ఒక ప్రత్యేక స్థానం వున్నది. ఎక్కువ చిత్రాలలో ఈయన నాగభూషణానికి సలహాదారుడిగానో, సెక్రటరీగానో,

''బంట్రోతు భార్య''లో శ్రీవిద్య, కృష్ణంరాజు

గుమాస్తాగానో వేషాలు వేస్తుంటారు. అట్టి అల్లుకు ''ఆడపిల్లల తండ్రి'' చిత్రంలో ప్రమోషన్ వచ్చింది.

నాగభూషణం మీద అధికారం చెలాయించే పాత్రను రామలింగయ్య ధరించారు. అధికారి పాత్ర నిర్వహణలో కూడా మనల్ని అడుగడుగునా నవ్విస్తూ, పాత్ర యొక్క హుందాతనాన్ని ఏమాత్రం చెడగొట్టకుండా నటించారు.

''ఆడపిల్లల తండ్రి'' కథను చిరంజీవి వాసు వ్రాశాడు. ప్రతి మనిషికి దగ్గిరగా వున్న కథ యిది. ఆడపిల్లల్ని గన్న తల్లి తండ్రులు పడే పాట్లను చిత్రించిన కథ యిది. కరుణ రస భరిత మైన కుటుంబ కథ యిది. ఇందులో నాగభూషణం చేత వెరైటీ వేషాన్ని వేయించాడు వాసు.

ఈ చిత్రానికి ప్రత్యగాత్మ సినిమా అనువాదాన్ని, చలపతిరావు సంగీతాన్ని, వి. ఎస్. ఆర్. కృష్ణ ఛాయను, శ్రీహరిరావు కూర్పును నిర్వహించారు. ముఖ్య పాత్రలను రాజబాబు, చంద్రమోహన్, గిరిబాబు, భారతి, జయసుధ, పద్మప్రియ, రావి కొండలరావు, సత్యనారాయణ మరియు హీరోగా కృష్ణంరాజు పోషించారు.

''ఓ సీత కథ''లో శుభ పాత్ర

గత వారం రోజా ధరించిన సీత పాత్రను గూర్చి క్లుప్తపరిచాను. ఇప్పుడు అదే చిత్రంలో శుభ పోషించిన సావిత్రి పాత్రను గూర్చి నాలుగు

విశ్వనాథ్ వివేకం

ఒక సంవత్సరం తిరగకముందే తను దర్శకత్వం నిర్వహించిన మూడు చిత్రాలు నూరు రోజులు ప్రదర్శింపబడినా, ఒకే ఏడు నాలుగు అవార్డులు లభించినా, యిసుమంత గర్వాన్ని తన చెంతకు రానివ్వని మహా మనిషి మన విశ్వనాథ్.

అతిశయోక్తి కాదనుకుంటే ఒక నిజాన్ని పాఠకులకు తెలుపుతాను. కాశీనాధుని విశ్వనాథ్ వదిలేసిన చిత్రాలు పదయినా వున్నాయి. అడిగిన వాళ్ల మనసును నొప్పించడానికి మాత్రం కాదు. ఒక సంవత్సరంలో మూడు చిత్రాలకు మించి చెయ్యడం భావ్యం కాదని విశ్వనాథ్ అభిప్రాయ పడుతున్నారు. అలా అయినప్పుడు, చేసే మూడింటికీ పూర్తి న్యాయం చెయ్యడానికి వీలుంటుంది అంటారు ఆయన.

ఇప్పుడాయన ఓ సీత కథను, అమ్మ మనసును పూర్తి చేశారు. త్వరలో డి. వి. ఎస్. రాజు చిత్రాన్ని, ఎన్. బాలయ్య చిత్రాన్ని ప్రారంభిస్తారు. ఇలా ప్లాను ప్రకారం చెయ్యడంవల్ల, కథకు న్యాయం జరుగుతుంది. కథను నడిపించే దర్శకునికి పాపులారిటీ పెరుగుతుంది. ఈ రహస్యం తెలిసిన విశ్వనాథ్‌ను వివేకవంతుడు అనడం తప్పా ?





''ధనవంతులు—గుణవంతులు''లో ఒక దృశ్యం

ఎస్వీరంగారావు, జయంతి, కాంతారావు, రాజబాబు, రమాప్రభ, అల్లురామలింగయ్య, ధూళిపాళ, సమిత్ర ముఖ్య పాత్రధారులు. హీరో పాత్రను న్యూ ఫ్రెండ్ ? నటిస్తున్నాడు.

శ్రీ త్యాగరాజు రామాయణం

చిత్ర కల్పన తలపెట్టిన తరువాతి చిత్రం. కథను ముళ్లపూడి వ్రాశారు. బాపూ దర్శకుడు. నిర్మాత ఎన్. ఎస్. మూర్తి. ప్రధాన పాత్రను ఆంధ్రులకు అగ్రనటుడు అనిపించుకుంటున్న మూడు పదుల యువకుడు నటించబోతున్నట్టు, ఆయన ద్వారా తెలుసుకొన్నాను. అత డెవరై యుంటారో వూహించండి.

కాశ్మీరు షూటింగు

జగపతి పిక్చర్స్ ఈస్ట్ మన్ కలర్‌లో నిర్మిస్తున్న ''మంచి మనుషులు'' చిత్రం తాలూకు అవుట్‌డోర్ షూటింగు పక్షం రోజులు కాశ్మీరులో జరిగింది. శోభన్‌బాబు, మంజుల, నాగభూషణం, రాజబాబు పాల్గొన్నారు. ఈ చిత్రానికి వి. బి. రాజేంద్రప్రసాద్ దర్శకుడు.

ఎంత ఆకర్షణ, అలాగే భావప్రకటనలో ఎంత సహజత్వం, అతని వాచకంలో ఎంత మాడ్యులేషన్ వున్నదో మీరే చెప్తారుగా. తండ్రిలాటి హీరో పుట్టాడు అని ప్రేక్షకులు అంటారు.

ముగ్గురు కూతుళ్లు

ఇది సినిమా పేరుకాదు సుమండి. శ్రీ వాణీ ఆర్ట్ కంబైన్స్ నిర్మిస్తున్న ''పుట్టింటి గౌరవం'' చిత్రంలో సూర్యకాంతం ఒక గమ్మత్తయిన పాత్రను పోషిస్తున్నది. ఆమెకు ముగ్గురు కూతుళ్లు వున్నారు. కథ ప్రకారం. ఆ ముగ్గురు ఎవరంటే? పుష్పకుమారి, సునందిని, రాధా బి. ఏ. ఈ చిత్రానికి పి. చంద్రశేఖరరెడ్డి దర్శకుడు.

రాధా బి. ఏ.

ఈమెది విజయనగరం. పట్టభద్రురాలు. షుమారు రెండువందల పైచిలుకు నాట్య ప్రదర్శనలు యిచ్చింది. ఈమెకు ''పుట్టింటి గౌరవం''లో ఒక ముఖ్య పాత్ర యివ్వబడింది. ఈమె ఎలా నటిస్తున్నదో చూద్దామని షూటింగుకు వెళ్లాను. దర్శకుడిచ్చే సూచనలను బాగా జీర్ణించుకుంటూ, ఒకే టేకులో కరెక్టుగా చేస్తూవున్న వైనాన్ని వాక్యాలు వ్రాస్తాను.


''దించిన తల ఎత్తని ఎం. ఏ. ఎవరితో పలుకదు. అట్టి సావిత్రి కుటుంబం కోసం కాలికి గజ్జె కట్ట వలసి వచ్చింది. పరిస్థితుల్ని ఆనందంగా 'ఏదు ర్కొంది. చెల్లెలు బావను ప్రేమిస్తే, మనసూర్తిగా దీవించి, వాళ్ల దాంపత్యానికి కలలు కంది. అసలే అలాంటి కోర్కెకు చోటు యివ్వని సాధ్వి. చెల్లెలు ఏర్పాటు చేసిన పెళ్లి చూపులకు భయంతో కూర్చుంది. ఎట్టి పరిస్థితులు వచ్చినా, ఆత్మ గౌరవాన్ని విడని వనిత యీ సావిత్రి.''

ఈ సావిత్రి పాత్రను కథకుడు విశ్వనాథ్ శుభ చేత వేయించారు. దర్శకుడు విశ్వనాథ్ ఆమె చేత అసాధారణంగా చేయించారు. శుభకు శుభవేళను తెచ్చే పాత్ర యిది.

''ఓ సీత కథ''ను గూర్చి వ్రాయాలంటే విశ్వనాథ్‌కు మాత్రం అయిదు పేజీలు కావాలి. ఈ చిత్రాన్ని ఆయన తప్ప మరొకరు చెయ్యలేరు. పెద్ద తారలు లేని యీ చిత్రం ప్రేక్షకులకు పెద్ద రిలీఫ్ నిస్తుంది. ఈ చిత్రానికి శర్మ (శ్యామ సుందర్) నిర్మాత.

''హీరా పన్నా''లో జీనత్, దేవ్





''మంచి మనుషులు''లో మంజుల

క్రొత్త సంస్థకు క్రొత్త దర్శకుడు

వై. సుబ్బారావు, యన్. రవీంద్రనాథ్ కలిసి స్థాపించిన నూతన చిత్ర నిర్మాణ సంస్థయే ''చౌడేశ్వరీ ఎంటర్‌ప్రైసెస్.'' వీరు పరిశ్రమకు క్రొత్తవారే అయినా, ప్రేక్షకుల పేస్సును పసిగట్టి, పటిష్టమైన కథ ఎన్నుకున్నారు. చిత్రం పేరు ''మానవుడే దేవుడు.'' ''ఎక్కడో లేడులే దేవుడు, నిర్మల మనస్కుల మనసుల్లో కొలువై వున్నాడు'' అనే నిరక్షర సత్యాన్ని నిదర్శనపూర్వకంగా ఋజువు పరచే చిత్రం యిది. ఈ చిత్రానికి పి. శ్రీవాన్ అనే క్రొత్త దర్శకుడ్ని ఎన్నుకున్నారు నిర్మాతలు.


యం. పూర్ణచంద్రరావు కథకుడు, సంగీత దర్శకుడు అయిన ఈ చిత్రానికి గోపీ మాట పాటలను, ప్రకాష్ కెమెరాను, కుదరవల్లి కళను, వేలాయుధం కూర్పును నిర్వహిస్తున్నారు.

ఇప్పటికి నాలుగు పాటలు రికార్డు చేయడం జరిగింది. జూన్ నెలలో షూటింగు ప్రారంభమయ్యే ఈ చిత్రంలో ప్రభాకరరెడ్డి, రేలంగి, పద్మనాభం, గిరిబాబు, రంగారావు, యం. శ్రీధర్, త్యాగరాజు, సాక్షిరంగారావు, జి. వరలక్ష్మి, వై. విజయ, మమత, సుచిత్ర ముఖ్యపాత్రధారులు.

ఏది పాపము, ఏది పుణ్యము

ఈ కథను ప్రముఖ రచయిత ఆదివిష్ణు రాసి, ప్రసాద్ ఆర్ట్ పిక్చర్స్‌కి యిచ్చారు. ఈ కథకు సత్యాత్మ ట్రీట్‌మెంటు వ్రాసి, డైరెక్ట్ చేస్తున్నారు.

పి. ఏ. పి. సుబ్బారావు తన కుమారుని పెండ్లి చేసిన మరుసటి నెలలో యీ చిత్రాన్ని ప్రారంభిస్తారు. ఇందులో కొత్తవాళ్లు అధిక సంఖ్యలో వుండగలరని తెలుస్తోంది. ఈ చిత్రానికి చలపతిరావు సంగీతాన్ని, సెల్వరాజ్ ఛాయను నిర్వహిస్తారు.



"అనగా అనగా ఒక తండ్రి"లో ఒక సన్నివేశం

రవీంద్రా నిర్వహణలో ధృవ చిత్ర

రవీంద్రా ఆర్ట్ పిక్చర్స్ అధినేత అయిన తమ్మారెడ్డి కృష్ణమూర్తి నిర్వహణలో ధృవ చిత్ర అనే నూతన చిత్ర నిర్మాణ సంస్థ ఒక వినూత్న కథాంశాన్ని చిత్రంగా నిర్మిస్తున్నది. లెనిన్‌బాబు సోదరుడు టి. భరద్వాజ, డాక్టర్ ఇ. యస్. రెడ్డి ఈ నిర్మాణ వ్యవస్థాపకులు. లెనిన్‌బాబు దర్శకత్వంలో తయారు కానున్న ఈ చిత్రం షూటింగు మే, పదినుంచి మైసూర్ ప్రీమియర్ స్టూడియోలో ఆరంభమవుతుంది.

మే రెండవ తేదీ వాహినీ స్టూడియోలో నారాయణరెడ్డి వ్రాసిన పాటను టి. చలపతిరావు సంగీత నిర్దేశకత్వంలో బాలసుబ్రమణ్యం, పాడడం జరిగింది. చిత్రంలో కృష్ణంరాజు, జయంతిలపై ఈ పాట చిత్రీకరించబడుతుంది.

పినిసెట్టి మాటలను, వి. యస్. ఆర్. కృష్ణ కెమెరాను, కృష్ణమూర్తి కళను నిర్వహిస్తున్న ఈ చిత్రంలో కృష్ణంరాజు, జయంతి, ప్రమీల, గుమ్మడి, అల్లురామలింగయ్య, రావుగోపాలరావు, కె. వి. చలం, పి. వెంకటేశ్వరరావు, రమాప్రభ, పుష్పకుమారి, అనూరాధ ప్రధాన పాత్రలను పోషిస్తున్నారు.

తరువాతి చిత్రం

ఈ చిత్రం పూర్తి అయిన వెంటనే ఆగస్టులో రవీంద్రా బ్యానర్‌లో శోభన్‌బాబుతో ఒక చిత్రాన్ని ప్రారంభించగలరని మే 4 వ తేదీ జరిపిన పత్రికా సమావేశంలో చెప్పారు నిర్మాత తమ్మారెడ్డి కృష్ణమూర్తి.

మహావిష్ణు ఎంటర్ ప్రైసెస్!

మరొక నూతన చిత్ర నిర్మాణ సంస్థ "మహావిష్ణు ఎంటర్ ప్రైసెస్". ఈ సంస్థకు ధన కోటేశ్వరరావు అధినేత. చిత్ర దర్శకుడు కూడా. ఈయనకి వి. మధుసూదనరావు, బి. యస్. నారాయణ లాంటి దర్శకులతో పన్నెండేళ్ళ సాహచర్యం వుంది.

ఇతను నిర్మిస్తున్న చిత్రం పేరు "బలిదానం" ఇదొక సామాజిక ప్రయోజనం గల ప్రయోగాత్మక చిత్రం. ఈ చిత్రంలో శ్రీధర్, "గీత" ప్రసాద్, డి. సాంబశివరావు, రావు గోపాలరావు, కృష్ణకుమారి, రోజారమణి ముఖ్య పాత్రధారులు. ఒక క్రొత్త హీరో ఈ చిత్రం ద్వారా పరిచయం చేయబడతాడట.

ఈ చిత్రానికి దాసం గోపాలకృష్ణ మాటల రచయితగా, శ్రీకాంత్ పాటల రచయితగా, యం. బి. శ్రీనివాస్ సంగీత సారథిగా, "స్వయంవరం" చిత్రం కెమెరామెన్ ప్రకాష్ ఛాయాగ్రహకుడిగా వ్యవహరిస్తున్నారు.

ఈ చిత్రం తాలూకు షూటింగును ఏప్రిల్ నెలనుంచి ముప్పై రోజులు నెల్లూరు సమీపాన గల కోవూరులో ఏకధాటిగా జరపదలచినట్లు నిర్మాత–దర్శకుడు కోటేశ్వరరావు చెప్పారు.

ఇల్లరికమా?

కాలేజీలో బహుమతులను ప్రేమానంద్‌లు పంచుకొనేవాళ్ళు. జీవితాన్ని కూడా పంచుకోవాలి అనుకున్నారు. ఇద్దరూ గాఢంగా ప్రేమించుకున్నారు.

ప్రేమ కలవారి అమ్మాయి. తల్లి లేని కొరత తెలియకుండా తండ్రి భూషణ్ ఆమెను గారాల పట్టిగా పెంచాడు. ఆనంద్ లేనివాడయినా, సద్గుణ సంపన్నుడు. ఆత్మాభిమానం ఆస్థిగా గొన్నవాడు.

తన కుమార్తె ప్రేమించిన ఆనంద్‌ను ఇల్లరికానికి అయితే అంగీకరించాడు భూషణ్. ప్రియ త్విస్తాను నాన్నా అని చెప్పి ఆనంద్ దగ్గరకు వచ్చింది.

నీ ప్రేయసిగా కాదు, ఆయన కూతురిగా నిన్ను కోరుతున్నాను అని ప్రాధేయ పడింది పద్మ. ఇల్లరికం వుండాలన్న మాట. నీ సర్వ ఆస్తికి సంరక్షకుడిగా మీ యింట్లో మెలగాలా పద్మా అన్నాడు ఆనంద్. అయితే మీ నాన్నతో చెప్పు ఇల్లరికానికి యిష్టపడలేదని, పెళ్ళయినా ఒక చిల్లి గవ్వ కూడా ముట్టనన్నానని చెప్పు అని పద్మను పంపించాడు.

"కట్" అన్నారు దర్శకుడు కె. వరప్రసాదరావు, ఈ సన్నివేశం దేవీ ఆర్ట్సువారి "ధనవంతులు–గుణవంతులు" చిత్రంలో కనిపిస్తుంది. కలవారి అమ్మాయిగా విజయనిర్మల, ఆత్మాభిమానిగా కృష్ణ, ధనవంతుడు భూషణ్‌గా గుమ్మడి నటించారు. వజ్ఝ పూర్ణచంద్రరావు నిర్మాతగా, వజ్ఝ వాగేశ్వరరావు నిర్వహణలో తయారవుతున్న యీ చిత్రంలో పెండ్యాల మంచి సంగీతాన్ని సమకూర్చారు.

కృష్ణ లిస్టు

"ఖయిదీ బాబాయ్" చిత్రానికి నిడిటరు టి. కృష్ణ దర్శకుడు. ఆ చిత్రం చూసిన ప్రతి వ్యక్తి దర్శకుడి మేధస్సును కొనియాడడం జరిగింది. ఇప్పుడాయనను యిద్దరు పెట్టుకొన్నారు. పల్లవి కంబైన్స్ ఏకామేశ్వరరావు ఒకరు. రవిరాజ్ ప్రొడక్షన్స్ కేశవ జయరామ్ మరొకరు. ఈ రెండూగాక మరికొన్ని వచ్చేట్టు వున్న వార్తలు నా చెవిన పడ్డాయి.

"అందరూ దొంగలే"లో ఒక దృశ్యం



హిందీ గాయని తెలుగు పాట

ప్రసిద్ధ హిందీ గాయని వాణీజయరాం ఇటీవల ఓ తెలుగు చిత్రానికి గానూ పెండ్యాల సంగీత దర్శకత్వంలో ఓ పాటను పాడింది. ఏవరి చిత్రానికో మీాకు తెలియాలిగా. కుటుంబరావు నెలకొలిపిన శ్రీ పద్మజా మూవీస్ వారి ''దీక్ష'' చిత్రానికిగానూ కొసరాజు వ్రాసిన ''రాక రాక వచ్చావు మావా! వేచి, వేచి వున్నది భామా'' అనే పాటను జెమిని స్టుడియోలో పాడింది జయరాం. ఈ పాటను ఏ. వి. యం స్టుడియోలో అధిక వ్యయంతో నిర్మించిన సెట్టులో ఎన్. టి. రామారావు, ప్రభాకర రెడ్డి, అపర్ణలపై చిత్రీకరించబడింది దర్శకుడు ప్రత్యగాత్మ ఆధ్వర్యంలో.


ఇప్పటికి పది రీళ్లు పూర్తయి, అయిదు పాటల చిత్రీకరణ జరిగిన ఈ చిత్రంలో జమున, రాజబాబు, అంజలీదేవి, కె. విజయ, సాక్షిరంగారావు, రమణారెడ్డి తదితర ముఖ్య పాత్రధారులు.

స్వాతంత్ర దినం విడుదల

ఆగష్టు 15 వ తేదీ అంటే మనకు స్వతంత్రం వచ్చిన శుభవేళ ఈ ''దీక్ష'' చిత్రాన్ని ప్రేక్షకుల తీర్పు అనే పరీక్షకు విడుదల చేయడం జరుగుతుందని నిర్మాతలు కె. కుటుంబరావు, వజ్జె సుబ్బారావులు చెప్పారు. ఆర్. కె. ధర్మరాజు వ్రాసిన ఈ కథకు ప్రత్యేక రూపాన్ని రూపొందిస్తున్నారు దర్శకులు ప్రత్యగాత్మ. కెమెరామెన్ ప్రకాష్, కళా దర్శకుడు కళాధర్.

దీపావళి పండుగ

ఇటీవల విజయా నందనోద్యానవనంకి వెళ్లాను. అది సాయం సమయం. తోటంతా మతాబులు, చిచ్చుబుడ్లు, విష్ణుచక్రాలు, కాకరవత్తులు నిండివున్నాయి. ఏ మూల చూచినా దివ్యకాంతులు వెదజల్లాయి. ఏమిటబ్బా? దీపావళి కాదుగదా అని ఆశ్చర్యపోయాను. అవును. దీపావళి పండుగే, అన్నాడు గోపీకృష్ణా మూవీస్ అధినేత చెలసాని గోపీ. ఆంధ్రుల అగ్రగటి వాణిశ్రీ ఆ దివ్యకాంతుల నడుమ ఆనందోత్సాహంతో వుబ్బి తబ్బిబ్బవుతూ వుంది. ఆమెకు రెండువైపులా యిద్దరు అబ్బాయిలు చేతిలో కాకరవత్తులతో కనిపించారు. ఒక వంక దీపావళి తేజస్సును చూస్తూ, మరొకవంక అబ్బాయిల ముఖాలను చూస్తూ, సంతోషం పట్ట



''కృష్ణవేణి''లో వాణిశ్రీ, పాపలు

లేక మధుర సంగీతాన్ని ఆలాపించింది, వాణిశ్రీ. ఏమనో, తెలుసా?

'శోభన జీవన దీపావళిలో
పెరిగెను పావన తేజం
తనివే తీర తనయుల చేర
తల్లికి తరగని భాగ్యం'' అంటూ ఆమె తనయులను ముద్దాడింది. ''కట్'' అన్నారు దర్శకుడు వీరమాచనేని మధుసూదనరావు. ఈ ఆనందమయ ఘట్టం ''కృష్ణవేణి'' చిత్రంలో నయనానందకరాన్ని కలిగిస్తుంది.

దీపావళి టపాకాయలకు మాత్రం అయిదువేలు ఖర్చుపెట్టిన నిర్మాత, చిత్రం రిచ్‌గా రావడానికి మరెంత ఖర్చుపెట్టుండాలి? ఈ చిత్రానికి కృష్ణంరాజు నాయకుడు. సమర్పణకూడా ఆయనే.

శారద అంగీకారం!

గత వారం మమతా కంబైన్స్‌వారి ''పల్లె పడుచు'' సెట్లో శారదను కలిశాను. నేను కలిసినప్పుడు అయిదారుగురు ఆమె కోసం వచ్చారు. వాళ్లందరూ నిర్మాతలే. అందరికీ ఆగస్టు నుంచి డేట్సు కావాలట. శారద లాంటి బిజీ ఆర్టిస్టును మే లో కలిసి, ఆగస్టు నుండి కాల్‌షీట్లు కావాలి అంటే సాధ్యపడే విషయమా? వచ్చిన వాళ్లకు నచ్చచెప్పి పంపించింది. అందరినీ పంపించావే, మీరు యిప్పు డెన్ని చిత్రాలను అంగీకరించారో చెప్పగలరా అని ప్రశ్నించాను.

''అన్నపూర్ణా సినీ ఎంటర్ ప్రైసెస్‌వారి ''ఊర్వశి'' చిత్రం. ఇందులో క్లిష్టమయిన, కష్టపడి నటించవలసిన పాత్రలు రెండున్నాయి. ఈ చిత్రానికి కె. బాపయ్య దర్శకుడు.

రామకృష్ణా ఫిలింస్‌వారి రెండవ చిత్రం. ఇందులో టైటిల్ రోల్ చేస్తున్నాను. ఈ చిత్రానికి కె. రామిరెడ్డి దర్శకుడు.

శ్రీ లక్ష్మి ప్రొడక్షన్స్‌వారి చిత్రం. ఇందులో పంతులమ్మ పాత్రను పోషిస్తున్నాను. శోభన్‌బాబు నాయకుడు. తాతినేని రామారావు దర్శకుడు.

రవిశంకర్ ఆర్ట్ పిక్చర్స్‌వారి ''బలిపీఠం'' చిత్రం. ఇందులో కొత్తతరహా వేషాన్ని వేస్తున్నాను. శోభన్ నాయకుడు. ఈ చిత్రానికి దాసరి నారాయణరావు దర్శకుడు.

ఊర్వశీ మూవీస్‌వారి కొత్త చిత్రం. దీనికి చక్రవర్తి దర్శకుడు.

నవత చిత్ర 'శేష్ మహల్' ఆధారంగా నిర్మిస్తున్న చిత్రం. దీనికి సంగీతం శ్రీనివాసరావు దర్శకుడు. ఇవిగాక పూర్ణా సుబ్రమణ్యం నిర్మించే కొత్త చిత్రం, విశ్వభారతి ప్రొడక్షన్స్, అనంతలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్, శ్రీ లక్ష్మి నరశింహా ప్రొడక్షన్స్ తలపెట్టే చిత్రాలలో నటించడానికి అంగీకరించాను.'' అన్నది శారద. ఇప్పుడు విడుదలకు సిద్ధంగా వున్న చిత్రాలు: రాధమ్మ పెళ్లి, లోకేశ్వరీ ఆర్ట్ పిక్చర్స్, హారతి, పల్లెపడుచు, సౌభాగ్యవతి.

సత్యనారాయణకు ప్రమోషన్

కృషి చేస్తూ ఒక్కొక్క మెట్టు పైకి వెడుతున్న నటుడు సత్యనారాయణకు కౌముదీ పిక్చర్స్ అధినేత ఎం. ఎస్. రెడ్డి కథానాయకుడి పాత్రను యిచ్చారు. చిత్రం పేరు ''రామయ తండ్రి.'' ఈ పాత్రను వింటే ఏ హీరో అయినా ఎగబడగలరని లోగడ వ్రాశాను. చివరకి హీరో ఛాన్సు సత్యనారాయణకు తగిలింది. నవరస మిళితమైన పాత్ర యిది.

ఈస్ట్‌మన్ కలర్‌లో నిర్మితమయ్యే ఈ చిత్రానికి మాట పాటలను మల్లెమాల వ్రాశారు. దర్శకత్వాన్ని బి. వి. ప్రసాద్‌కి, సంగీతాన్ని సత్యానికి, ఛాయను కె. ఎస్. ప్రసాద్‌కి యివ్వడం జరిగింది.

''నీడలేని ఆడది'' బి. వి. అంతస్తును పెంచింది. వచ్చిన పేరును ఎక్కువ చేసుకునే అవకాశం కౌముదీ సంస్థ యిచ్చింది. సార్థకం చేసుకోవాలి.

''రామయ తండ్రి''లో జయంతి, ప్రభ, రాజబాబు, రమాప్రభ, రంగనాథ్ ముఖ్యపాత్రధారులు.

- శ్రీనివాస్



''నిత్య సుమంగళి''కి కాకినాడ మెయిన్‌రోడ్‌లో అవుట్‌డోర్ షూటింగ్ జరుగుతున్న దృశ్యం

బంగారు కలలు

[23వ పేజీ తరువాయి]

'ఇది మరీ బాగుంది! నువ్వు వెళ్లేటప్పుడు డబ్బు యివ్వందే నేనెక్కడనుంచి తెచ్చి యివ్వను ?' తొణుకు బెణుకు లేకుండా అన్నాడాయన.

'నీకేమైనా మతి పోయిందా ? నేను వెళ్లే రోజున సంతకాలుచేసి నీకు చెక్స్ యిచ్చి వెళ్ల లేదూ ?'

చిదంబరం దిగ్భ్రాంతిగా చూసాడు.

'నీకు మతిపోయినట్టుంది! ఆ డబ్బు కాష్ చేసి తెచ్చి నీకే యిచ్చానుగా!'

నిర్భయంగా ఎలాటి తడబాటు లేకుండా ఆయన అంటున్న మాటలు విని రవి కొయ్యబారాడు.

40

'వెళ్లండి! తక్షణం నా యింట్లోంచి బైటకి వెళ్లండి! మనుష్యుల్లో యింత విశ్వాస ఘాతకులు వుంటారని విన్నానేకానీ యిప్పుడు కళ్లారా చూస్తున్నాను! మామయ్యా! నిన్ను అసలు నా ఫాక్టరీలో పెట్టుకోవటం, యింట్లో చేర్చుకోవటం నాదీ తప్పు! వేణుని అమాయకుడిని చేసి ఫాక్టరీ డబ్బంతా కాజేసి యింత దారుణానికి తలపెడ్తావని అనుకోలేదు. నిన్ను గుడ్డిగా నమ్మటం నాది తప్పు. పాముని దగ్గరకు తీసి పాలు పోశానని యిప్పుడు తెలుస్తోంది' రవి ఆవేశంతో ఒళ్లు తెలియనివాడిలా అరుస్తున్నాడు.

ఫాక్టరీలో చిదంబరం డబ్బు సంగతి నాకేం తెలియదనగానే, అక్కడ వర్కర్స్ ముందు పేచీ పడటం యిష్టంలేక, రవి వేణుని, చిదంబరాన్ని యింటికి తీసుకువచ్చాడు.

ఆయన్ని ఎంతసేపు డబ్బు మాట అడిగినా, ఒకటే సమాధానం.

'నాకేం తెలుసు! నువ్వే తీసుకున్నావు' అని.

రవికి పిచ్చెక్కేటంత కోపం వచ్చింది ఆ మాట వినగానే. వాళ్ల గూడుపుఠాణి అర్థమైంది. ఇద్దర్నీ తక్షణం యింట్లోంచి వెళ్లిపొమ్మన్నాడు.

'ఇది మరీ బాగుందిరా! బాంక్‌లో ఒక్క రూపాయి లేకుండా ఖాళీ చేసి తీసుకున్నావు! ఎవరికిచ్చుకున్నావో ఏమిటో! యిప్పుడు మామీద విరుచుకు పడుతున్నావు.' అన్నాడు చిదంబరం.

'ఎవరికో యిచ్చుకున్నానా! ఎవరికి యిచ్చానంటావు ?' రవి నిలదీసాడు.

'ఏమో! నాకేం తెలుస్తుంది. పెళ్లి కాలేదన్న మాటేగానీ నీకేం ఖర్చులు తక్కువా! వుండవలసిన వాళ్లందరూ వున్నారయ్యే.'

'ఏమిటా వాగుడు ? మీరు గాకుండా ఎవరున్నారు నాకు ?'

'నోటితో అంటే ప్రతీదీ తప్పేరా అబ్బాయి? ఎవరూ లేకపోతేనే ప్రతి నెలా కాన్వెంట్‌కి డబ్బు పంపిస్తున్నావా? నీ దగ్గర ఏమీ తీసుకుండానే ఆ రోజీ అనే డాన్సర్ కృతజ్ఞతలు చెప్పుకుంటు అంతంత వుత్తరాలు వ్రాస్తుందా ?'

రవి క్షణంసేపు దిమ్మెరపోయినట్టు చూసాడు.

'ఎప్పుడు నా డ్రాయరు వెతికావు నువ్వు!'

'బాగుంది వే నెందుకు వెతికాను! ఏదో పొరపాటుగా తీస్తే ఈ భారతం అంతా కనిపించింది. ఏం? నా మాట అబద్ధం అంటావా ? ఉమ అనే పిల్ల, నీ రక్షణలో పెరగటం లేదంటావా ? ఆ రోజీని డాన్సులు మానిపించి నువ్వు పోషించటం లేదా ?'

'మామయ్యా! యిక నువ్వు చెప్పింది చాలు! వెళ్లు. బైటకి నడు. ఊ!'

'ఏం ? మామయ్య అడిగినదానికి సమాధానం చెప్పవేం ?' వేణు అధికారంగా ప్రశ్నించాడు.

'ఏం చెబుతాడురా! పాపం! యిన్నాళ్లూ మనకి తెలియదని అనుకుంటున్నాడు! ఇదుగో అబ్బాయి రవీ! అన్ని వ్యసనాలలోకీ స్త్రీ వ్యసనం మహా చెడ్డది! అది వంటిని, యింటినీ గుల్ల చేస్తుంది! గౌరవ మర్యాదలని మంటగలుపుతుంది! పైకి రావాల్సినవాడివి నీకు యిదేం ఖర్మ చెప్పు! హాయిగా, లక్షణంగా అయినింటి ఆడపిల్లని చేసుకుని, పరువుగా బ్రతకక, ఆ రోజీని వుంచుకుని, యీ దొంగబ్రతుకు బ్రతుకుతూ—'

'నోర్ముయ్!' పిడుగు పడ్డట్టుగా అరిచాడు రవి.

చిదంబరం చెంప ఛెళ్లుమంది. రవి రౌద్రమూర్తిలా అయాడు.

'తెలిసీ తెలియని వాగుడు మళ్లీ వాగకు! ఈరోజు నాచేతుల్లో నీకు చావుదెబ్బలు తప్పాయంటే, అది మా నాన్నకి నువ్వు బంధువు అయిన పుణ్యం అనుకుని దణ్ణం పెట్టుకుని వెళ్ళు!'

చిదంబరం చెంప పట్టుకుని, కళ్లు పత్తికాయల్లా చేసి చూస్తూ నిలబడ్డాడు.

వేణు దూకుడుగా అన్నగారిమీద, మీదకి వచ్చాడు.

'అన్నయ్యా! నీకు బుద్ధుందా! పెద్దాయన మీద చెయి చేసుకుంటావా ?'

'నోర్ముయ్! నా సొమ్ము తిని, నా యింట్లో వుంటూ, నాకే ఎసరు పెడదామనుకున్నారా ? నన్ను కీలుబొమ్మని చేసి ఆడిద్దామనుకున్నారా! నడవండి! ఈరోజుతో మీకూ — నాకూ స్వస్తి. నా యింట్లోంచి తక్షణం బైటకి నడవండి.' రవి వేణు మెడపట్టి గుమ్మంవైపు తోసాడు.

వేణు తూలి పడబోయి తలుపు పట్టుకుని ఎలాగో ఆగాడు.

'పొమ్మంటే పోకుండా వుండటానికి అంత సిగ్గులేనివాళ్లమేమీ కాదు! నీ కాళ్లు పుచ్చుకుని బ్రతమలాడటానికి గతిలేనివాళ్లం అంతకంటే కాదు! నా వాటా నాకు పారేయ్! యిప్పుడే పోతాను!' వేణు రోషంగా అరిచాడు.

'నీ వాటానా! ఒళ్లు తెలిసే మాట్లాడుతున్నావా! యిది నా స్వార్జితం అన్న సంగతి మర్చిపోకు!'

'నువ్వే బాగా ఒంటిమీదకి తెలివి తెచ్చుకో! ఈ ఫాక్టరీకి పెట్టుబడి మన పొలం అమ్మి పెట్టిన జాయింట్ పెట్టుబడి అన్న సంగతి మర్చిపోకు!'

'పొలం అమ్మిన డబ్బు నువ్వు చేసిన అప్పులు తీర్చటానికే సరిపోలేదు. అది గుర్తు తెచ్చుకో!'

'అన్నింటికీ తెగించినవాడివి ఎన్ని అబద్ధాలయినా చెబుతావు!'

'పిచ్చిగా వాగావంటె పళ్లు రాలతాయి జాగ్రత్త!'

'ఏం చేస్తావేం ?' వేణు ముందుకి వచ్చాడు. కానీ చిదంబరం వేణుని వెనక్కు లాగాడు.

'ఇంతదూరం వచ్చిన తర్వాత — యిది మాటలతో తెగే వ్యవహారం కాదుకానీ — యింటికి పోదాం పద.' అన్నాడు.


'వెళ్లండి! జన్మలో మీ ముఖాలు నాకు చూపించకండి. మళ్లీ నా యింట్లో అడుగు పెట్టకండి.' రవి పళ్లు బిగువున అన్నాడు.


'పెట్టంరా! పెట్టం! ఆ ఫాక్టరీలో నువ్వో—వాడో ఎవరు వుంటారో తేలేవరకూ అడుగుపెట్టం! తెలివితేటలు నీకేకాదు! కాస్త మాకూ వున్నాయని నీకే తెలుస్తుంది ముందు ముందు — పదరా వేణూ!' అన్నాడు చిదంబరం కోపంగా.

వేణు — చిదంబరం వెళ్లిపోయారు.

'మై గాడ్!—' రవి కుర్చీలో కూలబడ్డాడు.


(ఇంకా వుంది)





రుచులు చిందేది.
కమ్మదనాలు విరిసేది.
ఉత్సాహాన్ని పెంచేది.
దాహాన్ని తీర్చేది.
ఉత్తేజాన్నిచ్చేది.
గోల్డ్ స్పాట్®
అందరూ కలిసినప్పుడు
ఆనందోత్సాహాలనిచ్చేది.

పూర్వాచారపరాయణులకైనా,
స్వేచ్ఛను వాంఛించేవారికైనా,
మితవాదులకైనా, తీవ్రవాదులకైనా,
మరే పార్టీవారికైనా సరే
చెక్కుచెదరని ఆనందోత్సాహాలనిచ్చేది
గోల్డ్ స్పాట్!



ఆరెంజ్ సువాసన మనసుకు విందు,
కమ్మని రుచి మరెంతో పసందు!

® రిజిస్టర్డ్ ట్రేడ్ మార్క్.
ఆరెంజ్ కమ్మదనాలు గల
'గోల్డ్ స్పాట్' ఆమోదింపబడిన
సువాసనలు, రక్షణ పదార్థాలు కలది.

AIYARS-PB.11

ధర్మపథం

ఉపనిషత్తులు

బులుసు వేంకటరమణయ్య

ఉపనిషత్తులు వేదం చివర భాగంలోనివి. ఇవి తెలిపే విజ్ఞానానికే వేదాంత విద్య అని పేరు ప్రసిద్ధం. వేదంలో పూర్వభాగం అంతా కర్మాచరణపరంగా ఉంటుంది. అది యజ్ఞయాగాదులను గురించి తెలియజేస్తుంది. ఆ పూర్వ భాగం కూడా రెండు భాగాలు. మొదటిభాగం మంత్రమయమయినది. తర్వాతిభాగం బ్రాహ్మణం. ఇది యజ్ఞయాగాదులలో మంత్రాల వినియోగాన్ని గురించి వివరిస్తుంది.

'ఉపనిషత్' అనేదానికి అర్థం ఇది–

'ఉప' అంటే సమీపానికి 'నిషత్' అంటే తీసికొనిపోవుటను తెలియజేసేది అని. ప్రత్యగాత్మను పరమాత్మను పొందించే మార్గాన్ని తెలియజేసేదని భావం.

లేదా – సమీపాన్ని పొందించి అంత మొందించేదని కూడా అర్థం చెప్పవచ్చును. ప్రత్యగాత్మను పరమాత్మదగ్గరకు తీసుకుని పోయి, దానిలో ఐక్యపరచి, వేరే స్వరూపం లేకుండా చేసేదనిన్నీ భావం.

ఉపనిషత్తులు వేర్వేరుగా ఉన్నా, అవి విభిన్నరీతులలో చెప్పే విషయంమాత్రం ఒక్కటే, అయితే – ప్రత్యగాత్మ అంటే ఏది? పరమాత్మ అంటే ఏది? అనే జిజ్ఞాస కలుగుతుంది.



ఆత్మ అనేది ఒక్కటే!

ఉపాధి భేదాన్నిబట్టి వేర్వేరు ప్రాణులలో ఉండేది ప్రత్యగాత్మ అవుతుంది.

అలా కాకుండా విశ్వవ్యాప్తమై, ఉపాధి సంబంధం లేకుండా ఉండేదే పరమాత్మ.

ఒక రాగాన్ని వీణమీద వాయిస్తే ఒక నాదం వస్తుంది. మురళిమీద వాయిస్తే వేరే ధ్వని వినబడుతుంది. వాయులీనంమీద అయితే మరొకరీతి నాదం వస్తుంది. రాగం ఒక్కటే అయినా, ఆ యా ఉపకరణాలను బట్టి నాదభేదం సంభవిస్తున్నది. కాని రాగం ఒక్కటే! ఇట్లే ఆత్మకు శరీర సంబంధం చెప్పినప్పుడు అది ప్రత్యగాత్మ. అలా కానిది పరమాత్మ. దీనినే పరబ్రహ్మ మనిన్నీ అంటారు.

ఆత్మ ఉపాధిని విడిచిపెట్టితే పరమాత్మలో ఐక్యం చెందుతుంది.

ఉపనిషత్తులన్నీ ఈ మార్గాన్నే బోధిస్తాయి. ●

డాక్టర్ సలహాలు

— డా. కె. వెంకటేశ్వరరావు.

ఆర్. పి. ఆర్. కావలి.

కొంత మంది స్త్రీలు 18, 20 సంవత్సరములు వచ్చినా పుష్పవతికారు ఎందువలన ? అలాంటి వారికి మందుల ద్వారాగాని, వేరే పద్ధతుల ద్వారా గాని చికిత్స చేయటానికి అవకాశం ఉందా ?

★ జననేంద్రియాలకు సంబంధించిన గ్రంధులు, పిట్యుటరీ గ్రంధి మొదలగు వాటి పనితనం సరిగా లేక పోవడంవల్ల ఇలాజరిగే అవకాశం ఉన్నది.

ఇవిగాక, పుట్టినప్పుడే ఏర్పడగల, జననేంద్రియాలలోని మార్పులు, గర్భాశయం సరిగా పెరగక పోవటం కూడా ముఖ్య కారణాలు. వీటికి నిపుణులైన లేడీడాక్టర్ల సలహా అవసరం.

కె. ఆర్. యస్. ఆర్. ప్రొద్దుటూరు.

నా భార్య వయసు 20 సం.లు వివాహం జరిగి 4 సం.లు అయినా పిల్లలు పుట్టలేదు. బుతుస్రావం ఎక్కువగా జరుగుచున్నది.

★బుతుక్రమం ఆలస్యమవటం, బుతుస్రావం ఎక్కువగా జరగటం, మొదలయినవి గర్భకోశములోను, దానికి సంబంధించిన గ్రంధులలోను జరిగిన మార్పులను తెలియజేస్తుంది.

బుతుస్రావం ఎక్కువగా జరగటాన్ని 'మెనోరేజియా' అంటారు.

ఇలా మెనోరేజియా ఉన్నప్పుడు పిల్లలు పుట్టక పోవడంలో ఆశ్చర్యంలేదు. నిపుణులైన లేడీడాక్టర్లు పరీక్షచేసి కొన్ని చిన్న శస్త్రచికిత్సల ద్వారా, ఇతర హార్మోను మాత్రల ద్వారా నయం చెయ్యగలరు.

యమ్. ఎస్. కొత్తగూడెం.

నా స్నేహితురాలికి 2 సం.ల క్రితం 'మాస్టాయిడెక్టమీ—టింపనో ప్లాస్టీ' ఆపరేషన్ జరిగింది. మధ్యమధ్యలో చెవులు మూసుకొని పోయినట్లుయి సరిగా వినపడటంలేదు. క్రమేణా వినికిడిశక్తి పోతున్నదన్నారు.

★చెవుల వెనుకభాగంలో ఉన్న మాస్టాయిడ్ అనే ఎముకలో ఆపరేషన్ జరిగి, చెవులలోని శబ్దకంపన పొర (టింపానిక్ మెంబ్రేన్)కి కూడా ఆపరేషన్ జరిగినప్పుడు వినికిడిశక్తి కొంత కాలం తర్వాత గాని మామూలు పరిస్థితికిరాదు. 'హియరింగ్ఎయిడ్' వాడటంవల్ల ప్రయోజనం ఉంటుంది.

జి. ఎమ్. హైదరాబాదు.

నా వయస్సు 28 సం.లు మెడనరాలు లాగుతూ ఉంటాయి. వెన్నెముకలోను, ప్రక్కలా నెప్పిగా ఉంటుంది. ఎక్స్‌రే తీసి ఏవో మందులు వ్రాసి ఇచ్చినా తగ్గలేదు.

★'మస్కు్యలర్ రుమాటిజమ్' అనే ఈ రోగ లక్షణాలు తరచూ చిన్న వయస్సులోనే రావడం జరుగుతుంది.ఇలా వచ్చినవారికి ఎక్స్—రే లోపం కనబడదు.

తరచు జలుబు, అలసట, ఒకేపొజిషన్‌లో చాలాసేపు కూర్చొనటం, నిలిచివుండటం, శరీరంలో ఇతర భాగాలలో సూక్ష్మ క్రిములు చేరి ఉండటం, ఎక్కువగా స్థూల శరీరంగల వారికి, కొన్ని 'గ్రంధుల' పనితనం సరిగా లేకపోయినప్పుడు, మానసిక ఆందోళన ఇలా'మస్కు్యలర్ రుమాటిజం' రావటానికి ముఖ్యకారణాలు.

వేడినీళ్ల కాపు, ఫినైల్‌బ్యూటజోన్, ఆస్పిరిన్, మితమైన వ్యాయామం, వీలయినంత విశ్రాంతి దీనిని పోగొట్టడానికి కొన్ని మార్గాలు.

వి. ఆర్. బొంబాయి – 57

నేను రెండు నెలలుగా శరీరము దురదతో బాధపడుచున్నాను. నేను మన్నిపిండి, సబ్బుతో స్నానం చేసి, ఉతికిన బట్టలు వేసుకుంటాను. ఎందువలన యిది వచ్చిందో తెలపండి.

శరీరంలో దురద ఎక్కువ రోజులుగా ఉండటం, నెత్తురులో కొన్ని మార్పులను తెలియజేస్తుంది. కాల్షియమ్ లోపం, కొన్ని సూక్ష్మక్రిములు రక్తములో చేరటం, కొన్ని గ్రంథుల హార్మోనులు, ఎంజైములు ఎక్కువ–తక్కువవటం, లివరు సరిగా పనిచేయక పోవటం, మలంలో క్రిములు ఇలా రావటానికి ముఖ్య కారణాలు.

రక్తంలో వి. డి. ఆర్. ఎల్., కొలెస్ట్రాల్ మొదలగు పరీక్షలు, మూత్రము, మలము తరచు పరీక్ష చేయించుకోవటం వల్ల రోగ నిర్ధారణ అవుతుంది. రోగాన్ని బట్టి వైద్యం చేయాలి.

అంతవరకూ రోజుకి 2 'హైపిలెక్స్'మాత్రలు, రోజుకి ఒకటి 'అవిల్' మాత్రలు వాడితే ఉపశమనం కలుగుతుంది. ●


L. లింగశెట్టి సమర్పించు
నవశక్తి ప్రొడక్షన్స్
ఆడది
ఈస్ట్మన్ కలర్
నిర్మాత
P.గంగాధరరావు
దర్శకత్వం
B.V.ప్రసాద్

(గత సంచిక తరువాయి)

ఆ రాత్రి ఇల్లంతా నిశ్శబ్దంగా వున్నవేళ. వీరంతా ఎక్కడి వాళ్లక్కడ ఒరిగి పోయారు నిద్రలో. నా గుండెల్లో దిగులు. బరువు. మనసులో అశాంతి. భరించలేని ఆవేదన. ఏదో అణచలేని బాధ. చెప్పలేని ఆరాటం. ఎక్కడా కాలు నిలవలేదు. నిద్ర రావడంలేదు. బ్రతుకు ఎంతో భయంకరంగా అనిపించింది. వుండి ఏం సాధించాలని పించింది.

లతను చూసేదాకా నాకు ఆకర్షణ అన్న పదానికి అర్థం తెలీలేదు. జీవితంలో లత మీద తప్ప అంత వెర్రి వ్యామోహం ఇంకెవరి మీద కలగలేదు. లతని ప్రేమించాను వెర్రిగా, పిచ్చిగా. ఆమెలో ఆశలు కలిగించాను. ద్రోహం చేశాను. అసలు విషయం చెప్పలేదు. అది



పొరపాటే. చిన్న పొరబాటు వల్ల లత నన్ను అపార్థం చేసుకుంది. కావాలనే తనను నేను వంచించా ననుకుంది. సరే అదంతా పాత కథ. లత నన్ను కాదన్నాక బ్రతుకు దుర్భరంగా తోచింది. కానీ... బాధ్యతలు నన్ను కట్టేశాయి. కర్తవ్యం విస్మరించకూడదు. ధర్మం నిర్వర్తించాలి అనుకున్నాను. అనుకున్నాకే సావిత్రితో రాజీ పడ్డాను. సావిత్రిని నేను వెర్రిగా ఆరాధించ లేదు. కానీ నా జీవితాన్ని పంచుకునే వ్యక్తిగా గౌరవించాను. అపేక్ష కనబరిచాను. అభిమానించాను. ఆమెతో కష్టసుఖాల్ని పంచుకున్నాను. ఎప్పుడూ ఆమెని నిరాదరణ చెయ్యలేదు. ఒకరకంగా సర్దుకున్నాను. సర్దుకుని స్థిరపడుతుండగా భగవంతుడు ఆమెని తీసికెళ్లి పోయాడు.

అంతా చీకటిగా అనిపించింది. సావిత్రి లేని బ్రతుకెందుకో నాకు దుర్భరం అనిపించింది. నిజం చెబుతున్నాను. ఆ సమయంలో నాకు లత గుర్తురాలేదు. మీరు జ్ఞాపకం లేరు. ఎవరూ నా కంటికి కనిపించలేదు. కేవలం సావిత్రి, సావిత్రి. ఎటు చూసినా సావిత్రి. ఆమే కావాలనిపించింది. లేదనే భావం నాలో కలిగాక బ్రతుకే చీదరనిపించింది. పారిపోదామనిపించింది. తెగించి ఆత్మహత్య చేసుకోవాలనిపించలేదు. కారణ మేమిటో ఇప్పటికీ నా కర్థంకాదు.

అందుకే మీరంతా పడుకున్నాక మెల్లగా లేచి వచ్చేశాను. గంట ఎంతయిందో తెలీదు. ఏదో రైలుంది స్టేషన్లో. ఎక్కేశాను. ఒక రకమయిన అచేతనా వస్థలో వున్నట్లే. ఎవరో మాట్లాడుతున్నారు. ఎప్పుడో ఒకలాంటి మెలకువ కలిగింది. కానీ ఏం మాట్లాడలేదు నేను. ఎవరో ఏదో ప్రశ్నలు వేస్తున్నారు. సమాధానాలు చెప్పానో లేదోకూడా తెలీదు నాకు. ఎవరో పుణ్యాత్ముడు నన్ను నడిపించుకుని టాక్సీలో వేసి పిచ్చాసుపత్రిలో చేర్చాడు. అప్పటికి నాకు బాగా తెలివి వచ్చింది. 'దాహం' అంటె ఎవరో మంచినీళ్లిచ్చారు. ఆ వెలుతురులో గుర్తుపట్టాను అది పిచ్చాసుపత్రని.

"నాకేం పిచ్చిలేదు" అన్నాను మంచి నీళ్ళు తాగి గ్లాసు బల్లమీద పెడుతూ.

"నాకేం పిచ్చిలేదు" అన్నాను లేస్తూ. అప్పటికి నాకు బాగా తెలిసొచ్చింది నేనెలా ప్రవర్తిస్తున్నానో. ఎవరో నవ్వారు. నర్సు కాబోలు. డాక్టర్ కన్నెర్ర చేసేసరికి అక్కడి నుండి వెళ్లిపోయింది.

"మీకు పిచ్చని ఎవరన్నారు? ప్లీజ్. కూర్చోండి" అన్నాడు డాక్టరు.

"మరిక్కడికెందుకు తీసుకొచ్చారు?" నా కళ్లు మగతగా వున్నాయి. నిద్రవస్తోంది.

"ఊరికెనే. విశ్రాంతి కోసం. ఈ రాత్రికి ఇక్కడ పడుకోండి" ఆయన వేడిపాలు తెప్పించాడు. ఆకలిమీద ఉన్నాను. తాగేశాను. నిద్ర వచ్చేసింది.

మర్నాడుదయం లేచేసరికి ఆగదిలో ఎవరూ ఉన్నట్లు నాకనిపించలేదు. ఒకసారి మళ్లీ చూశాను. ఒక మూలగా ఒకతను శీర్షాసనం వేస్తున్నాడు. కాసేపు చూశాను. అతనలాగే వుండిపోయాడు. బద్ధకంగా మళ్లీ అక్కడే అలా పడుకున్నాను. ఎవరివో మాటలు విని పించాయి.

"కొత్త పేషంటు. రాత్రి ఆ టికట్ కలెక్టరెవడో చేర్చాడు తెచ్చి. టిక్కట్టడిగితే ఉలక లేదట, పలక లేదట. 'ఇదిగో మీకింకో కేస్' అంటూ నవ్వుతూ తెచ్చిపడేశాడితన్ని." అనుకుంటూ పోతున్నారు.

లేచి కూర్చున్నాను. నన్ను గురించే ఆ మాటలు అని తెలుసుకోడానికి నాకాట్టే సేపు పట్టలేదు. ఆ శీర్షాసనం వేసినతను కదల్లేదు. వాష్‌బేసిన్ దగ్గరకెళ్లి ఏదో మొహం కడిగానని అనిపించుకున్నాను. ఆకలి. ఉన్నబాధలు పోయి కొత్త బాధలు. ఇక్కడ నుండి బయట పడేదెల్లాగ.

"ఏమిటీ? కొత్తా గురూ? ఓహోహో కొత్తగా వచ్చారా? అయితే చచ్చారన్న మాటే. చంపేస్తారండీ వీళ్లు. మెల్లిగా మెల్లిగా ఇంజక్షన్ రూపంలో విషం ఎక్కించేస్తారండీ. ఇంక మీ గతి ఇంతే... నేనే ఆ గండం నుంచి రోజూ తప్పించు కుంటున్నాను. మీరు పారి పొండి. ఇదుగో ఈ మూలం కూర్చుంటే ఎవ్వరూ చూడరు. అదిగో మహమ్మారి. విషం తెస్తోంది ఎక్కించడానికి". అంటూ పారిపోయాడు. అతని కోసం అక్కడికొచ్చిన నర్సుని చూసి.

"గుడ్ మార్నింగ్" అన్నాను.

తెల్లబోయి. "గుడ్‌మార్నింగ్" అంది.

"మీ డాక్టరుగారు ఎప్పుడు వస్తారు?" అడిగాను.

వాచీ చూసుకుని "ఇంకో పావుగంటున్నాకీ రారు" అంది.

"ఒక కప్పుకాఫీ, న్యూస్‌పేపరు ఇప్పించ గలరా? ప్లీజ్"

నవ్వుకుంటూ వెళ్లిపోయింది.

కొంతసేపటికి తిరిగొచ్చి "డాక్టరుగారు పిలుస్తున్నారు రండి" అంది.

ఆ గదిలోకి వెళ్లేసరికి రాత్రిచూచి నతను కూర్చున్నాడు.

"రండి. రండి. ఇదిగో కాఫీ."

కాఫీ తాగాను. ప్రాణం లేచివచ్చినట్లు యింది.

అతను డాక్టర్. మనసులోని విషయాలు ఏం తెలుసుకుని చికిత్స చేస్తాడోగానీ మనిషి మాత్రం నిండుగా, అందంగా, హుందాగా వున్నాడు. పలుకు తేనెలొలుకుతూ వుంది. చాలు. ఆ మాత్రం మనిషి తీరుగా వుంటే చాలు. ఎవరినైనా జయిస్తాడు. నన్ను పూర్తిగా పరీక్షించాడు. నేను అంతా చెప్పాను. ఓపిగ్గా విన్నాడు.

"రండి. మా ఇంటికి వెడదాం. దగ్గరే. రండి" అన్నాడు లేచి. అతని పేరు దివాకర్. ఇల్లు నందన వనంలా వుంది. నన్ను భార్యకి పరిచయంచేశాడు 'మికిరణ్‌బాభీ' అంటూ.

బెంగాలీలు. వారిద్దరి ఆతిథ్యం నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

ఆ చుట్టు ప్రక్కల వారితో పరిచయమైంది. ఊరికే కూర్చోబుద్ధి పుట్టలేదు నాకు. ఆ మాటే దివాకర్ తో అన్నాను. ఉద్యోగాలు దొరుకుతాయా అంత తొందరగా? అక్కడే ఇంజినీరింగ్ చదువుతున్న కుర్రాళ్లకి ట్యూషన్‌లు చెప్పమన్నాడు. అప్పుడు కృష్ణ గుర్తుకొచ్చాడు. అవును. తప్పేమిటీ అనుకున్నాను. ఒప్పుకున్నాను. మొదట్లో ఒకరిద్దరుండేవారు. వారం తిరిగే సరికి పదిమంది చేరారు. ఊరికే వాళ్లింట్లో పడి తినడం లేదన్న భావం కలిగింది. నా ఆదాయం బాగుంది. ఇంకో నెల గడిచాక నన్ను ఒక కంట్రాక్టర్ దగ్గర ఏజంట్‌గా కుదిర్చాడు దివాకర్. మొత్తానికి ఒక రకంగా పనిలో మునిగిపోయాను. నాగత జీవిత మంతా మరిచిపోవాలని ప్రయత్నించేవాణ్ణి. అందుకే ట్యూషన్‌లు, ఏజంట్ పనే కాకుండా కన్సల్టింగ్ ఇంజనీర్ అన్న బోర్డు తగిలించా.

దాంతో రాబడి ఎక్కువైయింది. దివాకర్ నన్ను ఆ ఏజెంట్ పని మానెయ్య మన్నాడు. అలాగే మానేశాను. సంవత్సరం గడిచాక నాన్నని, అమ్మని చూసొచ్చాను."

"అయితే మమ్మల్ని చూడాలని ఆ తర్వాతేనా అనిపించలేదన్నమాట నీకు?"

రాధాకృష్ణ కొంత కోపంగా అడిగాడు. అతనికి మనసు కష్టంగా వుంది. ఇక్కడ తామంతా మోహన్ కోసం బెంగ పడితే అతను అడ్రస్ కూడా ఇవ్వనందుకు. ఆ తర్వాతేనా తమని గుర్తు పెట్టుకోనందుకు.

"కాదు కృష్ణా, మిమ్మల్ని మర్చిపోయాననుకోకండి. నాకెందుకో ఇక్కడి విషయాలు తలుచుకుంటే ఎంతో భారంగా అనిపించేవి. సావిత్రే జ్ఞాపకం వచ్చేది. భరించలేని ఆవేదన. మళ్లీ ఏదో పనికల్పించుకునేవాణ్ణి. రాత్రి పగలు కష్టపడటంచూసి దివాకర్, కిరణ్‌బాభీ మందలించేవారు. వారిద్దరూ నన్ను కంటికి రెప్పలా కాపాడారు. వారిద్దరి ఋణం ఎలా తీర్చుకోను. అర్థమయ్యేదికాదు. అలాసంవత్సరాలు గడిచాయి.

నాలుగు నెలల్రకితం కిరణ్‌బాభీ అక్క కూతురు వినోద వచ్చింది. ఆ అమ్మాయి వచ్చినప్పటినుండి నన్ను ఆకర్షించడానికి ప్రయత్నించేది. మరో నెల గడిచాక నాకు అనిపించింది, దివాకర్, కిరణ్ కలిసే ఈ వ్యవహారం నడిపిస్తున్నారని. ఎందుకోనాకు చాలా చిరాకనిపించింది. రోజూనన్ను పోరేవారు పెళ్లి చేసుకోమని. నేను వద్దనేవాణ్ణి. నా మనసు వినోద మీదకు వెళ్లలేదు. వినోద డాక్టర్. ఎక్కడో ఉద్యోగంలో వుందట. స్వంత ప్రేక్టీస్ పెట్టుకోవాలని ఉందట, ఒకచోట కుదురుగా వుండే భర్త అయితే. అంటే ఐదిలీలు అవీ లేకుండా అన్నమాట, పెళ్లిచేసుకుని ఒకచోట స్థిరపడుతుందట. నేను ఖచ్చితంగా చెప్పాను అలాంటి ఆశలు పెట్టుకోవద్దని. అప్పుడే మళ్లీ లత గుర్తుకొచ్చింది. మిమ్మల్నందర్నీ ఒకసారి చూడాలనిపించింది. ఇన్నేళ్ల తర్వాత ఆ కోరిక నాలో ఎంతో, ఎంతో పెరిగిపోయింది. భరించలేక పారిపోయొచ్చాను" అన్నాడు.



"అక్కణ్ణించే, చెప్పకుండానే?"

అంది లత నవ్వుతూ.

"కాదు లే. చెప్పే వచ్చాను"

"బావుందిరా నీ కథ. వుండిపో మాతోనే ఇంక. వైజాగ్ వచ్చేయ్ రేపు మాతో. వ్యాపారంలో వాటా ఇస్తా" అన్నాడు ఆనంద్.

"అదే ఆలోచిస్తున్నాను. నాదగ్గరాలోలేదు డబ్బుంది. ఏదైనా శరణాలయం లాంటిది ప్రారంభించాలనివుంది" అన్నాడు అతనే చూస్తూ మోహన్.

రాధాకృష్ణ హఠాత్తుగా లేచి "ఒరేయ్. మాక్కాస్త పనుంది బజార్లో నువ్వు విశ్రాంతి తీసుకో ఈ లోపున. పద ఆనంద్...రా...రా" అంటూ ఆనంద్‌ని లాక్కుపోయాడు.

"అదేమిటీ కృష్ణ అలా వెళ్లిపోతున్నాడు" అంది లత ఆశ్చర్యంగా.

"వాడుతెలివైనవాడే...మనకు మాట్లాడుకోడానికి అవకాశం ఇచ్చాడు" అన్నాడు మోహన్ నవ్వుతూ.

42

"ఆనంద్, వైజాగ్ వెళ్లిపోదాం. పద.

జరిగిన కథ : 14 రిట్రెంచ్‌మెంట్ వల్ల నిరుద్యోగి అయిన జూనియర్ ఇంజనీరు రాధాకృష్ణ డాక్టర్ శివరాం దగ్గర డ్రైవరుగా చేర్తాడు. డాక్టర్‌కి పక్షవాతంవచ్చి ఆయన కుటుంబం కాకినాడ వెళ్ళిపోతుంది. మోహన్ ఆత్మహత్యా ప్రయత్నాన్ని వివరిస్తూ ఆనంద్ రాసిన జాబు అందుకున్న రాధాకృష్ణ వాల్తేరు వెళ్తాడు. మిత్రులు ముగ్గురూ కలసి వ్యాపారం ప్రారంభిస్తారు. మోహన్ వివాహితుడని తెలియని లత అతనికి దగ్గరవుతుంది. రాధాకృష్ణ ద్వారా విషయం తెలుసుకొని మోహన్ జీవితంలో నుంచి తప్పుకోవడానికి నిశ్చయించు కుంటుంది. రాధాకృష్ణకి తిరిగి ఉద్యోగం వస్తుంది. కుసుమకి వచ్చిన సంబంధం రాధాకృష్ణ ఒకప్పుడు డ్రైవర్‌గా పనిచేశాడన్న వంకతో తప్పిపోయే పరిస్థితి వస్తుంది. మరో అయిదువేలు ఎక్కువయివ్వడానికి సిద్ధపడి రాధాకృష్ణ ఆ సంబంధాన్ని ఖాయపర్చుకు రావడం కుసుమకి చాలా బాధని కల్గిస్తుంది. అనుకున్న ముహూర్తానికి కుసుమ పెళ్ళి డాక్టర్ శివరాంగారి అబ్బాయి రఘుతో జరుగుతుంది. రాజీ కొడుకుని తానే పెంచుకోడానికి నిశ్చయించుకుంటుంది లత. మోహన్ భార్య సావిత్రి ఆడపిల్లని కని కన్ను మూస్తుంది. భార్య మరణానికి తట్టుకోలేని మోహన్ ఎటో వెళ్ళిపోతాడు. అతని కుమార్తెని ఆనంద్ దంపతులు పెంచుకుంటూ ఉంటారు. రాధాకృష్ణ ఉద్యోగానికి రాజీనామా యిచ్చి తిరిగి వ్యాపారంలో ప్రవేశిస్తాడు. చాలా కాలం తర్వాత తిరిగివచ్చిన మోహన్‌ని చూచి ఆశ్చర్యానందాలలో మునిగిపోతుంది లత. ఆనంద్, రాధాకృష్ణలు కూడా అక్కడికి చేరుకుంటారు.

తయారవు తొందరగా'' అన్నాడు మోహన్ మర్నాడుదయమే.

పక్కమీద నుంచి లేస్తూనే అన్న ఆ మాటలు కృష్ణని కదిలించాయి.

''ఏమిటీ మోహన్ ? నాలుగు రోజులుంటానన్నావుగా ?'' అడిగాడు రాధాకృష్ణ.

''అవసరం లేదు. ఆ అవసరం లేదు''

మోహన్ కళ్ళల్లోకి సూటిగా చూశాడు రాధాకృష్ణ. కళ్ళు ఎర్రగా వున్నాయి. రాత్రంతా నిద్ర లేదా కళ్ళకు. సంగతి పసిగట్టేశాడు రాధాకృష్ణ.

మవునంగా పక్కమీద పడుకునే నీళ్ళ మాటలు వింటున్నాడు ఆనంద్.

''సరే''అన్నాడు రాధాకృష్ణ ఆలోచిస్తూ.

''సరే ... తయారవుదాం'' అంటూ లేచాడు ఆనంద్ కూడా. టూత్‌బ్రష్ చేతిలోకి తీసుకుని ఆనంద్‌ని పిలిచాడు రాధాకృష్ణ.

''ఏమిటి కృష్ణా ?''

''నువ్వు, మోహన ముందు వెళ్ళండి. నేను సాయంత్రానికి వస్తాను''అన్నాడుకృష్ణ.

''అదేం ?''

''కొంత పనుంది''

పిట్టగోడ దగ్గర నుంచుని వున్న మోహన్ నీళ్ళవైపు తిరిగి

''లాభంలేదు కృష్ణా, నీ ప్రయత్నం వృథా. మాతో వచ్చెయి.'' అన్నాడు నవ్వుతూ.

రాధాకృష్ణ తుళ్ళిపడ్డాడు. సంగతి గ్రహించేశాడన్న మాట. తెలివైనవాడే మోహన్. అయితే ఏం ? అతని జీవితం నిండా అపశృతులు. అతని జీవన ప్రవాహం మధ్య పెద్ద పెద్ద బండరాళ్ళు. సాఫీగా ఎంత తప్పించుకు పోదామన్నా నీటి ప్రవాహానికి అడ్డుతగిలే బ్రహ్మాండమయిన బండరాళ్ళు. కొండల్లాంటిరాళ్ళు. అడుగడుగునా అడ్డంకులే. అతను కావాలనుకున్నదేదీ అతనికి దక్కనివ్వటం లేదా దేవుడు.

''ఏమిటా పరధ్యానం? త్వరగా తయారవండి. వైజాగ్ పోదాం''మోహన్ అన్నాడు.

''నిజంగానే చెప్తున్నాను. మీరిద్దరూ వెళ్ళండి. నేను సాయంత్రానికి వస్తాను''

''నీ ఖర్మ. చెబితే వినకపోతే అంతే. ప్రిపేర్ ఫర్ ది డిసపాయింట్‌మెంట్''అంటూ స్నానాల గదిలోకి పోయాడు.

ఆనంద్‌కి అర్థమయీ అవకా వుంది.

* * *

మేడమీద బాల్కనీ. నేను కుర్చీలు వేసుకు కూర్చున్నారు లత, రాధాకృష్ణ.

ఆనంద్‌ని, మోహన్‌ని బస్ ఎక్కించి వచ్చారు ఇద్దరూ.

''నీతో ఓ ముఖ్యమయిన విషయం మాట్లాడాలి లతా''

''నాకు తెలుసు''

సూర్యకిరణాలు ఏటవాలుగా నేల మీద పరచుకున్నాయి. పూలకుండీల నీడలుస్తంబాల చాటునుండి కొద్దిగాపడుతున్నాయి ఆవైపుకే.

''మాట్లాడుకృష్ణా,ఏదోచెప్తానన్నావుగా''

''అదే...మోహన్‌కి ఏం చెప్పావు లతా ? అతన్ని నిరాశపరచావు కదూ ! ఎందుకలా చేశావు?''

నీ ప్రశ్నకు సమాధానం ఏం లేదు కృష్ణా, ఎందుకు అతన్ని నిరాశపరచానో నాకే తెలీదు. అది అతన్ని నిరాశ పరచడంకాదు. నాఉద్దేశంలో నా మనసుని సమాధాన పరచుకోవడం''

''అతన్ని వదులుకోకు లతా''దీనంగా అడిగాడు రాధాకృష్ణ. ఈ దెబ్బ మోహన్‌కి గట్టిగా తగిలిందని అతనికి తెలుసు.

రాధాకృష్ణ మాటలకి నవ్వింది లత.

''నీకు జ్ఞాపకముందా? ఒక రాఖీ పండగనాడు. మోహన్‌ని వదులుకోమన్నావు.ఈనాడు ఏమంటున్నావు?''

''అవును. అప్పటి పరిస్థితి వేరు. ఇప్పటి పరిస్థితి...''

''పరిస్థితుల కనుగుణంగా మారే ఊసరవెల్లిని కాలేను అన్నయ్యా! నాకూ కొన్ని అభిప్రాయాలున్నాయి. ఆశయాలున్నాయి. ఒకప్పుడు ప్రేమించాను, ఆరాధించాను కానీ...''

''అందుకే అడగడానికి వచ్చాను. నువ్వు ప్రేమించావు కాబట్టే నీ జీవితంలో అతనికి చోటివ్వమని అడుగుతున్నాను''


''క్షమించు. అతనికి నా హృదయంలో స్థానం ఎప్పటికీ వుంది. కానీ నా జీవితంలో భాగం పంచుకోవడానికి అతనికి అవకాశం లేదు. నా మనసు విరిగింది''


విరిగిన మనసుని, పగిలిన అద్దాన్ని ఎవరూ అతకలేరు. ఆ సంగతి కృష్ణకీ తెలుసు.

''నాకు తెలుసు లతా''

ఆమె పెదవుల పైన పేలవమైన చిరునవ్వు. లేచి పక్కనే వున్న పిట్టగోడ దగ్గర కెళ్ళి నుంచుంది. అతని చూపుల నెదుర్కోడం ఇష్టంలేక. అతన్ని చూస్తూ తను చెప్ప దలుచుకున్నది చెప్పలేదేమోనన్న భయంచేత.

''ఆనాడు మోహన్ సర్వస్వం అనుకున్నాను. అతను వివాహితుడని తెలిశీ నా మనసు అతని కర్పణ చేశాను. ఎంత వ్యామోహంలో పడ్డాను. ఎంత ఆరాధన. అతన్నిచూస్తే నా హృదయం పొంగేది. అతను నవ్వితే నా గుండె లయ తప్పేది. అతను పలికితే నాలో కోటి వీణలు మ్రోగేవి. 'అతనే కావాలి' అని నా మనసు ఆక్రోశించేది. ఎన్ని కోరికలు ? ఎన్ని ఆశలు ? కృష్ణా. అన్నిటిని అతను కాలరాసేశాడు. నా ఆశలు నాశనం చేశాడు. అతను ఒక్కమాట ...


ఇప్పుడు?
ప్రతిరోజు వాడినా
నలుగుదలను తట్టుకోగలవి.
బిన్ని కాటన్స్ వంటి మేలురకం
నూలు దుస్తులు మాత్రమే!
ఎంత నలుగుదలకైనా
తట్టుకోగల జీవం,
శక్తిగల నూలు దుస్తులు-
బిన్ని కాటన్స్
బిన్ని
నూలు దుస్తులు!



మమతల వంతెన

'నేను. వివాహితుణ్ణి' అన్న ఒక్క మాట చెప్పివుంటే నా బ్రతుకిలా చిందర వందరయ్యేదా? చెప్పు కృష్ణా ... చెప్పు." లత పన్నగా ఏడుస్తోంది.

ఆ ఏడుపుచూసి కృష్ణ చాలా బాధ పడ్డాడు. అప్పటి గాయం లతలో ఇంకా పచ్చిగా వుంది. అందుకే అన్నారు మానసిక గాయం ఎప్పటికీ మాయదని.

మళ్ళీ ప్రారంభించింది లత

"మోహన్ కూడా నన్నంతగానూ ప్రేమించాడు. అంతగానూ అరాధించాడు. కానీ వివాహితుడై నన్ను ప్రేమించడమే అతని నేరం. నీతి అన్నది మగవాడికీ ఒకటే, ఆడదానికీ ఒకటే కృష్ణా. నా ప్రేమ, అతని ప్రేమ కూడా లోలోపలే వుంచుకో వలసినదే కానీ పైకి చెప్పరానిది. వివాహితుణ్ణి భార్యఉండగా ప్రేమించడం, నా దృష్టిలో క్షమించరాని నేరం. తెలిస్తే అలా ఎప్పటికీ చెయ్యక పోదును. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పేకదా! తెలిసిన వెంటనే అతని మార్గం లోంచి తప్పుకున్నాను. మళ్ళీ ఈనాడు ఆ మార్గంలోకి వెళ్ళడానికి నా మనసంగీకరించడం లేదు. నిండు హృదయంతో ఆతన్ని నాలో ఆహ్వానించుకోలేను మనసులో ఇంత గాయం వుంచుకుని. నన్నుక్షమించు కృష్ణా!"

స్థంభాన్నానుకుని నిర్వికారంగా నిలబడి నిర్వచించిన నిజాలవి. తను కాదనలేడు. కానీ అతన్ని క్షమించ లేదా లత?

అడిగితే...

"అతన్ని క్షమించు. క్షమించలేవా లతా?"

అక్కడ నుంచి కదలివచ్చి కుర్చీలో కూర్చుంది లత. "క్షమాపణ ప్రస్తావనే లేదు. నా మనసులో వున్నది అతనికి చెప్పేశాను. నా నిర్ణయంమారదు. ఇంకనన్నేమీఅడగకుప్లీస్."

"ఈ నాడు నీ కోసం ఇంత దూరం వచ్చాడు. ఆలోచించు. నిన్ను వదులుకోలేక అవస్థపడి బాధపడి పోతున్నాడు. మొదటి నుంచీ అతని బ్రతుకులో చీకట్లే. అతను నీ కోసమే వచ్చాడు. అతని బాధను అర్థం చేసుకోలతా"

"పాషాణమయిన మనసుకి అర్థం చేసుకునే శక్తి లేదు. అతన్ని చూసి నా మనసు మునపటిలాగ కరగలేదు. రాయి అయిపోయిందని ఆక్షణమే అర్థం చేసుకున్నాను."

"అతని రాక నీ కానందంకలిగించలేదూ?"

"ఎందుకు లేదు? సంతోషంతో మాట రాలేదు. ఎప్పుడో వెళ్ళిపోయిన మనిషి తిరిగి వస్తే ఎంత ఆనందం కలుగుతుందో అంత ఆనందం కలిగింది. కాదనటం లేదు. ఇప్పుడు నీకు, ఆనంద్‌కి, మోహన్‌కి మధ్య భేదమే కనిపించటంలేదు. స్నేహితుడిగా నీ మీద ఎలాంటి అభిమానమో, అలాంటి భావమే మోహన్ మీద కూడా. అంతకు మించి ఏంలేదు. పెళ్లి ... ఆభావమే లేదు నాకు. ఇలాగే వుండిపోతాను. ఆస్పత్రి వుంది. నా ఆఖరి శ్వాస దాకా సేవచేస్తాను. రాజీవ్‌ని మీ అంత వాడ్ని చేస్తాను. ఇంతకంటే ఏంకావాలి?"

ఏ భావమూ లేక మాట్లాడుతున్న లతని చూస్తే కృష్ణ మనసేదోలా అయిపోయింది.

"ఇలాంటి నిర్ణయం మా మనసుకి బాధే కలిగిస్తుందని నువ్వు ఒప్పుకుతీరాలి. లతా... సరే. మరి. ఇంక వెడతాను"లేచినిలబడ్డాడు.

లత నవ్వేస్తూ అంది.

"బాధపడకు కృష్ణా. అంతే కొందరి జీవితాలు"

నిజమే! అంతే కొందరి జీవితాలు.

43

మోహన్ జీవితానికి ఇది మరో పెద్దదెబ్బ 'ఇక్కడ వుండి అనుక్షణం ఈ బాధ ననుభవిస్తూ వుండటం నావల్లకాదు'అనుకున్నాడు. వెళ్లిపోవాలి. వెళ్లిపోవాలి. ఎక్కడికి? ఎక్కడికో ఒకచోటికి. ఈ పరిసరాల్ని వదిలి వెళ్లిపోవాలి. శాంతి లభించే చోటికి. మనసులో, మనలో లేనిశాంతి మరోచోటలభిస్తుందా? ఏదయినా ఆశ్రమానికి పోవాలి. ఋషీకేశ్... హిమాలయాల నీడల్లో దొరుకుతుందేమో శాంతి అనుకున్నాడతను.

వినోద తనమీద ఎన్ని ఆశలు పెట్టుకుంది? ఆమె ఆశల్ని అగాధంలోకి తోసి లతకోసం పరిగెత్తుకు వచ్చాడు. ఇక్కడ దొరికిందేమిటి? నిరాశ. చీకటి.

తనెవరికోసం బ్రతకాలి? లతకి తనక్కరలేదు. వందనకి తను తండ్రికాడు. వందన దృష్టిలో తను కేవలం తండ్రి స్నేహితుడు.

అందరి జీవితాలూ బావున్నాయి. 'నాదే, నాదే భగ్నమయింది' అతని బాధ వర్ణించడానికి మాటలు చాలవు.

వైజాగ్ వచ్చిన రెండోరోజే ప్రయాణమయిన మోహన్‌ని చూసి నిర్వణ్ణులయ్యారు రాధాకృష్ణ, ఆనంద్.

"ఏమిటి మోహన్? ఎక్కడికి పోతావు?"

"వద్దు కృష్ణా. అడక్కు ఆ ప్రశ్న. ఎక్కడికో వెడతాను."

"వీల్లేదు. నువ్వెళ్లడానికి వీల్లేదు" అరిచాడు ఆనంద్.

"ఆపకండి నన్ను. మీకు తెలీదు. నేననుభవిస్తున్న చిత్రహింస. ప్లీస్. నన్నాపకండి."

"మోహన్! ఎందుకీ నిరాశ? వందనని చూడు. ఆ పాపను చూసి నువ్వీ బాధను మింగుకోవాలి."

"వందనకేం తక్కువ? పాప భవిష్యత్ గురించి నాకేం బెంగలేదు. కంటికి రెప్పలా

కాపాడే మీరున్నారు. అంతకంటె ఎక్కువ నేను మాత్రం చేయగలనా ???"

"ఈసారి నిన్ను వదలం. నువ్వు వెళ్లొద్దు."

"ఆపలేరు కృష్ణా, నన్నెవ్వరాపలేరు. ఇది జీవితం. దీనికెదురీదే శక్తి నాలో లేదు. గాలి వాటుగా కొట్టుకు పోతాను. నా మీద మీకేమాత్రం ప్రేమ వున్నా నన్నాపకండి. ఇంకా ఆపుతే నిజంగా పిచ్చెక్కి పోతాను."

ఇద్దరినీ ఎప్పుడూ చూడనంత వెర్రిగా చూసి సూట్‌కేస్ చేత బుచ్చుకుని వెళ్లిపోయాడు మోహన్. ఎక్కడికో?? స్నేహం అతన్ని బంధించలేక పోయింది. మనసు నిండా బరువున్న మనిషికి అతను కోరుకున్నదేదో లభించాలి. అది దొరకనప్పుడు ఎటువంటి బంధము అతన్ని కట్టెయ్యలేదు.

అలా సాగవలసిందే ఆ ప్రయాణం. ఓడిపోయిన మానవుడి సుదూర దీర్ఘ ప్రయాణం. ఎక్కడికో ???

* * *

వారం రోజులంతర్వాత ఆనంద్ పేర ఓ ఉత్తరం.

ఆనంద్,

మీ రెవరో నాకు తెలీదు. మోహన్ అప్పుడప్పుడు మీ పేరు చెప్తే వినడం తప్ప. రెండు రోజుల క్రితం మోహన్ ఇక్కడకు వచ్చాడు. జీవితం మీద ఏ ఆశా లేని మనిషిలా వచ్చాడు కలలోలా నడిచి. ఎంతో ఆదరించాం. మాకు తెలుసు అతని మనసు గాయపడిందని. అతని జీవితంపై ఎవరో గట్టి దెబ్బే కొట్టారని. ఇంకెవరు కొడతారు విధాత తప్ప.

ఈ రోజు ఉదయం మేము లేచే సరికి ఒక ఉత్తరంరాసిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. అక్కడికి వస్తాడని అనుకోటంలేదు. ఆ ఉత్తరం మీకు పంపుతున్నాను

మోహన్ పలాయనం మీకెంత దుఃఖాన్నిస్తుందో మాకూ అంతే.

మీ

దివాకర్...

దివాకర్,

మీ సహాయానికి, కిరణ్‌బాబీ ప్రేమకు ఆదరణకు కృతజ్ఞుడను. నేను వెడుతున్నాను. ఎక్కడికో తెలీదు. మనశ్శాంతి దొరికేచోటు ఎక్కడుంటే అక్కడికి.

నాకున్న ఆస్తంతా ఆనంద్ పేరరాశాను అతనికి పంపేయండి ఆ డబ్బు.

ఇంకేం రాయను? ఆత్మహత్య చేసుకోను. ప్రమాణం చేస్తున్నాను.

ఎప్పటికైనా మనసు మళ్లితే మిమ్మల్నందర్నీ కలుస్తాను. ప్రస్తుతానికి

తుది నమస్కారాలతో

మోహన్.

ఇది తీరనిబాధ ఆనంద్‌కి, రాధాకృష్ణకి మళ్ళీ రాధాకృష్ణ విచలితుడయ్యాడు. మోహన్ జీవితం కృష్ణలో చాలా సంచలనం కలగచేసింది. పిచ్చివాడిలా తయారయాడతను.

వీలయినంత వరకు రాధాకృష్ణ దగ్గరే వుంటున్నాడు ఆనంద్. శారదకీ భయమే ఈ కృష్ణ ఏమయిపోతాడాఅని. రాధాకృష్ణ కుచించుకుపోయాడు దిగులుతో. అతనికి రోజూ జ్వరం వస్తోంది. ఎంతకీ తగ్గకపోతే హాస్పటల్‌లో చేర్చారు. అతనికి మనోవ్యాధి మూలంగానే ఆ జ్వరం. జీవితమంటే విరక్తి. ఒకరకమైన వైరాగ్యం అతన్ని ఊపేస్తోంది.

శారద మనసు మనసులో లేదు. శూన్యపు దృక్కులతో తనవేపు చూస్తున్న ఆమెని చూస్తే కృష్ణకి మరింత దిగులేసేది. అందరు ఎన్నోవిధాల ఓదారుస్తున్నా మనసు దారితప్పుతోంది.

హాస్పటల్‌కి చేరిన కృష్ణకి ఆ వాతావరణం మరీ దుర్భరంగా అనిపించింది. ఎన్నెన్ని కథలు విన్నాడు. ఎన్నెన్ని జీవితాలు చూశాడక్కడ. అవి చూస్తుంటే తనబ్రతుకే నయమనిపించింది. అలా అనుకున్నప్పటినుండి జ్వరం తగ్గుమొహం పట్టింది. హాస్పటల్ నుండి ఇంటికి వచ్చేశాడు రాధాకృష్ణ కొంత సరిపెట్టుకున్న మనసుతో.

మర్నాడు అలా నడిచి బీచికి వెళ్ళడానికి అవకాశం దొరికింది రాధాకృష్ణకి. సాయంకాలం. అలా సముద్ర కెరటాల చూస్తుంటే ఎక్కడలేని నిరాశ మళ్లీ ఆవహించిందతన్ని. ఏమిటీ జీవితాని కర్థం? దేవుడున్నాడా? వుంటే మోహన్ జీవితం ఎందుకలా అయింది? ఈ జీవిత పోరాటానికి సమాప్తి ఎక్కడ? అఖండ జలరాశి ఏం చెప్తుంది. రహస్యం ఏదయినా చెప్తుందా ఈ చేతనా ప్రపంచాన్ని గురించి?


చస్తే ఈ బాధలేం వుండవా? అన్ని బాధలకీ పరిష్కారం చావేనా? అటువంటప్పుడు మానవుడికీ అశాంతి ఎందుకు? చావకూడదూ అందరూ? ధైర్యం కావాలా? అవును. చావే అన్నిటికి పరిష్కారమయితే అందరూ ఎందుకు చచ్చిపోవడంలేదు? చావులో శాంతి లభిస్తే అందరూ అదే కోరుకోవచ్చుకదా? అహ ... అదికాదు. అశాంతికి అవధిలేదు. మానవుడి మనుగడకి అర్థంలేదు. ఇలా ఆలోచనలు సముద్ర కెరటాల్లా పొంగి పొర్లిపోతున్నాయి అతని మెదడులో.


శారదతో బీచికెడుతున్నానని చెప్పివచ్చాడు రాధాకృష్ణ. అతనెంతకి రాకపోతే ఆనంద్‌కి ఫోన్‌చేసి బీచికి వచ్చింది శారద. రాధాకృష్ణ ఎక్కడా కనబడలేదు శారదకి. ఒక్కసారి ఏదో తెలియని భయంతో ఒళ్లు గడ్డకట్టుకుపోయింది. కంపించిపోయింది.

ఛ...అతనితో కూడా తను కూడా రావలసింది. ఎంత పొరబాటయింది? ఆమూల నుంచి ఈమూలకి వెతికింది. ఎక్కడా ఆమె కళ్లకి రాధాకృష్ణ కనబడలేదు. ఏడుపు లోలోపలినుంచి ఉబికి వస్తోంది. భగవంతుడు ఏం చెయ్యదల్చుకున్నాడు? పదేపదే ప్రార్థిస్తోంది.

"ఏమిటమ్మా? అలా వున్నారేం?"

(42వ పేజీ చూడండి)





ఆదివారం సాయంత్రం

ఆర్. కనకదుర్గ

అందమైన ఆదివారం సాయంత్రం మబ్బు మబ్బుగా వుండి, చల్లగా ఆహ్లాదకరంగా వుంది వాతావరణం. వారానికి వచ్చే ఒక్కరోజు శెలవు దినాన్ని అయిన వాళ్లతో ఆనందంగా గడపాలని ప్రతివాళ్ళూ కోరుకుంటారు.

స్కూలు పిల్లలకయితే పండుగే! స్కూలు కెళ్లటం, టీచర్లచేత చీవాట్లు తినటం లేదుకదా మరి!

కాలేజి స్టూడెంట్స్ బెంగపెట్టుకొనే రోజు కూడా అదే! శనివారం పదిగంటలకు కాలేజీనుంచి వెళ్లిపోతూ, మళ్లీ సోమవారం వరకు మీ దర్శనాలుండవు ఎలా వుండటమో అన్నట్లు దీనంగా చూస్తారు ఆడపిల్లలవైపు. కాని, ఆదివారం రోజంతా రోడ్డుమీద బీటువేసి వచ్చేపోయే వాళ్లను వెక్కిరిస్తూ, పేర్లు పెడుతూనే వుంటారు.

ఇక ఇంట్లో వుండే ఆడవాళ్లకు పని ఎక్కువగా వుండే రోజూ అదే! సాయంత్రం సరదాగా భర్తతో పిల్లలతో ఎక్కడైనా వెళ్లిరావచ్చునన్న సంతోషంతో ఎంతపనైనా చకచకా చేసుకొంటారు.

రకరకాలైన మనుష్యులను ఎదురు బొదురుగా నడిపిస్తూ కళకళలాడుతున్న రోడ్డువైపు చూస్తూ డాబామీద నించుంది ఉమ. ఆమెకు ఆదివారం సాయంత్రమంటే ఎంతో ఇష్టం. తను బయటకెళ్లకుండా, ఆడాబామీదనుంచొని, రకరకాలైన మనుష్యులను చూస్తూ, వాళ్ల ముఖకవళికలను బట్టి వాళ్లే పరిస్థితులలో ఇంటినుంచి బయలుదేరారో వూహించుకొంటూ, అక్కడ నిలబడటమంటే సరదా ఆమెకు. వచ్చేపోయేవాళ్ల మంచి చెడ్డలు, అందచందాలుగురించి తనలోతాను తర్కించుకొంటూ బాగా చీకటిపడేవరకు ప్రతిసాయంత్రం అక్కడే నిల్చుంటుంది. ప్రతిరోజుకంటే ఆదివారం సాయంత్రం మాత్రం కొంచెం ముందుగావచ్చి, కాస్త ఆలస్యంగా క్రిందికి దిగివెళ్ళిపోవటం అలవాటామెకు.

మామూలుగా ఆరోజు కూడా ఐదుగంటలయ్యేసరికి అమ్మమ్మకు చెయ్యవలసిన పనిసాయమంతా చేసేసి డాబామీదకు వెళ్లింది ఉమ. 'అక్కకూడా వుంటే ఎంత బాగుండేది?' అనుకొంది ఉమ. ఇద్దరూ కలిసి వచ్చేపోయేవాళ్లను గూర్చి చర్చించుకొనేవారు. సంవత్సరమైంది పెళ్లయి అత్తవారింటికి వెళ్లిపోయిన అక్కమీదకోపం వచ్చేసింది ఉమకు. అప్పుడే ఏం కొంప మునిగిపోయిందని పెళ్లి చేసేసుకోవాలి? ఎంచక్కా ఇద్దరూ కలిసి నిలబడేవాళ్ళు. ఇప్పుడు తనకు తోడెవ్వరూ లేరు. తమ్ముళ్లిద్దరూ వున్నారంటే వాళ్ల ఆటలేవాళ్లవి. వాళ్లెప్పుడూ ఇంట్లో వుండరు. పగలంతా స్కూలు, తరువాత ఆటలు. రాత్రిమాత్రం వాళ్లకి అక్క జ్ఞాపకం వస్తుంది రాని పాటాలు చెప్పడానికి!

ఒక్కర్తే కాళ్లు నొప్పెట్టేవరకు అక్కడనుంచొని క్రిందకు వెళ్లిపోవాలి! అక్క వుంటే కాళ్లనొప్పులు తెలిసేవేకావు కబుర్లలోపడితే! ఇలా అనుకొంటూ రోడ్డువైపు చూస్తున్న ఉమ దూరంగా రోడ్డు మొగన కిళ్లీకొట్టుదగ్గర కనబడిన శాస్త్రినిచూసి రెండడుగులు వెనక్కివేసింది. 'అమ్మో హిస్టరీ లెక్చరర్ సాంబశివం గారు! ఇక్కడ తననిలా చూస్తే ఏమనుకొంటారు? నెల్లాళ్లలో పరీక్షలు పెట్టుకొని ఈ పిల్ల ఎంత దీమాగా నుంచుందో అనుకొంటారు. మలుపు తిరిగి పోయేవరకూ వెనక్కు వుండి మళ్లీ గోడ దగ్గరకొచ్చి నిలబడింది.

ఒక అరగంట అలా నిలబడినా, ఆదివారమైనా ఆవేళ అదేమిటో రోడ్డు ఏం సందడిగాలేదు. విసుగేసి క్రిందకు వెళ్లి ఏదైనా పుస్తకం తెచ్చుకొందామని అనుకొని, ఆఖరిసారి అన్నట్లు రోడ్డు చివరిదాకా దృష్టిసారించింది ఉమ. అటునుంచి వస్తున్న ఇద్దరు యువకులను చూడ్డంతోనే గబగబా క్రిందకు వెళ్లింది. గదిలోకెళ్లి, కుర్చీలో ఇందాక తను పడేసిన పుస్తకాలను తీసిరేక్‌లో సర్దింది. అక్కడే వున్న మంచంమీద దుప్పటి దులిపి సరిగ్గా వేసింది. ఇంతలో వాళ్లిద్దరూ వీధివరండాలో కొచ్చారు. 'ఉమాదేవీ'! అని పిల్చాడు వాళ్లలో కాస్త సన్నగా పొడుగ్గా వున్న తను. ఉమ గబగబావెళ్లి "ఓ! మీరా? రండి!" అని ఆహ్వానించింది, అతనికవెనుకనున్నతన్ని కన్నెత్తి అయినా చూడకుండానే.

అతనంతకంటే గడుగ్గాయిలా వున్నాడు. 'పిలవక్కర్లేదు నేనతనినీడనే!' అన్నట్లు లోపలికొచ్చేశాడు.

"ఉమా! ఎవరే వచ్చారు?" వంటింట్లో నించి అమ్మమ్మ గొంతు వినిపించింది.

వాళ్లను కూర్చోమని చెప్పి,

"ఇందిరా వాళ్లాయన ప్రసాద్‌గారమ్మమ్మా !" అంటూ వెళ్లి,

"కొంచెం కాఫీ పెట్టవా అమ్మమ్మా?" గారాలు కురిసింది ఉమ. ముసలావిడ పొంగిపోయి, "అలాగే! నువ్వెళ్లి మాట్లాడుతుండు. నేను కాఫీపెట్టి తీసుకొస్తాను" అంది.

ఉమ గదిలో కెళ్లేసరికి ప్రసాద్ కూర్చున్నాడు. ఆ రెండవతను కిటికీ దగ్గరగా నిలబడి బైటకు చూస్తున్నాడు.

"ఏమండి ప్రసాద్‌గారూ ? ఇందిర ఎక్కడా కనిపించటల్లేదు? పోయిన ఆదివారం వస్తానన్నది. తను వస్తుంది కదానని నేనెక్కడికీ వెళ్లలేదు. మీరు కాని వెళ్లొద్దన్నారేంటి?" మంచంమీద కూర్చుంటూ ఉమ అడిగింది. ప్రసాద్ తెల్లబోయాడు.

'ఏంటీ పిల్ల? ఇంకొక మనిషి వచ్చాడనీ, అతన్ని కూర్చోమని చెప్పాలనీ తెలియదా? తను కూర్చుంది గాని, అతడ్ని కూర్చోమని చెప్పనేలేదు.' అనుకొంటూ గత్యంతరంలేక తనే,

"ఉమాదేవీ! నేను పరిచయం చెయ్యలేదు కదూ! ఇతను నా కజిన్. ఇక్కడ ఏదైనా ఉద్యోగ ప్రయత్నం చేద్దామని వచ్చాడు. ఎం. ఎస్. సి. ఫస్ట్‌క్లాస్‌లో పాసయ్యాడు" అనిపరిచయం చేశాడు. అతను అక్కడే నిలబడి వీళ్లవైపు తిరిగాడు.

"నువ్వేం చెప్పక్కర్లేదురా ప్రసాద్ ! ఆమెకు నేనింతకుముందే తెలుసు. అయితే, అప్పుడు నేనంటే చాల చెడ్డ అభిప్రాయం ఏర్పడ్డదనడానికి ఇదిగో, ఈ నిదర్శనాలు చాలు. కాని, కాకతాళీయంగా జరిగిన దానికి ఎవరూ బాధ్యులుకారు. మీరిది తెలుసుకొంటే బాగుంటుంది. ఉమాదేవీ !"

'ఛస్ ! నాతో మాట్లాడకండి. ఇంటికి వచ్చిన వాళ్లను అవమానించటం మర్యాద కాదు గనుక, ఇంతసేపూ మీ ఉనికినైనా సహించాను. ప్రసాద్‌గారూ! కూర్చోమని చెప్పండి మీ కజిన్‌కి నేను మాత్రం అతనితో మాట్లాడను."

అంటూ లోపలికెళ్లి కాఫీలు తీసుకొచ్చింది. విషయం తెలియని ప్రసాద్ తెల్లబోయి చూశాడు తమ్ముడివైపు. అతను నవ్వుతూ చెప్తానులే అన్నట్లు సౌజ్ఞ చేశాడు. ఉమ వెనుకనే అమ్మమ్మ ఇవతలకు వచ్చింది.

"ఏం ప్రసాద్‌బాబూ ! బాగున్నావా ? మీ ఆవిడ రావటంలేదేం ?" అనిఆదరంగా పలుకరించారావిడ.

"మా ఇంటికి చుట్టాలొచ్చారు. అందుకని రాలేదు. ఇదిగో ! వీడు మా పెదనాన్న గారబ్బాయి. ఇక్కడేదైనా ఉద్యోగంకోసం వచ్చాడు." అని తమ్ముడ్ని అమ్మమ్మగార్కి పరిచయంచేశాడు. అతడు సవినయంగా "నమస్కారమండీ !" అన్నాడు.

"దీర్ఘాయుష్మాన్ భవ !" అని నోటినిండుగా ఆశీర్వదించి, "అదేమిటి నాయనా ? నిల్చొనే ఉన్నావ్ ? కూర్చో బాబూ !" అని తను కూడా గుమ్మం దగ్గరగా కూర్చున్నారావిడ.

అతను ఒక్కసారి ఉమవైపు చూసి అమ్మమ్మగారి దగ్గరగా కుర్చీలాక్కొని కూర్చున్నాడు. ఉమ ప్రసాద్‌కి కాఫీ ఇచ్చి, ఇంకొకగ్లాసు అమ్మమ్మ దగ్గరగా పెట్టి, "అతనికిచ్చెయ్యమ్మా !" అంది.

ఆవిడగ్లాసు ముందుకు పెట్టి "తీసుకోనాయనా! ఆ మీరెంతమంది అన్నదమ్ములు ? ఏవూరు నాయనా ? మన గోత్రమేమిటన్నావ్ ?" అంటూ విషయ సేకరణ ప్రారంభించింది.

అమ్మమ్మవైపు చురచురచూస్తూ, "నీకెందుకమ్మమ్మా అవన్నీ ! నువ్వేం వియ్యమందుతావా వాళ్లతో, లేకపోతే కయ్యానికి కూడా అవన్నీ కావాలా?" అంది ఉమ.

"అదేమిటే మాటకు ముందు అలా కయ్యాని కొస్తావ్ ? అన్ని కుదిరితే వియ్యమే అందుతామో, కయ్యమే ఆడతామో అవన్నీ మేం చూసుకోవలసినవి. నీకెందుకు ? నీ గొడవేమో నువ్వు చూసుకో !" అనేసిందావిడ.

ఉమవైపు విజయగర్వంతోకూడిన చూపొకటి పారేసి, బుద్ధిమంతుడిలా అమ్మమ్మగారి ప్రశ్నలకు జవాబు చెప్తున్నాడతను. కొంచెంసేపు కూర్చున్న తరువాతఅన్నదమ్మలిద్దరూవెళ్దామనిలేచారు.అతనమ్మమ్మగారికి నమస్కరించి, "వస్తామండి మామ్మగారూ !" అన్నాడు.

"మా నాయనే ! ప్రసాద్‌తో వస్తూవుండు నాయనా !" అని దీవించింది.

వాళ్లనలా వెళ్లనిచ్చి అమ్మమ్మ మీద ఖస్సుమని లేచింది ఉమ.

"ఏం [illegible]న్ని వస్తూండమని చెప్పావ్? అతనెంత చెడ్డవాడో తెలుసా ? అతను ఒకనాడు నన్నెంత అల్లరి పెట్టాడో ! ఛి, ఛి, తలచుకొంటే ఏడుపొస్తుంది." అని కళ్లనీళ్లు పెట్టుకొంది.

అమ్మమ్మ గాభరాగా "ఏంటీ ? అతను నిన్నల్లరి పెట్టేడా ? నాకేం తెలుసే ? అయినా అతను మంచి వాడిలావున్నాడు. నువ్వేమన్నావో ? నీ కసలు అందరిమీదా ఒంటికాలిమీద లేవడమలవాటు." అంది.

"ఆ ఆ ఇప్పుడు నేనేం చెప్పినా నమ్మవు. అసలేం జరిగిందో వింటే నువ్వు అతని ముఖమైనా చూడవు తెలుసా ?"

అంటూ జరిగిందాన్ని సరిగ్గా గుర్తు తెచ్చుకొంటున్నట్లు కూర్చుంది.

"ఒకనాడు, ఆమధ్య ఆదివారం ప్రయివేటు క్లాసులు పెట్టేరు గుర్తుందా ? అప్పుడన్నమాట శ్యామల, శ్యామల తెలుసుకదూ నీకు ? అదీ, నేనూ నాలుగ్గంటలకు క్లాసయి వచ్చేస్తూ, పదమూడో నెంబరు బస్సు ఎక్కాం. ఆదివారమేమో ఎంత రష్‌గా వుండాలో అంతా వుంది. మాకు మెట్టుమీద నిల్చొందుకు మాత్రంచోటు దొరికింది. క్రింద మెట్టుమీద క్లీనరు కుర్రాడూ, మరెవరో ఒకతను నించున్నారు. పైన సరిగ్గా మాకెదురుగా నలుగురబ్బాయిలు నించొన్నారు. హాస్పిటల్ డవున్‌లో బస్సు వెళ్తుండగా కండక్టరు టిక్కెట్లంటూ వచ్చాడు. నేను వెనుక ఇనపకమ్మికి జార్లబడి పర్సుతీశాను. ఇంతలో మలుపు తిరిగింది. బస్ పట్టులేక పోవడంతో పడిపోబోతుంటే శ్యామల పట్టుకోబోయింది. దాంతో ఇద్దరంకలసి, చేతిలో పుస్తకాలతో సహా పైమెట్టు మీద కూర్చుండిపోయాం. నిల్చున్న నలుగురిలోనూ ఈ మహాను భావుడున్నాడులే ! చటుక్కున....ఛీ, ఛీ తలుచుకొంటే అసహ్యమేస్తుంది. చెయ్యిపట్టుకొన్నాడు. మహా పడిపోయేవాళ్లందరిని ఆ పేసేవాడిలా అలా పట్టుకొని [illegible]ంతంగా లేవదీశాడు. తను క్రిందకి దిగి మెట్టు మీదనుంచుని మాకిద్దరికి పైనచోటిచ్చాడు. ఇహ అక్కడినుండి, ఆ మిగిలిన ముగ్గురూ.... రవుడీ....వెధవలు.....'అబ్బ! ఎంత మంచి సీనురా! కెమెరావుంటే ఫొటోతీయొచ్చు, హీరో,హీరోయిన్లను అందరికీ చూపెడితే ఎంత బాగుంటుందో ?'అంటూ ఒకటేగోల అప్పటినుంచి ఎక్కడకనబడినా ఆవెధవలు హీరోయిన్‌రోయి! హీరోయేడి ? అని ఇప్పటిమెచ్చిన నట్లు రాగుతున్నారు. అదే కాకుండా, ఆవేళ అతను కూడా మావెనకాలే, మస్కోవ్‌లోనే దిగాడు. ఇంకా చెప్పాలా ఆ వెధవల అల్లరి !"

ఉద్రేకంగా చెప్పుకుపోతున్న ఉమ అమ్మమ్మ మాటలతో వులిక్కిపడింది.

'అయితే అందులో అతని తప్పేముందో చెప్పు ? ఇంకా నయం. ఇలాపడేదటు పడితే నడుస్తున్న బస్సులోంచి క్రిందపడేవారు కాదూ ? ఏకాలో, చెయ్యో విరిగేది ఆవేళ అతను ఆపేడు కాబట్టి సరిపోయింది. అయినా, నేను చెప్తాను కాదే నీకు అందరిమీదా విరటం ఎక్కువైయింది" అంటూ "ఇంకా కూర వేయించుకోవాలి పిల్లొస్తారని ఇలా వచ్చాను" లేచిందావిడ.

అమ్మమ్మ మీద కోపమంతా చేతిలోని విసనికర్రపై చూపిస్తూ, "ఛీ, ఛీ, అందమైన ఆదివారం సాయంత్రం వీళ్లొచ్చి పాడు చేశారు. ఏకట నా

హృద్దీపాల్ని వెలిగించండి!

మీమీ జీవనదీపాలు కొడిగట్టిపోతున్నాయనీ
మీ ఆశల తంత్రులు తెగిపోతున్నాయనీ
సమస్యల జ్వాలాజిహ్వలను
మిమ్మల్ని కౌగలించుకోవడానికి
వీసమైనా జంకటం లేదనీ
దిగాలుపడి— చతికిలబడి
మీ చేతకానితనాన్ని
పదిమందికీ పంచకండి !
మీ చేత 'కానీ'లేనితనాన్ని
బహిరంగ పరచకండి.
చీకట్లో కూర్చుని చీకటిని తిట్టకండి.
ఈ రాజకీయపు విష ప్రభంజనాలకీ
ఈ నిజాలులేనియిజాల సర్పాల కరాళదంష్ట్రలకీ
ఈ అన్యాయాల రక్తపిశాచపుంజాలకీ
బెజారై—పరలోకానికి
పలాయన మంత్రం పఠించకండి !
'ఆశ మానవ జీవితానికి శ్వాస' అన్నదిగుర్తుంచుకొని
ధైర్యమనే ప్రమిదలో
నమ్మకం వత్తితో
విజిగీషతో—మనశ్శుద్ధితో
హృద్దీపాల్ని వెలిగించండి ! !
మీమీ బాధల తమిస్రాన్ని నిర్మూలించండి!
—జయన్మైస్.

ఆదివారం సాయంత్రం

పడిపోయింది. ఇక డాబామీదకెళ్ళినా లాభంలేదు అనుకొంటూ పుస్తకం పట్టుకూర్చుంది ఉమ.

* * *

"అబ్బ! నెల్లాళ్ళయింది వెధవ పరీక్షలు కాదు గాని ఆదివారంనాడైనా ఎటూ పోవడానికి వీల్లేకుండా అయింది. అమ్మయ్య! అయిపోయాయి. ఇవాళ ఎక్కడికైనా వెళ్తే బాగుండును. ఎవ్వరూ తోడు లేరు. బీచికైనా వెళ్లిరావాలి." అనుకొంటూనే ముస్తాబై పోయింది ఉమ. తెల్లని ఫుల్‌వాయిల్‌మీద బోర్డరుగా పెయింట్‌చేసిన ముదురు నీలంరంగు పెద్ద పెద్ద పువ్వులున్న చీరకట్టుకొని, ముదురు నీలం జాకెట్ వేసుకొని, తయారైన ఉమనుచూసి,

"ఎక్కడికే ఒక్కతెవీ బయలుదేరావు? ఆదివారం ఎవరైనా వస్తారేమో ఇంటిదగ్గరుండ కూడదూ? అయినా నేచెప్తే వింటావా నువ్వు?"

అంటూ బియ్యం చేటపట్టుకొని లేచింది అమ్మమ్మ. వినుగ్గా ఆవిడవైపు తిరిగి "అదిగావూ? పెద్ద దానివైనా నీకేబుద్ధిపోదేం? ఎక్కడికి బయలుదేరినా అడుగుతావు! ఇక ఇంటికెవరైనా వస్తారంటావా, వస్తే నువ్వు మాట్లాడు లేకపోతే పొమ్మను." అంటూ జోళ్ళు తొడుక్కొని వెళ్ళిపోయింది ఉమ. ముందు శ్యామలా వాళ్ళింటికి వెళ్ళి, ఇద్దరూ కలిసికాసేపు బీచ్‌లో కూర్చుని రావాలి అనుకొని అఫీషియల్ కాలనీలోని శ్యామల ఇంటికి బయలుదేరింది.

* * *

ఎగిరిపడే అలలను చూస్తూ ఒంటరిగా కూర్చుంది ఉమ. కాస్సేపు చూసేసరికి అదికూడా విసుగేసింది. చుట్టూ తనలాగే చల్లదనానికి వచ్చికూర్చున్న వాళ్ళను కలియచూసింది. 'అందరకూ ఎవరోఒకరు తోడున్నారు. తనకే ఎవరూ కంపెనీలేరు. ఛ, శ్యామల కూడా ఇవాలే సినిమాకు వెళ్ళిపోవాలా? పోనీ తనకు కూడా చెప్తే తనుకూడా వెళ్ళేదిగా!' అనుకొని అయినా ఆది వాళ్ళబావతో వెళ్ళిందిట. పిలిస్తే మాత్రం తనేలా వెళ్తుంది వాళ్ళతో! అనుకొంటూ మరోసారి చుట్టూ చూసింది. అందరూ ఎవరిధ్యాసలో వాళ్ళున్నారు. కొస్తదూరంలో ఎవరో ఒకతను తనలాగే ఒక్కడూ కూర్చొని ఏదో పుస్తకం చదువుకొంటున్నాడు. అతనికి పుస్తకమైనా వుందితోడు తనకదీలేదు. అరే! అతను.... అతనేలా వున్నాడే!, అనుకొంటూనే అటువైపు పరీక్షగా చూసింది ఉమ. ముదురు నీలం రంగుపాంటుమీద, తెల్లగా పాలనురుగులాంటిస్లాక్ వేసుకొని మోచేతిమీద ఆని, ఇసకలో పడుకొని, పుస్తకం చదవటంలో లీనమైపోయాడతను. తనకు తెలియకుండానే తనకేసిచూస్తే బాగుండుననుకొంది ఉమ. మరుక్షణంలో ఛీ, ఛీ ఇదేమిటి నేనిలా ఆలోచిస్తున్నాను అతను చేసిన పరాభవమప్పుడే మరిచిపోయా?" నిజం చెప్ప. పరాభవమా అది? అదేక్షణంలో నీలో ఏవో కొత్త శక్తులు నిద్రలేచినట్లునిపించలేదూ? అవి నీకు ఇష్టంగా కూడా వున్నాయికదూ?' అంటూ ఎవరో నిలదీసినట్లనిపించింది.

'నిజమే! రెండవసారి అతనుకలిసి అంతా కాకతాళీయమని చెప్పినప్పటినుంచీ, తనలో ఏదో తనకే తెలియని మార్పువచ్చింది. వద్దన్నా, ఆనాటి అతని స్పర్శ, మాటలు తనను చుట్టుకొంటున్నాయి' ఇలా అనుకోగానే ఉమ అతన్ని పలకరించుదామనే ఆలోచనను ఆపలేకపోయింది.

లేచి, చీరకుచ్చిళ్ళు సర్దుకొని, అటువైపుగా నాలు గడుగులువేసి ఆగిపోయింది 'ఒకవేళ అతనుదీన్ని అలుసుగా తీసుకుంటే' అనిపించగానే అతనంతట అతనే పలకరించేలా చేయాలనే పట్టుదల హెచ్చింది. అటువైపుగా నడుస్తున్నదల్లా ఆగి, నీటివైపుగా నడిచి, ఒడ్డునే కొంతదూరం నడిచింది. కనుచీకటి పడుతోంది. ఇక ఇంటికెళ్ళాలని వెనక్కు తిరిగింది. అతను కూడా పుస్తకం మూసేసి, చుట్టూచూస్తూ కూర్చున్నాడు. దూరంనుంచే అది చూసిన ఉమ తనతనిని చూడనట్లుగా నీళ్ళకేసి చూస్తూ నడిచింది. అతన్నిదాటి వెళ్ళిపోయాక,

"అరె! ఉమాదేవి!" అంటూ అప్రయత్నంగా పిలిచాడతను. అందుకోసమే చూస్తున్నట్లుగా చటుక్కున వెనక్కు తిరిగింది. చొరవగా దగ్గరగా వచ్చేశాడతను.

"ఒక్కరేవచ్చారా?" ఉమ మధ్య ఏం జరగనట్లు ఒక స్నేహితుడిలా పలకరిస్తున్న అతనిని చూసి ఆశ్చర్యపోయింది, ఉమ. తనతనికిచేసిన అవమానం మరచిపోయాడా? లేకపోతే . . . లేకపోతే అతను కూడా తనలాగే ఫీలవుతున్నాడా?' ఇలా అనుకోగానే ఉమ చెక్కిళ్ళు ఎర్రబడ్డాయి.

"ఏమిటండీ అలా చూస్తున్నారు? ఏం నా మీద కోపం పోలేదా?" అన్నాడతను తనను తాను చూసుకుంటూ.

"అబ్బే! అది కాదండీ, హటాత్తుగా మీరు కనబడేసరికి. . ." పూర్తి చెయ్యలేక పోయింది.

"ఏం కయ్యమాడాలో కబుర్లాడాలో అర్థం కావటం లేదాండీ?" చిలిపిగా నవ్వుతూ అన్నాడు. "మా యిష్టం మీరు కయ్యమాడినా, నాలుగు కబుర్లు చెప్పినా, ఏమైనా సరే! మీతో గడపాలని అంతే! తిడతారా! రెడీ!" అన్నాడు కొంచెంతలవంచి తమాషాగా. అతన్ని అలా అతి దగ్గరగా చూస్తుంటే ఉమకు తన కలలకు ప్రతిరూపంలా తోచాడు. వెంటనే ఆ వేళ అమ్మమ్మ అన్న 'వియ్యమే అందుతావో కయ్యమే ఆడతావో అది మా యిష్టం' మాటలు కూడా జ్ఞాపకం వచ్చాయి. దాంతో ఉమ మనసు పూర్తిగా అతని వశమై పోయింది.

ఉమ మాట్లాడక పోవడంతో ఆమెకు తన మీదింకా కోపం పోలేదనుకొని, నిరుత్సాహపడిపోయాడు తను. "సారీ! మీకిష్టం లేకుండా నేను మిమ్మల్ని నిలవేశాననిలా వుంది. వస్తానండి." అని వెనుతిరిగి పోయాడు.

అతన్ని ఎలా ఆపాలో తన వుద్దేశ్యాన్నెలా చెప్పాలో అర్థం కాని ఉమ "మీరు. . ." అని మాత్రం అనగలిగింది.

అంతమాత్రానికే పొంగిపోతూ ఉమకు అతి దగ్గరగా వస్తూ "మీకు . . . మీకు నా మీద కోపం లేదా? ముందిది చెప్పండి" అన్నాడు.

"ఛ, కోపమెప్పుడో పోయింది. దాని స్థానాన్ని."

తరువాత నీవే పూర్తి చేసుకో అన్నట్లు వదిలేసింది.

"హూ దాని స్థానాన్ని. ... ఏం నిలిచింది? చెప్పరూ?" అని అతనడుగుతుంటే చెప్పలేక, చెప్పడ మసలు చేతగాక,

"ఇంటిదాకా దిగబెట్టరూ నన్ను? చీకటి పడి పోయింది." అని మాట మార్చేసింది ఉమ.

అప్పుడే ఈ లోకంలోకి వచ్చినట్లు చుట్టూ చూసి.

"మై గాడ్! అంతా వెళ్లిపోయారే! పదండి పదండి, మామ్మగారేం ఖంగారు పడుతున్నారో?" అంటూ ముందుకు నడిచాడు.

"మీకు జాబ్ ఏమైనా దొరికిందా?" దారిలో అడిగింది ఉమ.

"ఆఁ మా ఇందిర మీతో చెప్పలేదా? అయినా నా మీద కోపంతో వున్నారు, చెప్పినా వినేటట్లు లేరనిపించి మానేసిందేమో? మీ కాలేజీలోనే టెంపరరీయే అనుకోండి, కాని, ఈ శలవల తరువాత పర్మనెంట్ చేస్తామనీ, లెక్చరర్ పోస్టు యిస్తామనీ చెప్పారు. నాకేమో ఈ లెక్చరర్‌గిరీ నచ్చదు. అందుకని కొన్ని కంపెనీలకి అప్లై చేశాను. ఏదైనాఇంకొకటి మంచిది వస్తే ఇది వదిలేస్తాను." అలా మాట్లా డుతూ హాస్పిటల్ ఒ. పి. గేట్ దాకా వచ్చారు. అక్కడ బత్తాయిలు, ద్రాక్ష పండ్లున్న బండి చూసి

"వెయిట్ ప్లీజ్, ఒక్క నిముషంలో వస్తాను. అలా ప్రక్కకు నిల్చోండి." అని గబగబా రోడ్ క్రాస్ చేసి వెళ్లి నాలుగు బత్తాయిలు, కొంచెం ద్రాక్ష పండ్లు తీసికొని వచ్చాడు.

"అదేంటండీ మీయింట్లో ఎవరికైనా వంట్లో బాగుండటం లేదా?" అనడిగింది ఉమ అవన్నీచూసి. అతను చిన్నగా నవ్వి,

"మా యింటికి కాదండి. మామ్మగారికి. ఏమిటో ఆవిడను చూస్తే మా బామ్మ జ్ఞాపకం వచ్చింది. క్రితం సారి." అన్నాడు.

"ఇప్పుడివన్నీ ఎందుకండీ?" మొహమాటపడింది ఉమ.

"ఎందుకేమిటండీ? పెద్దవాళ్ల దగ్గరికీ, పసి పిల్లలున్న చోటికి వట్టి చేతులతో వెళ్లకూడదనేది మా అమ్మ. సరేలెండి! ఇంతకీ మీరు పరీక్షలెలా వ్రాశారు.? పాస్ అవుతారా? మా ఇందిర మీకు క్లాస్ వచ్చేస్తుందని చెప్పింది" అనేసరికి ఉమ ముఖ మంతా ఎఱ్ఱగా చేసికొని,

"అంతా వట్టిది! నాకైతే హిస్టరీ పేపరుపాడు చేశాననిపిస్తోంది. తను అన్నీ బాగా రాశానంది. తనకే వస్తుందేమో క్లాస్" అన్నది.

అతను ఫక్కున నవ్వి, "నేనొకమాట చెప్పనాండి? పరీక్షలు రాసిన ఏ యిద్దరు స్నేహితుల నడిగినా ఇదేమాట చెప్తారు. ఆఖరికి ఇద్దరికీ వస్తుందేమో క్లాస్ ఎవరు చెప్పగలరు?" అన్నాడు.

"మీరు భలే తమాషాగా మాట్లాడుతారండి." అంటూ ఇంటి మెట్లెక్కింది ఉమ.

జోళ్లు విడిచేసి లోపలి కెళ్లేసరికి ముందున్న గదిలో మంచం మీద పడుకోనుంది అమ్మమ్మ. ఆత్రుతగా దగ్గరకెళ్తూ,

"ఏం అమ్మమ్మా పడుకోనున్నావ్? చూడ ఆ వేళ వచ్చారే ప్రసాద్‌గారి తమ్ముడు. ఆయన వచ్చారు. నిన్ను చూడ్డానికి." పలకరించింది ఉమ.

అమ్మమ్మ మగతగా మూల్గి "ఏం లేదే! కొంచెం కళ్లు చీకట్లు కమ్ముతుంటే వచ్చి పడుకొన్నాను. అదేమిటో ఒంటి మీద తెలివి లేక పోయింది."

అంటూ లేచి కూర్చోబోయిందావిడ. కాని, తల నొప్పితో బద్దలై పోతుండడంతో లేవలేక పోయింది.

"మీరు పడుకోండి మామ్మగారూ!" అని ఉమ వైపుకు తిరిగి "కొంచెం పంచదార నీళ్లు కలిపి పట్టుకొని రండి. అవి తాగితే సర్దుకొంటుంది. కొంచెం బి. పీ. హైపై వుంటుంది." అన్నాడు.

అమ్మమ్మకు బి. పి. వున్నట్లు ఇతనికెలా తెలుసా అనుకొంటూ వంటింట్లోకి నడిచింది ఉమ. పంచ దార నీళ్లు తయారు చేస్తూనే 'ఇందుకే కాబోలు సాయంత్రం తననెళ్లవద్దన్నది. తనకప్పుడే ఏమా త్రమో అనుమానం వుండి వుంటుంది. తానేమో చికాకు పడ్డది. అమ్మమ్మ మీద' అని పశ్చాత్తాప పడసాగింది.

"ఇంతసేపా పంచదార నీళ్లు తేవటం? గ్లాసు చేతో పట్టుకుని ఆలోచనల్లో తేలిపోతున్నారా? అది ఇలా ఇవ్వండి. నేనైనా యిస్తాను మామ్మగారికి." అన్న అతని మాటలతో ఉలిక్కిపడి లేవబోయి ముందున్న పీట తన్నుకొని పడబోయింది. చటుక్కున ముందుకు వచ్చి ఒక చేతో ఆమె చేతిలోని గ్లాసును రెండవచేతో ఆమె చేతిని పట్టుకొని ఆపాడతను. ఆ క్షణం చాలు ఉమలో నిద్రాణమై వున్న స్మృతులు మేల్కొనడానికి. తలెత్తి అతని ముఖంలోకి చూడ లేక పోయింది. అతను కూడా అదే అనుభూతి పొందు తున్నవాడిలా చూసి, వెంటనే చెయ్యి వదిలేశాడు.

"సారీ! మళ్లీ మీకు కోపం తెప్పించే పనే చేశాను కాని, ఇది కూడా కాకతాళీయమే." అనేసి గ్లాసు పట్టుకుని మామ్మగారి దగ్గరకెళ్లి పోయాడు. ఉమ మాత్రం ఇంకా తన శరీరానికి తగిలిన విద్యుత్‌ప్రసారం నుండి తేరుకోలేక పీట మీద కూర్చుండి పోయింది. అలా ఎంత సేపు కూర్చుందో ఆమెకే తెలియదు.

"ఉమాదేవీ!" పిల్చాడతను.

గబుక్కున ఇవతలి కొచ్చింది. కాని, సూటిగా అతనివైపు చూడలేక పోయింది. బయటకొచ్చిన ఉమ ముఖంలోని మార్పుని బట్టి అర్థం చేసుకో గలిగిన అతను మనోహరంగా నవ్వుతూ "మరికవెళ్లి రానా?" అన్నాడు.

"వూఁ" అని అతి ప్రయత్నం మీద "మళ్లీ ఎప్పుడొస్తారు?" అనడిగింది.

"ఎప్పుడు రమ్మంటారు?" అతనంతకన్నా గడుసుగా చూశాడు.

ఉమకు అర్థమై పోయింది. తనలోని మార్పు అతనికి తెలిసి పోయిందని. ఇక తలెత్తి అతనివైపు చూడలేక పోయింది. అతను వెళ్లి పోతుంటే వెనకే వెళ్లింది వీధి గుమ్మం వరకు. ఉమకప్పుడు గాని గుర్తు రాలేదు. తనకతని పేరైనా తెలియదని.


"ఇన్ని కబుర్లు చెప్తున్నారు. మీ పేరేమిటో నాకు తెలియదింతవరకు." అన్నది అతని వైపు చూడకుండానే.

"అబ్బ! ఇప్పుడా జ్ఞాపకం వచ్చింది? ఎప్పుడడుగు తారా అని ఎదురు చూస్తున్నా. సరే! నా పేరేమిటో తెలుకోవాలని వుందాండీ? గోపాలకృష్ణ. అమ్మ గోపీ అని పిలుస్తుంది. స్నేహితులు గోపాల్ అని పిలు స్తారు. ఇక కృష్ణా అని పిలిచే వారింతవరకు తటస్థ పడలేదు. ఇప్పుడనిపిస్తోంది. ఒకరలా పిలిస్తే బాగుండునని, కాని, వాళ్లు కిష్టమవాలిగా మరి?" చిలిపిగా అనేసి గుమ్మం దిగి పోయాడతను.

మర్నాడు తెల్లవారేసరికి అమ్మమ్మకు తేలికగా వుండటంతో కుదుట పడింది ఉమ మనసు. ఆ రోజు మధ్యాహ్నం అయిన దగ్గర్నుంచి ఎదురుచూసింది గోపాల్‌కోసం. ఆ రోజు... మరురోజు... అలా ఉమ ఎదురు చూస్తుండగానే మళ్లీ ఆదివారం వచ్చేసింది. ఈ వారం రోజులూ ఉమ అతని కోసం ఎదురు చూసి, చూసి విసిగి పోయింది.

"ఇవాళ ఆదివారం. అతను వస్తాడు బహుశా. అప్పటికి తనింట్లో వుండకూడదు. అదే తగినశాస్తి. అనుకొని మూడు గంటలకే తయారై, అమ్మమ్మతో చెప్పి శ్యామలా వాళ్లింటికి వెళ్లింది ఉమ. శ్యామలా వాళ్లింట్లో అడుగు పెడుతూనే ప్రక్కగదిలోంచి మగవాళ్ల గొంతుకలు వినబడేసరికి అయ్యో! వాళ్ల బావ వున్నారేమో, ఇప్పుడొచ్చాను నేను" అనుకొం టూనే లోపలికెళ్లింది.

శ్యామలా వాళ్లమ్మగారు అరటికాయలు తరు గుతూ వంటింటి గుమ్మంలో కూర్చునున్నారు. వెళ్లి



ఆవిడ దగ్గరగా కూర్చొని "శ్యామల లేదాండి?" అనడిగింది ఉమ.

ఆవిడ "ఉన్నదమ్మా! వాళ్ళ బావ వచ్చాడు. అతని ఫ్రెండ్ ఇంకెవరో వచ్చాడు. వాళ్ళతో మాట్లాడు తోంది. పిలుస్తానుండు." అని "శ్యామా!" పిలిచారావిడ.

"ఏమ్మా! బజ్జీలయి పోయాయా?" అంటూవచ్చింది శ్యామల. ఉమను చూసి "అ(రే" అంటూ వచ్చి గట్టిగా పట్టేసుకొంది.

"అబ్బ! ఎన్నాళ్ళయిందే ఉమా నిన్ను చూసి. ఈ మధ్య రావటం మానేశావు." అంది నిష్ఠూరంగా.

"ఏయ్ శ్యామలా! తిన్నగా మాట్లాడు. క్రిందటి ఆదివారం వస్తే, మీ బావతో సినిమాకు చెక్కేశావ్ ఒక్కతెనీ ఏం తోచక చచ్చాను.' అంది ఉమ విడిపించు కొంటూ.

"పోన్లే, పోన్లే, తిట్టకు. నాదే తప్పు. సరేనా! మా బావను చూడ్లేదుగా? చూద్దూగాని రా! అమ్మా అవయి పోగానే పిలువే. వచ్చి తీసికెళ్తాను." అని ఉమ చెయ్యి పట్టుకొని లాగింది.

'అబ్బ! వద్దే శ్యామూ! అతని ఫ్రెండ్ ఇంకెవరో వచ్చినట్టున్నారు. ఇంకోసారెప్పుడైనా చూస్తాగా! ఇవాళ్టికి వదిలెయ్యి" బతిమాలుకొంది ఉమ. కాని శ్యామల వూరుకోలేదు.

"అబ్బ! అంత పొగరూ ఏమయి పోయిందే?! వాళ్ళతో సమంగా వాళ్ళను మనం కూడా ఏడిపిస్తే గాని, ఈ మగవాళ్ళ ఆటలుకట్టవు అనేదానివి. ఇపుడు ఆ మగవాళ్ళముందుకురావటానికేజడుస్తున్నావేం?" అంది

"వెళ్ళమ్మా! కలవయిపోయిందతనికి. రాత్రికి వెళ్ళిపోతాడు. మళ్ళీ పెళ్ళికే వస్తాడు. నీ స్నేహితు రాలి భర్తను నువ్వు చూడవా ఏమిటి? శ్యామలా వాళ్ళమ్మగారు నవ్వుతూ అన్నారు. దాంతో కదలక తప్పలేదు ఉమకు.

ఆదివారం సాయంత్రం

శ్యామల వెనకే వాళ్ళున్న గదిలోకి నడిచిన ఉమ, ఎదురుగాకుర్చీల్లో కూర్చునిసిగరెట్టుకాలుస్తూ కబుర్లు చెప్పుకొంటున్న వాళ్ళను చూసి తెల్ల బోయింది. శ్యామల ఇదేం తెలియక,

"ఇదిగో ఉమా! తను మా బావ. ఎం. ఎస్. సి. పాసయ్యారు. ప్రస్తుతం కలకత్తాలో ఒక కంపెనీలో పనిచేస్తున్నారు. ఇక ఈయన..."అంటూ ఉమకేసి తిరిగింది.

అతను నవ్వుతూ "ఆగండి శ్యామలాదేవీ! మీ ఫ్రెండ్ ఉమాదేవికి నాపేరు నేనే చెప్పుకొంటాను" అనేసరికి, వారంరోజులుగా అతనికోసం ఎదురు చూస్తూ, మనసులో నలిగ్గొడుతున్న పేరును, అప్రయత్నంగా పెదాలు బయటకుచ్చరించాయి.

"కృష్ణా!" ఉమనోటినుండి తన పేరును విన్న గోపాల్ ప్రఫుల్లవదనంతో,

"నాకు తెలుసు ఉమా! నువ్వు అలా పిలుస్తావని" అనేసి తెల్లబోయిచూస్తున్న బావామరదళ్ళ వైపు తిరిగి,

"చూడండి! మేం కూడా మీ త్రోవలోకి వచ్చేశాం. సో, ఇప్పుడీ రెండు జంటలు కలిసి అలా... అలా....."అతను అభినయం చేస్తోంటే, శ్యామల హటాత్తుగా ఉమను చేతులలో చుట్టేసింది.

"అమ్మదొంగా! ఇంతకథ నడిపావా? నేనో వెర్రిదాన్ని. అన్నీ చెప్తోంటే వినేసి, నీ మనస్సులోని రహస్యాలురహస్యాలుగానే వుంచుకొన్నావా?" అంది.

ఉమ సిగ్గుతో చితికిపోతూ "అబ్బ! వుండవే రహస్యంలేదు పాడూలేదు. అసలు మొంది పెద్ద మనిషి వారంనాడు మాయమై, ఈనాడు కనిపించారు. కారణం తెలుసుకోనీ." అని అతనివైపు చూసింది.

"అబ్బే! అలాంటి సంశయాలేం పెట్టుకోకండి. మీరు మామీద ఆగ్రహిస్తే నిలువగల వోపికలేదు మేడమ్! ఏదో మరి మీలాంటి వాళ్ళని జీవితంలోకి ఆహ్వానిస్తూ, ఆబోడి లెక్చరర్ గిరీతో సుఖపెట్ట లేమేమో అని అనుమానమొచ్చి, అలా కలకత్తా దాకా వెళ్ళి, ఏదో తిండికీ, బట్టకూ ... తమరి మేకప్ సామాన్లకూ......' అంటూ ఆడపిల్లలవైపు చూసే సరికి వాళ్ళు గుడ్లురుముతూండడంతో, భయ పడ్డట్టు "అబ్బే! మీక్కాదండి, మాకు మేకప్ సామాన్లకూ, బట్టలకూ సరిపడ జీతం వచ్చే ఉద్యోగం సంపాదించుకొచ్చాం." అని వాచీచూసి "అచ్చా! ఐదుగంటలైంది. ఇక అనుగ్రహిస్తే అలారామకృష్ణామిషన్‌బీచ్‌దాకావెళ్ళొద్దాం."అనేసరికి

"అమ్మమ్మతో చెప్పలేదు కంగారుపడుతుంది ఆలశ్యమైతే"అంది ఉమ "వెళ్ళేటపుడు నేనొచ్చి అన్ని విషయాలూ మాట్లాడతాగా"అన్నాడు కృష్ణ. ఇంత వరకు శ్రోతగా వుండిపోయిన సుధాకర్ తేరుకొని "ఓరి!నీమనసులోని రాధ ఈవిడట్రా?"అన్నాడు.

"అవునురా! అలా అనే సంతృప్తి పడదామను కొంటున్నా. ఇక ఎదురు చూసే వోపికలేదు మరి" కొంటెగా ఉమవైపుచూస్తూ అన్నాడు కృష్ణ.

"మీరేం సర్దుకొని ఎవర్నీ ఉద్ధరించనక్కర్లేదు. శ్యామా! నే వెళ్తున్నా! అమ్మమ్మ ఎదురు చూస్తుంటుంది" అని వెనక్కు తిరిగింది.

"మేడమ్! మేడమ్! తమాషా కన్నానండి. అందమైన ఆదివారం సాయంత్రాన్ని మీ అలుకలతో పాడు చెయ్యకండి" అన్నాడు కృష్ణ.

అప్పటి అతని ముఖాన్ని తృప్తిగా చూసి ఫక్కున నవ్వింది ఉమ.

(37వ పేజీ తరువాయి)

అన్నాడు ఆనంద్ వస్తూ. శారద చేసిన ఫోనందుకుని వచ్చాడతను.

"వారు...వారు. కనబడలేదు"

"అదుగో.అదేమిటి? అటువైపు"తక్కున అటుతిరిగింది.

మంచుని తదేకంగా సముద్రంలోకి చూస్తున్న రాధాకృష్ణను చూసింది శారద. ఆమె గుండెదడ తగ్గింది. ఇద్దరూ అటు వైపు నడిచారు.

గబుక్కున వారికో దృశ్యం కనబడింది. రాధాకృష్ణ అలా కెరటాల్లోకి నడిచిపోవడం కనిపించింది.

"అయ్యో...అయ్యో"అంది శారద.

ఒక్క అదటున వెళ్ళి రాధాకృష్ణ జబ్బ పుచ్చుకున్నాడుఆనంద్. తిరిగిచూశాడుఅతను.

"ఏమిట్రా? అలా వెళ్ళిపోతున్నా వెక్కడికి?"

"ఆ...ఏం లేదు? నువ్వెప్పుడొచ్చావు. శారదా! నువ్వూ వచ్చావా?"

మమతల వంతెన

తెప్పరిల్లింది శారద. వణుకుతున్న శరీరాన్ని అదుపులో తెచ్చుకుని

"పదండి ఇంటికి వెడదాం. బాబులిద్దరూ మీ కోసం చూస్తున్నారు" అని అంది.

'టెలి కమ్యూనికేషన్ చదువుతాను నాన్నా, అంటున్న పెద్దవాడు 'పెద్దయ్యాక నేనూ అంతే' అంటున్న చిన్న కొడుకు రాధాకృష్ణ మనసులో మెదిలారు.

అతన్ని ఆవహించిన వైరాగ్యపు తెర దిగింది. అంత దాకా అతన్ని ముంచిన ప్రశ్నలు గుర్తులేవు. ఆ తెర వదిలింది.

మళ్ళీ అంతా మామూలే. ఆశలు, ఆకర్షణలు. సంసారం, బంధాలు...అనుబంధాలు, ఆశయాలు, రాగద్వేషాలు. కోరికలు...ఏన్నో.

"పదండి" అన్నాడు చిరు నవ్వుతో.

శారద చేతిలో చెయ్యివేసి నడుస్తున్నాడు రాధాకృష్ణ. అతని భుజంమీద అత్యంత ప్రియ మిత్రుని చెయ్యి. అతని కష్టాల్లోనూ, సుఖాల్లోనూ భాగం పంచుకునే ఇద్దరి ఆత్మీయుల మధ్య తను.

"ఇంక నాకేం కావాలి? ఏమీవద్దు ఈ జీవితం గొప్ప వరం. ఈ జీవితాన్ని ప్రేమించాలి. నేను ప్రేమించడం నేర్చుకోవాలి. నా కోసమే కాదు. ఇతరుల కోసం కూడా. ఇంక ఈ ఇద్దరికీ నా మూలంగా కష్టం కలిగించను. నాకేం తక్కువ. ఇంత ప్రేమగా ప్రేమించే వ్యక్తులుండగా" అనుకున్నాడతను నడుస్తూ, నడుస్తూ.

[సమాప్తం]

అంకితం

శ్రీ వెంకటేశ్వరుని పాద పద్మములకు భక్తితో. నా ఈ మూడవ నవల అంకితం

- రచయిత్రి

మీరు కూడా సాయంత్రం మా యింటికి రండి. అమ్మ చెప్పమనంది.'' అన్నది బిక్కు బిక్కుగా.

"అలాగేనమ్మా!"

లలిత, పార్వతి ఒక ఈడువాళ్ళే, ఇద్దరూ ఒకళ్ల నొకళ్ళు విడిచి ఉండేవారు కాదు. లలిత లాంటి పార్వతి. పార్వతి లాంటి లలిత.

* * *

పెళ్లికొడుకు, అతనితండ్రి, మేనమామ హాల్లో కూర్చున్నారు. పార్వతిని తీసుకొచ్చారు.

భయం భయంగా కూర్చుంది.

పరీక్ష! అగ్ని పరీక్ష!!

పెళ్లికొడుకు మేనమామయే వో నాలుగు ప్రశ్నలేశాడు.

పార్వతి సమాధాన మిచ్చింది.

వాళ్ల ముఖ సూచనలను బట్టి పార్వతి నచ్చినట్లే ఉన్నది.

పార్వతిని లోపలకు వెళ్లవచ్చన్నారు యిక.

కొంచెంసేపైన తర్వాత పెళ్లికొడుకు మేనమామే 'యిక అసలు విషయంలోకి వద్దామన్నాడు.'

"చెప్పాను కదండి. అంతకంటే యెక్కువ మోవలేనని.''

"అయితే మేమింత దూరం రావట మెందుకండి. రెండెకరాలు, రెండు వేలకి సలక్షణమైన ఉద్యోగం చేసే కుర్రాడెవ డొస్తాడండి ?''

"అవుననుకోండి. పిల్లని చూశారుకద.'' రామనాథం అందుకున్నాడు.

"ఏమైనా లాభంలేదు.'' ఖండితంగా చెప్పేస్తున్నాడు పెళ్లికొడుకు మేనమామ.

రామనాథం వెనక అలికిడైతే వెనక్కి తిరిగి చూశాడు. కిటికీ అవతల పార్వతి ఫలితం కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది.

" పోనీ యింకొక వెయ్యి. " అన్నాడు పార్వతి తండ్రి.

"ఇవేమి బేరాలండి బాబు. మూడెకరాలకు మూడువేలకి ఒకదమ్మిడీ తగ్గినాలాభంలేదు.''

" లాభంలేదంటారా ? '' ఆఖరిసారిగా అడుగుతున్నట్లు అడిగాడు రామనాథం.

"చెప్తున్నాం కదండి. ఇంతకంటే యెక్కువే యిస్తామని వస్తున్నారు. ఇదైనా పిల్ల కాస్త బాగుందని ఒప్పుకోవాల్సి

తండ్రి మనసు

(17వ పేజీ తరువాయి)

వస్తుంది.''

"సరే. అలాగే కానివ్వండి.'' అన్నాడు రామనాథం.

"బావా ?'' పార్వతి తండ్రి కంఠంలో నిస్సహాయత ధ్వనించింది.

"నీవేమి యిచ్చుకోనవసరం లేదులేవయ్యా! వారు అదనంగా కోరేది నే నిస్తాను'' అన్నాడు రామనాథం.

"బావా!'' కంఠం రుద్ధమైనది వెంకట్రామయ్యకి.

"ఏం ఫరవాలేదు. పార్వతి నా బిడ్డ అనుకొంటున్నా. నీవు యిచ్చేది ఇవ్వు. నేను యిచ్చేది నేనిస్తాను. నా తదనంతరం నాకు మిగిలింది దానికే.''

వెంకట్రామయ్య నిశ్చేష్టుడై పోయాడు. వాక్కు లేనివాడయ్యాడు. తను ఉన్నవాడని, తన కొడుక్కి యింకా ఉన్నవాళ్లు వస్తున్నారని, రామనాథం లేనివాడని ఆ నాడు కాదని అతని కడుపులో చిచ్చు పెట్టాడు.

కాని ఆ నాడు తనలో, యీ నాడు తను వియ్యమందవచ్చిన వారిలో లేనిదేదో... రామనాథంలో ఉన్నది. మూర్తీభవించి ఉన్నది.

ఇంతవాడు అంతవాడుగా, అంతంత

తండ్రి మనసు

వాడుగా కన్పిస్తున్నాడు.

వెంకట్రామయ్య కళ్లు ఆర్ద్రత చెందినయ్. గొంతు పెగలటం లేదు. మాటలు రావటంలేదు. రెండు చేతులతో రామనాథం రెండు చేతుల్ని పట్టుకొని కళ్ల కద్దుకొన్నాడు.

అ వీ—ఇ వీ—అ న్నీ



మే 1 వ తేదీన విజయవాడలో సినీతార శ్రీమతి విజయనిర్మలను నారద సంగీత నృత్యకళాశాలవారు శ్రీ బయ్యన వీరరాఘవరావు అధ్యక్షతన కళాశాల ఆర్గనైజర్ శ్రీమతి యినటూరి సరోజిని ఆధ్వర్యాన సన్మానించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హీరో కృష్ణకూడా హాజరయ్యారు.

బుడతడి అద్భుత యాత్ర

పిల్లల నవల మా కార్యాలయం చేరింది. మూలం సెల్మాలాగర్ లోఫ్. తెలుగు అనువాదం: డాక్టర్ వి.ఎస్. శర్మ. 146 పేజీలు, వెల 2 రూపాయలు. ప్రచురణ: చిల్డ్రన్స్ గార్డెన్‌స్కూల్, మైలాపూర్, మదరాసు—4.

తెలుగు సినిమా డైరీ 1974

(చలనచిత్ర సంక్షిప్త సమాచారం) మా కార్యాలయం చేరింది. ఎడిటర్, పబ్లిషర్ శ్రీ ఎస్. రాజేశ్వరరావు, 64 పేజీలు, వెల 2 రూపాయలు, ప్రచురణ : చిత్రదర్శిని, సచిత్ర సినిమా మాస పత్రిక, గుంటూరు—3. విజయల లక్ష్మి బుక్ డిస్ట్రిబ్యూటర్స్, గుంటూరు—3.

విచిత్ర వేషాలు

'ఫన్ మాస్టర్' కె. హనుమాన్‌రెడ్డి రచన మా కార్యాలయం చేరింది. ఇందులో పూర్వానుభవంలేని విద్యార్థులకు, ఔత్సాహిక నటులకు, వృత్తి కళాకారులకు పనికి వచ్చే 103 రకాల వేషాలకు ఆహార్యము, మాటలు, పాటలు, దర్శకత్వ వివరాలు ఉన్నాయి. 108 పేజీలు, వెల 4 రూపాయలు. ప్రచురణ: శ్రీ లలితా పబ్లికేషన్స్, తణుకు, ప. గో. జిల్లా.

బాక్ట్రిమ్

సూక్ష్మజీవుల నాశనానికి ఇంతవరకూ 'యాంటిబయాటిక్స్'ని వాడటం తప్ప గత్యంతరం లేదనుకున్నారు. రోష్ సంస్థ ఉన్నతస్థాయి పరిశోధన ప్రయోగశాల 'బాక్ట్రిమ్' అనే కొత్త మందుని తయారు చేసింది. రోగకారకములైన సూక్ష్మ క్రిములని ఇది అంతంచేస్తుంది. యాంటిబయోటిక్స్ వాడటంవల్ల కలిగే దుష్ఫలితాలు ఇందులో చాలా తక్కువ అంటున్నారు. ఈ బాక్ట్రిమ్ తయారీలో 'సల్ఫామెథోక్సజోల్' అనే శక్తివంతమైన ఔషధ పదార్థం ఉపయోగింపబడింది. బాక్ట్రిమ్‌ని మొట్టమొదటిసారిగా భారత్ — పాక్‌యుద్ధంలో ఇండియాలో వాడటం జరిగిందని రోష్ సంస్థవారు విడుదలచేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ●

ఉత్తరాలు

కథలు

ప్రేమలేఖలు కథలో శ్యామల దగ్గరకు వచ్చిన వ్యక్తిని వర్ణిస్తూ "...నిలువుగీతల నల్లబెల్ బాటమ్ పాంటు ఒత్తుగా పెరిగిన మీసాలు" అని వ్రాశారు. అంతే త్రిగున్‌గారు వేసిన బొమ్మలో అతనికి మీసాలు అసలు లేవు ఇంకా శ్యామల కనీసం ఒక్క ప్రేమలేఖ అయినా చూడకుండా కొత్త వ్యక్తికి తన గొలుసు నివ్వడం చిత్రంగా ఉంది.

పి. జగదీశ్వర్‌రెడ్డి, (వరంగల్)

*   *   *

ఈ వారం (తేది 24—5—74) ముఖచిత్రం 'మంజుల' అత్యంతాకర్షణీయంగా ఉంది.

'పెళ్లికోసం' కొత్త తరహా కథ.

గుండాల వేంకటేశ్వర రావు, (భువనేశ్వర్.)

మినీ ఇంటర్వ్యూ

10 వ తరగతి పరీక్షల్లో విజయవాడలో ఫస్టు వచ్చిన అబ్బాయిపేరు ఇ. శివసుబ్రహ్మణ్యం (రైల్వే స్కూలు) బిషప్ అజరయ్య హైస్కూల్లో ఫస్టు వచ్చిన అమ్మాయిపేరు కపిల సంధ్య. మినీ ఇంటర్వ్యూలోని శంకరగిరి సరస్వతి ఫస్టుమార్కులు తెచ్చుకుందే కాని 'ఫస్టు'కాదు పాఠకులు గమనించ ప్రార్థన.

గీతా ఫీచర్స్, (విజయవాడ)

కారకులు ఎవరు ?

1. భారతదేశంలో ఇప్పుడు 4 ఉక్కు ఫ్యాక్టరీలు వున్నాయి. అన్నీ ఉత్తర భారతంలోనేఉన్నాయి. 5వది, మూడు దక్షిణ రాష్ట్రాలకు పంచిఇచ్చారు.

2. భారతదేశంలో యిప్పుడు నాలుగుసెంట్రల్ యూనివర్శిటీలు వున్నాయి. అన్నీ ఉత్తర భారతంలో వున్నాయి. నిర్మాణంలో యున్న రెండు సెంట్రల్ యూనివర్శిటీలలో ఒక్కటి మాత్రమే దక్షిణ భారత్ లో (హైదరాబాద్) వున్నది.

3. ఇక కేంద్ర ప్రభుత్వాన్ని పరిశీలిస్తే, కాబినెట్, స్టేట్ మంత్రులు మొత్తం 35 మందిలో కేవలం 5 గురు మాత్రమే దక్షిణ భారతీయులు.

4. ఎలక్ట్రిఫైడ్ రైల్వేలు దక్షిణ భారత్‌లో మద్రాసు సమీపంలో కొద్దిదూరం మాత్రమే వుంది. ఆంధ్రలో ఎలక్ట్రిక్ ఇంజను చూసినవారు ఎందరు? (అంటే ఆంధ్రులకు ఇది చూసే సరికి దశాబ్దం పట్ట వచ్చు. విజయవాడ—మద్రాసు మార్గము ఎప్పుడు పూర్తి అవుతుందో వూహించాలి:)

5. ఇదే విధంగా రేడియో స్టేషన్లు, ఎయిర్ పోర్టుల సంఖ్య పరిశీలిస్తే చాలా తక్కువ దక్షిణ భారత్‌లో.


6. హెవీఇండస్ట్రీలను, ఇతర ఇండస్ట్రీలను గురించి ఆలోచిస్తే, బొంబాయి, పూనాలలో వున్న మొత్తం ఇండస్ట్రీలలో దక్షిణ భారత్‌లో సగం కూడా లేవేమో అనిపిస్తుంది.

7. ఇదే విధంగా మొత్తం దక్షిణ రాష్ట్రాలలో వున్న యూనివర్శిటీల మొత్తం, ఒక్క యు. పి. లో వున్న యూనివర్శిటీల సంఖ్యకు సమానం అవుతుంది.

8. వీటి అంతటికీ కారణం ఎవరు? మన పాలకులా?లేక మన అసమర్థతకా? లేక ఇతర కారణాలు ఏమన్నా వున్నాయా?

కల్లూరి వాసుదేవరావు, వారణాశి.

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna



"ప్రేమనగర్" హిందీ చిత్రంలో
రాజేష్, హేమాలు


పల్లవీ ప్రొడక్షన్స్

అందరూ దొంగలే

ఈస్ట్‌మన్ కలర్

నిర్మాత:
అక్కినేని ఆనందరావు

దర్శకుడు:
వి. బి. రాజేంద్ర ప్రసాద్ B.Sc.



మాటలు: ఆత్రేయ-భమిడిపాటి సంగీతం: కె.వి. మహదేవన్ ఫొటోగ్రఫీ: ఎస్. వెంకటరత్నం W.I.C.A. కళ: ఎస్. కృష్ణారావు అన్నపూర్ణా ఫిలింస్ రిలీజ్